తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-10-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 253 పేజీలు: 10+4 వెల: 6.50







ఆదివారం హైదరాబాద్‌లో మహారాజా అగ్రసేన్ 5150 జయంతి ఉత్సవాల్లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా, అఖిల భారత వైశ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ, బదిరి విశాల్ బన్సల్, సురేష్ కుమార్ అగర్వాల్, గోపాల్ మోర్ తదితరులు



వేడుకల్లో వైశ్ ఫెడరేషన్ తెలంగాణ అధ్యక్షుడు సురేష్ కుమార్ అగర్వాల్‌ను సన్మానిస్తున్న గవర్నర్ శుక్లా. చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ, ప్రభుత్వ సలహాదారు విహెచ్ తదితరులు



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను సన్మానిస్తున్న గవర్నర్ శుక్లా. చిత్రంలో డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ, అగర్‌వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా, నరేందర్ కుమార్ గోయెల్, చిమస్ లాల్ సురేష్ కుమార్, గోపాల్ మోర్, సురేష్ కుమార్ అగర్‌వాల్

# సహకారం, ప్రోత్సాహం, సద్భావనతోనే దేశాభివృద్ధి సాధ్యం

>> తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు మహాసమ్మేళనం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ అధ్యక్షత వహించారు. పూజలు, దీపప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మహారాజా అగ్రసేన్ జయంతి, శారదీయ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్ల సమాజ బంధువులకు, అతిథులకు శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ ప్రస్తావించిన వర్ణ వ్యవస్థ అంశంపై గవర్నర్ మాట్లాడుతూ, భగవద్గీతలో శ్రీకృష్ణుడు నాలుగు వర్ణాలను గుణాలు, కర్మల ఆధారంగా వివరించారని తెలిపారు. వర్ణ వ్యవస్థను రాజకీయాలకు ఉపయోగించకూడదని అన్నారు. దేవతలతో పాటు మనుషుల పాదాలకు కూడా పూజలు నిర్వహించే సంప్రదాయం ఉందని, కులాల ఆధారంగా సమాజంలో విభజన పెరగడం విచారకరమని పేర్కొన్నారు. సామాజిక ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహారాజా అగ్రసేన్ తన వంశాన్ని 18 గోత్రాలుగా విభజించి, ఒకే గోత్రంలో వివాహాలు జరగకూడదనే నియమాన్ని విధించారని గవర్నర్ గుర్తుచేశారు. సుమారు 5000 సంవత్సరాల క్రితమే మహారాజా అగ్రసేన్ సమాజానికి నూతన దిశను చూపించి, అహింసకు ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. వైశ్య సమాజానికి గొప్ప చరిత్ర, సమృద్ధమైన వారసత్వం ఉందని, ఈ సమాజం తన సామర్థ్యంతో మరింత ముందుకు సాగగలదని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపును ప్రస్తావిస్తూ, యువత ఉద్యోగాలు కోరేవారిగా కాకుండా ఇతరులకు ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు ఉత్పత్తి, పారిశ్రామిక అభివృద్ధి, స్వావలంబనకు ప్రోత్సాహాన్నిస్తాయని పేర్కొన్నారు. సమాజంలో పరస్పర సహకారం, ప్రోత్సాహం, సద్భావనను పెంపొందించుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. మహారాజా అగ్రసేన్ ప్రజా సంక్షేమం, సమాజ ఐక్యత, అహింసకు ప్రాధాన్యమిచ్చిన గొప్ప పాలకుడని కొనియాడారు. ఆయన ఆదర్శాలను నేటి తరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆకాంక్షించారు. సనాతన ధర్మంలో చతుర్వర్ణ వ్యవస్థ గుణాలు, కర్మల ఆధారంగా ఏర్పడిందని పేర్కొన్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు వివరించినట్లుగా విద్యాబోధన, సమాజ రక్షణ, ఆర్థిక పోషణ, సేవ వంటి బాధ్యతలు సమాజ అభివృద్ధికి దోహదపడతాయని వివరించారు. దేశ పారిశ్రామిక ప్రగతిలో వైశ్ సమాజానికి చెందిన పారిశ్రామికవేత్తలు గణనీయమైన పాత్ర



వేడుకల్లో గవర్నర్ సతీమణి జానకీ శుక్లాను సన్మానిస్తున్న శ్రీమతి అల్కా సంఘీ

పోషిస్తున్నారని, ముఖేశ్ అంబానీ వంటి ప్రముఖులు దీనికి ఉదాహరణగా నిలుస్తున్నారని తెలిపారు. యువత ఉద్యోగాలు కోరేవారిగా కాకుండా ఉద్యోగాలు కల్పించేవారిగా ఎదగాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షను ప్రస్తావించారు. మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా స్వదేశీ, విదేశీ సంస్థలు భారత్‌లో తయారీ రంగాన్ని బలోపేతం చేస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. వ్యాపార రంగంలో నూతన ఆలోచనలను ప్రోత్సహించడం, పారిశ్రామికవేత్తలకు అనుకూల పరిస్థితులు కల్పించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. లక్ష్మీదేవిని కులదైవంగా ఆరాధించే వైశ్ సమాజం సంపదను ఆర్జించడంతోపాటు ప్రజాసేవకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. మహారాజా అగ్రసేన్‌కు చరిత్రలో తగినగుర్తింపు లభించలేదని, ఆధునిక చరిత్రకారులు ఆయన జీవితం, సేవలకు సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తిచేశారు. తెలంగాణ శాసనసభాపతి గడ్డంప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. త్యాగం, కరుణ, శాంతి, సౌభాగ్యం, నిజమైన సమానత్వానికి మహారాజా అగ్రసేన్ ప్రతీకగా నిలిచారని అన్నారు. సమాజ హితం, సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సహజీవన సౌహార్దం కోసం కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని గుర్తుచేశారు. సద్భావన, పరస్పర సోదరభావమే మహారాజా అగ్రసేన్ అందించిన శాశ్వత సందేశమని, అది ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. సూర్యవంశంలో జన్మించిన అగ్రసేన్ చిన్నతనం నుంచే కరుణకు మారుపేరుగా నిలిచారని, యుద్ధం చేయగలిగిన శక్తి ఉన్నప్పటికీ శాంతికి ప్రాధాన్యమిచ్చారని వివరించారు. రాజ్యాన్ని పాలించగలిగినా ప్రజలకు వ్యాపారం నేర్పించి స్వావలంబన బాట చూపారని పేర్కొన్నారు. ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలను నేటి తరాలు గుర్తుంచుకోవాలన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో అగర్వాల్ సమాజం, వర్తక సంఘాలు పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని స్పీకర్ అన్నారు. అన్నదానం, వైద్య శిబిరాలు, విద్యారంగ సేవల ద్వారా పేద ప్రజలకు అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. అగర్వాల్ సమాజానికి చెందినవారు ఎక్కడికి వెళ్లినా ధర్మశాలలు, గోశాలలు, పాఠశాలలు ఏర్పాటు చేస్తూ సామాజిక సేవలో ముందుండటం సంతోషకరమన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా సమాజంలోని అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా వైశ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గిరీశ్ కుమార్ సంఘీమాట్లాడుతూ.. వేడుకలకు విచ్చేసిన ప్రముఖులకు, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులకు వైశ్య సమాజం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. వైశ్ సమాజం సంపదను సృష్టించడంతో పాటు ఉద్యోగాలు కల్పించే, నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చే శక్తిగా ఎదిగిందని పేర్కొన్నారు. మానవ సమాజ అభివృద్ధిలో తొలి ఆవిష్కరణల నుంచి ఆధునిక పారిశ్రామిక రంగం వరకు వైశ్ సమాజం సేవలు విశేషమైనవని కొనియాడారు. మహారాజా అగ్రసేన్ అహింసకు ప్రతీక అని, ఆయన ఆశయాలను అనుసరిస్తూ వైశ్ సమాజం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. వైశ్ సమాజం విశాలమైన కుటుంబమని, సనాతన ధర్మానికి ముఖ్యమైన స్తంభమని పేర్కొన్నారు. దేశ ఆర్థిక, సామాజిక ప్రగతిలో ఈ సమాజం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. లక్ష్మీదేవి అనుగ్రహంతో వైశ్ సమాజం వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని, ప్రభుత్వ సహకారం లభిస్తే దేశ ప్రగతికి మరింతగా తోడ్పడగలదని పేర్కొన్నారు. వైశ్ సమాజం దేశ అభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని, సమాజం వారి వ్యాపార రంగానికి అడ్డంకులు సృష్టించకపోతే చాలు ఇంకా ఎంతో దేశానికి ముందుకు తీసుకెడుతుందన్నారు. మహారాజా అగ్రసేన్ ధామ్‌ను ఆవిష్కరించుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా పార్క్ స్థలాన్ని కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. జిహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌కు, సహకరించిన ఇతర అధికారులకు సభా ముఖంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఈ స్థలాన్ని దేశం నలుమూలల నుంచి వైశ్ సమాజం వారు వచ్చి దర్శించుకునేందుకు వీలుగా అగ్రసేన్ తీర్థ స్థలంగా మారుస్తామని చెప్పారు.

తెలంగాణ ప్రథమ మహిళ జానకి శుక్లాకు అల్కా సంఘీ సత్కారంఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ ప్రథమ మహిళ జానకి శుక్లాను అల్కా సంఘీ, ప్రేమలత అగ్రవాల్, అనురాధ బన్సల్, విమల్ తాయల్, సంగీత మోర్, మేఘరాణి అగ్రవాల్ తదితర మహిళా ప్రతినిధులు ప్రత్యేకంగా సత్కరించారు. వేడుకల్లో పెద్ద సంఖ్యలో వైశ్య, అగ్రవాల్ సమాజాల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ రాజ్య సభ సభ్యులు, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, క్యాట్ సభ్యుడు మనోజ్ గార్గ్, విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఏ.కె. గోయల్, వినోద్ అగర్వాల్, తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా, అఖిల భారతీయ వైశ్ సమ్మేళనం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోపాల్ మోర్, తెలంగాణ ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, అఖిల భారతీయ వైశ్ సమ్మేళనం సీనియర్ ఉపాధ్యక్షుడు బి.వి.బన్సాల్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్ అగర్వాల్, తెలంగాణ అగర్వాల్ సమాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్ర గోయల్, సునీల్ కుమార్ పటోడియా, ఆర్య వైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి కె.మల్లికార్జున, రాజేశ్ అగర్వాల్, రాంనివాస్ బన్సాల్, సురేశ్ జగ్నాని, సురేశ్ సింఘాల్, ముఖన్‌లాల్ అగర్వాల్, జ్యోతి ప్రకాశ్ తిబ్రేవాలా, ప్రమోద్ కుమార్ సరైవాలా, సి. సురేశ్ అగర్వాల్, విజయ్ వితల్దాస్, ప్రవీణ్ ఖండేల్వాల్, ప్రదీప్ షా తదితరులు పాల్గొన్నారు.

## జిబౌటి తీరంలో పడవ మునక

>> ప్రయాణిస్తున్న పడవ జిబౌటిలోని ఒబాక్ పట్టణానికి ఉత్తరాన సముద్రంలో బోల్తా పడినట్లు ప్రాణాలతో బయటపడిన వారు తెలిపారని ఐఓఎం తన ప్రకటనలో పేర్కొంది. ఈ ఘటనపై జిబౌటిలో ఐఓఎం మిషన్ చీఫ్ అలెగ్జాండర్ కోయిసాక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "ఇది ప్రాణనష్టంతో కూడిన విషాదకర ఘటన. ప్రాణాలతో బయటపడిన వారికి, తమ ఆత్మీయులను కోల్పోయిన లేదా వారి ఆచూకీ తెలియక ఆందోళన చెందుతున్న కుటుంబాలకు మా సానుభూతి తెలియజేస్తున్నాం అని ఆయన పేర్కొన్నారు. బాధితులకు అత్యవసర సహాయం అందించేందుకు జిబౌటి అధికారులతో కలిసి ఐఓఎం బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయని తెలిపారు.

ప్రమాదంలో మృతదేహాలుగా గుర్తించిన 109 మందిలో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది బాలికలు, ఆరుగురు బాలురు ఉన్నట్లు ఐఓఎం వెల్లడించింది. ఈ ప్రమాదం నుంచి 80 మందికి పైగా ప్రాణాలతో బయటపడగా, వారంతా ఇథియోపియా దేశస్థులేనని తెలిపింది. పేదరికం, అభద్రత, వాతావరణ మార్పుల ప్రభావం కారణంగా అనేక మంది మెరుగైన ఆర్థిక అవకాశాల కోసం ప్రమాదకర ప్రయాణాలకు సిద్ధమవుతున్నారని ఐఓఎం పేర్కొంది.

బాబ్ ఎల్‌మండెబ్ జలసంధిని దాటి యెమెన్కు చేరుకుని, అక్కడి నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వలసదారులు అనేక ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని తెలిపింది. మధ్యప్రాచ్యంలో అస్థిర పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, ఉపాధి కోసం వలసలు పెరుగుతున్నాయని వివరించింది.

## భానుడి భగభగలు

>> ముదురు తుండటంతో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 36 డిగ్రీలకు పైబడి గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రంలోని నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 37.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, ఖమ్మంలో 37.3 డిగ్రీలు, పెద్దపల్లిలో 37.2 డిగ్రీలు, నాగర్‌కర్నూల్, కొత్తగూడెం, నిజామాబాద్, సూర్యాపేట్, సిద్దిపేట్, ఆసిఫాబాద్ జిల్లాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్నాయి. ఈ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడి ఇప్పటికే రాష్ట్రంలోని 21 జిల్లాల్లోని 353 మండలాల్లో 20 నుండి 59 శాతం లెటే వర్షపాతం నమోదైంది.

కాగా మరోవారంలో ఎండలతీవ్రత ఉధృ తం కానున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అయితే ఈ నెల 13న బంగాళాఖాతంలో వాయుగుడం ఏర్పడే అవకాశం ఉన్న దృష్ట్యా దీని ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలకు ఛాన్స్ ఉందని తెలిపింది.

## భవిష్యత్ జన్ జడ్‌దే

>> మోడీ అన్నారు.దేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియకు వ్యతి రేకంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత నిరసనలు చేపడుతున్న నేపథ్యంలో మోడీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై నిరసనలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ఈఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లు అందులో పేర్కొన్నారు. 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందు యువతతో సంబంధాలను బలోపేతం చేసు కునే ప్రయత్నంలో భాగంగానే చెన్నైలో మోడీ చేసిన ప్రసంగాన్ని కొందరు రాజకీయ పరిశీలకులు చూస్తున్నట్లు నిపుణుల అంచనా.

మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి సొంతంగా సంపూర్ణ మెజారిటీ లేదని, నిరుద్యోగం, ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకత కొరవడిందనే భావన యువతలో అసంతృప్తికి కారణమవుతోందన్నది విశ్లేషకుల వాదనగా ఉంది.

## వారం - వర్జ్యం

**12-10-2026, సోమవారం,**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,**
**శరదృతువు, శుక్లపక్షం, చిత్త కార్తె,**
తి. విదియ రా.10.17
న.స్వాతి రా. 11.54 వ. లేదు
దు.1. మ.12.17-మ.1.04
2. మ.2.39-మ.3.26
రా ఉ.7.30-ఉ.9.00 శుభ ఉ.6.00-7.00

## వార్తాఫలం

**మేషం :** గృహాలంకరణకు ప్రాముఖ్యతనిస్తారు. వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. అధిక ధన వ్యయం చేస్తారు.

**వృషభం :** నిష్ణాతుల నుండి సలహాలను తీసు కుంటారు. విద్యా, వైద్యరంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది.

**మిథునం :** వినోద కార్యక్రమాల పట్ల ఆసక్తిని కనబరుస్తారు. నూతనమైన ఫైనాన్షియల్ స్కీమ్స్ సభ్యత్వాన్ని తీసుకుంటారు.

**కర్కాటకం :** మనస్సులోని భావాలను మిత్ర వర్గంతో పంచుకుంటారు. భూమి గృహసంబంధమైన విషయాలు సానుకూల పడతాయి.

**సింహం :** సౌందర్య సాధక చిట్కాలను పాటిస్తారు. రహస్య వ్యూహాలను అమలు పరుస్తారు. వ్యాపార దక్షతను కనబుస్తారు.

**కన్య :** ఉన్నత స్థాయివారినుండి వాగ్దానాలను తీసుకుంటారు. ఖర్చులు అధికంగా ఉంటాయి. మీ ఆలోచనలు చురుగ్గా సాగుతాయి.

**తుల :** వివాదాస్పదమైన అంశాలను సామరస్యంగా పరిష్కరించుకుంటారు. ప్రకటనలు లాభిస్తాయి.

**వృశ్చికం :** కుటుంబ బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తారు. మీ పైనున్న గుడ్ విల్ ఋజువు చేసుకోగలుగుతారు.

**ధనుస్సు :** ఉన్నత విద్యా అవకాశాలు కలిసి వస్తాయి. ప్రయోజనం ఆశించి మీరు చేసే అన్ని పనులలోను లబ్ధి కలుగుతుంది.

**మకరం :** కుటుంబంలో ఇతరులు మితిమీరిన జోక్యానికి అడ్డుకట్ట వేస్తారు. కఠినమైన పనులను కూడా నిర్వహించగలుగుతారు.

**కుంభం :** నూతన ఉద్యోగ ప్రయత్నాలలో సానుకూల ఫలితాలు సాధిస్తారు. వాహనాలు నడిపేటప్పుడు మెలకువలు అవసరం.

**మీనం :** సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. అబద్దాలతో కాలం వెల్లదీస్తున్న పని దొంగలను కట్టుదిట్టంగా పట్టుకుంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## వంటింట్లో ధరల మంటలు!

>> తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎల్‌నినో.. రైతుల నుంచి సామాన్య ప్రజలకు వరకు ప్రతి ఒక్కరికీ ఇది పెను శాపంగా మారింది. ఓ పక్క వర్షాలు లేక రైతులు వేసిన పంటలు ఎండిపోతుంటే.. మరోవైపు ఉత్పత్తి తగ్గి నిత్యావసర వస్తుల ధరలు పెరిగి సమాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా చెరకు ఉత్పత్తిలో అతిపెద్ద ఉత్పత్తి దారైన మన దేశంలో పరిస్థితి దారుణంగా మారిపోయింది. ఎల్‌నినో తీవ్రరూపం దాల్చడంతో దేశంలో చక్కెర ఉత్పత్తిపై తీవ్ర ఆందోళనలు నెకొన్నాయి. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో చెరకు దిగుబడి మరింత పడిపోయే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే ఇప్పటికే దేశంలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బియ్యం ధరలు అధికారిక లెక్కల ప్రకారం 30 నుంచి 40 శాతం పెరిగాయి. సాధారణ రకం బియ్యం రూ.8 వేలకు పైబడి బహిరంగ మార్కెట్‌లో పలుకుతున్నాయి. ఖరీఫ్ సాగుకు సంబంధించి వరికోతలు మొదలుకాగా, రైతుల వద్దకే వ్యాపారాలు వచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ఎక్కువకు కొనుగోలు చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో గత రెండు రోజులుగా ప్రైవేటు వ్యాపారులు రైతుల పంట పొలాల వద్దకెళ్లి, వరిపంట యంత్రాల ద్వారా కోత కోస్తుండగా, ధాన్యం క్వింటాలు రూ.3,350లకు కొనుగోలు చేశారు. దీన్ని బట్టి చూస్తే రాబోయే రోజుల్లో బియ్యం ధరలు ఎలా ఉండబోతున్నాయో అర్థమవుతోంది.

ఇదిలా ఉండగా, చక్కెర ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ సమయంలో ఇలాంటి హెచ్చరికలు రావడం ప్రజల్లో మరింత ఆందోళన కలిగిస్తోంది. వినియోగదారుల వ్యవహారాల శాఖ గణాంకాల ప్రకారం.. రిటైల్ మార్కెట్‌లో చక్కెర ధర అక్టోబరు 8, 2021న కిలోకు రూ.42.18గా ఉండగా, నాలుగేళ్లలో పెద్దగా మార్పులు లేకపోయినా.. గడిచిన ఏడాదిలోనే 18 శాతానికిపైగా పెరిగి అక్టోబరు 8, 2026 నాటికి కిలో రూ. 55.21కి చేరుకున్నాయి. ఇందుకు ప్రధాన కారణం దేశీయ, అంతర్జాతీయ పరిణామాలు కారణమని ప్రభుత్వం పేర్కొంది. నిత్యావసర సరుకుల్లో ముఖ్యమైన బియ్యం, వంటనూనెపై కూడా ఇప్పటికే తీవ్ర ప్రభావం పడుతోంది. దేశీయంగా పంటల దిగుబడి తగ్గడం, అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థలు దెబ్బతినే సూచనలు కనిపిస్తుండటంతో 2027 నాటికి దేశంలో వంటనూనెల కొరత తీవ్రమై, ధరలు మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇండియన్ వెజిటబుల్ ఆయిల్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ అంచనాల ప్రకారం, 2025-26 సీజన్‌లో దేశీయ నూనె ఉత్పత్తి 9.6 మిలియన్ టన్నులుగా ఉండగా, వాతావరణ మార్పుల కారణంగా రాబోయే 2026-27 సీజన్‌లో ఉత్పత్తి 5 నుంచి 10 శాతం తగ్గే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు.

దీని కారణంగా డిమాండ్ పెరిగి.. ధరకు కూడా పెరిగే ఛాన్స్ ఉందని నిపుణులు అంచానా వస్తున్నారు. ఈ పరిస్థితి కేవలంలో భారత్‌లోనే కాదు.. మనం వినియోగించే నూనెల్లో ఎక్కువ శాతం ఇండోనేషియా, మలేషియాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. అయితే అక్కడ కూడా ఎల్‌నినో ఎఫెక్ట్‌తో ఫామాయిల్ తోటలకు నీరు కరువైందట. దీనికితోడు నల్లసముద్రం ప్రాంతం నుంచి పొద్దుతిరుగుడు నూనె సరఫరాలో అంతరాయాలు, దక్షి ణ అమెరికాలో సోయా నూనె ఎగుమతులు తగ్గడం వల్ల 2027 నాటికి గ్లోబల్ వెజిటబుల్ ఆయిల్ ధరలు పెరుగుతాయని అంచనాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

## మీకు హక్కులు.. మాకు నిర్బంధాలా?

>> లేదన్నారు. అంతేకాదు, రెండ్రోజుల క్రితం హైదరాబాద్‌లోనూ కాంగ్రెస్ నాయకులు ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించి, లోక్ భవన్ ముందు బైఠాయించారు. రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు నిరసనలు చేపట్టేందుకు శాంతిభద్రతలు అడ్డురావా? అంటూ ప్రశ్నించారు.

మరి ఢిల్లీలో కాంగ్రెస్‌కు కావాల్సిన ప్రజాస్వామ్య హక్కులు.. తెలంగాణలో బిజెపికి ఎందుకు ఉండకూడదు? బిజెపి నాయకులు ప్రజల సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే మాత్రం తెలంగాణ ప్రభుత్వానికి శాంతిభద్రతల సమస్యలన్నీ గుర్తుకొస్తాయా? ఇదెక్కడి ప్రజాస్వామ్యం? అంటూ ప్రశ్నించారు. తెలంగాణలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినా.. కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోవడం లేదు.

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సహా బిజెపి నేతలను ఎక్కడికక్కడ అనేకసార్లు గృహనిర్బంధం చేస్తూ.. గొంతు నొక్కేస్తుందన్నారు. ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను పరామర్శించేందుకు వెళ్లే ప్రయత్నం చేసినా వందలాది మందిని.. బీజేపీ నాయకులను ఇళ్ల నుంచి బయటకు రానివ్వడం లేదన్నారు.

## ఢిల్లీకి తరలిన మంత్రులు, ఎంపీలు

>> బాధ్యుడైన ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని నిరసన చేపట్టనున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి వెళ్ళుతున్నారు. తెలంగాణ నుంచి కాంగ్రెస్‌కు చెందిన ఎగువ సభ,దిగువ సభ ఎంపిలు శాసనసభకు చెందిన 60 మంది ఎమ్మెల్యేలు, శాసనమండలిలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు ఢిల్లీకి ఆదివారం సాయంత్రం బయలుదేని రాత్రి వరకు చేరుకొన్నారు. టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ నాయకత్వంలో ప్రజాప్రతినిధులు,డిసిసి,సిడిసిసి అధ్యక్షులు, టిపిసిసి ఉపాధ్యక్షులు,ప్రధానకార్యదర్శులు, సీనియర్ నాయకులు ఎఐసిసిప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఆదేశాలతో వెళ్ళారు. తెలంగాణ ప్రభుత్వం,పార్టీ మొత్తం ఢిల్లీలో నిరసన చేపట్టడానికి తరలి వెళ్ళింది. శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, మంత్రులు పొన్నం ప్రభాకర్‌వాకిటిశ్రీహరి,జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పి.శ్రీనివాసరెడ్డి, తుమ్మలనాగేశ్వరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి నిరసనలో పాల్గొననున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌తోపాటు భారత రాష్ట్ర సమితి నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కూడా నిరసనకు మద్దతు తెలిపేందుకు బయలుదేరివెళ్ళారు.మూడు రంగుల కండువా వేసుకొన్న కాంగ్రెస్ నాయకులతో ఎయిర్‌పోర్టులు సందడిగా మారాయి.టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి రాహుల్‌గాంధీ పోరాటంకు మద్దతుగా సంగారెడ్డిలో సోమవారం ఉదయం 11గంటలకు ఐబి నుంచి ర్యాలీ చేపట్టి పాతబస్టాండ్ అంబెద్కర్ విగ్రహం వద్ద ముగిస్తారు.

## ఆగని నిరసనలు

>> తీసుకున్న వారిలో సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిటాస్ కూడా ఉన్నారు. ఆయనపై ఢిల్లీ పోలీసులు తీవ్రంగా దాడి చేశారని, అనంతరం గాయాలతో బాధపడుతున్న ఆయనను రహదారి పక్కన వదిలేశారని సీపీఐ(ఎం) ఆరోపించింది. రాజీవ్ చౌక్ నుంచి జంతర్ మంతర్ వైపు ర్యాలీగా వెళ్తున్న స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్‌ఐ), ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ), క్రాంతికారి యువ సంఘటన్ (కేవైఎస్) సభ్యులతో పాటు సీజేపీ మద్దతుదారులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అఖిల భారత అధ్యక్షుడు ఆదర్శ్ ఎం. సాజీ, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి సూరజ్ ఎలమోన్, కేంద్ర కార్యవర్గ సభ్యుడు అభిజిత్ మణిలాల్‌తో పాటు వందలాది మంది కార్యకర్తలపై రాజీవ్ చౌక్ వద్ద దాడి చేసి, అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలను మర్చిపోం. మేము వీధుల్లోకి రావడం కొనసాగిస్తాం. దేశంలోని అన్ని ప్రాంతాల్లో నిరసనలు మరింత విస్తరిస్తామని ఎస్‌ఎఫ్‌ఐ పేర్కొంది. మధ్యాహ్నం 2.30 గంటలకు ఆర్‌కే ఆశ్రమ్ మార్గ్ వద్ద నిరసనకు పిలుపునిచ్చిన ఏఐఎస్‌ఏ అధ్యక్షురాలు నేహా బోరాను కూడా ఇతర ఆందోళనకారులతో కలిసి విజయ్ చౌక్ సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం జంతర్ మంతర్ వద్ద నిరసన కొనసాగిస్తామని సీజేపీ మరోసారి ప్రకటించగా, పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు కొనసాగించారు. పోలీసు సిబ్బందిపై దాడి చేయడం, ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం వంటి ఆరోపణలు వీటిలో ఉన్నాయి. నిరసనల సందర్భంగా కొన్ని చోట్ల ఘర్షణలు, రాళ్లదాడి ఘటనలు చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనల్లో 15 మందికి పైగా భద్రతా సిబ్బంది గాయపడినట్లు తెలిసింది.

## సుప్రీం మార్చ్‌కు రండి

>> వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, నిరసనకారులపై పోలీసుల దాడులు, ఆందోళనకారులను అదుపులోకి తీసుకోవడంపై ఢిల్లీలో నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో రాహుల్ ఈప్రకటన చేసారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విడుదల చేసిన వీడియో సందేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, దేశం తరఫున సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వినతిపత్రం అందజేస్తామని, రాజకీయ పార్టీలు, లింగం, కులం, మతం, ప్రాంతీయ భేదాలకు అతీతంగా అందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మనం భారతీయులుగా సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహిస్తాం. పార్టీ, లింగం, కులం, సమాజం, రాష్ట్రం అనే భేదాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగుదామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలో శాంతియుతంగా సమావేశమైన యువకులపై పోలీసులు, బీజేపీ కార్యకర్తలు దాడి చేశారని ఆయన ఆరోపించారు. వారి హృదయాల్లో ద్వేషం, కోపం లేవు. ప్రేమతో వచ్చారు. కానీ పోలీసులు, బీజేపీ గూండాలు వారిని కొట్టారని వ్యాఖ్యానించారు. మనం కోరుకునే భారతదేశం ఇది కాదని , ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే వారు, భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నవారు అందరూ ఈ మార్చ్‌లో పాల్గొనాలని కోరారు. యువత, ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ సంఘాలు తమతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌లపై కూడా రాహుల్ గాంధీ విమర్శలు చేశారు.

ప్రజల గొంతును వారు అణచివేయలేరని అన్నారు. ఈ పిరికి వారు మమ్మల్ని భయ పెట్టలేరు. వారు తప్పుకోవా ల్సిందే" అని వ్యాఖ్యానించారు. భయపడకండి అనే తన సందేశాన్ని పునరుద్ఘాటిస్తూ, ప్రేమ, సోదరభావం, దేశభక్తితో అందరం కలిసి ముందుకు సాగుతామని తెలిపారు.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-10-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 253 పేజీలు: 10+4 వెల: 6.50

చెన్నై మెట్రో రెండో దశను ప్రారంభించిన ప్రధాని మోడీ
మణిపూర్‌లో పేట్రేగిన హింస: 9 మంది మృతి
8

## సమాకారం, ప్రోత్సాహం, సద్భావనతోనే
# దేశాభివృద్ధి సాధ్యం

మహారాజా అగ్రసేన్ 5150 జయంతి మహోత్సవంలో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా

నిజమైన సామ్యవాదానికి మహారాజా అగ్రసేన్ ప్రతీక: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

ఉత్పత్తి, అభివృద్ధి, సంపద సృష్టిలో వైశ్ సమాజం కీలకం: డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

వేడుకలకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు విహెచ్ ప్రభృతులు

**హైదరాబాద్, (జూబ్లీహిల్స్), అక్టోబరు 11, ప్రభాతవార్త:** త్యాగం, కరుణ, శాంతి, సమానత్వానికి మహారాజా అగ్రసేన్ ప్రతీకగా నిలిచిన మహారాజా అగ్రసేన్ 5150వ జయంతి మహోత్సవాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 92లో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిధిగా పాల్గొని మహారాజా అగ్రసేన్ ధామ్‌ను ప్రారంభించారు. అఖిల భారతవైశ్ మహా సమ్మేళనం, అగ్రవాల్ సమాజ్ >>2


మహారాజా అగ్రసేన్ 5150 జయంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా, చిత్రంలో అఖిల భారత వైశ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ


ఆదివారం ఢిల్లీకి బయలుదేరిన మంత్రి పొన్నం తదితరులు

## ఢిల్లీకి తరలిన మంత్రులు, ఎంపీలు

సిఇసి రాజీనామా కోసం భారీ ఆందోళనలు

నేడు పాల్గొననున్న తెలంగాణ నేతలు

**హైదరాబాద్, అక్టోబరు11, ప్రభాత వార్త:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణతో కేంద్ర ఎన్నికల ప్రధాన కమీషనర్ ఎన్నిక రిగ్గింగ్‌కు తెరలేపారని ఆరోపిస్తూ ఢిల్లీలో నిరసన తెలపడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, రాష్ట్రపార్టీ,జిల్లా పార్టీ నాయకత్వం హైదరాబాద్ నుంచి ఆదివారం బయలుదేరి ఢిల్లీకి చేరుకొన్నారు. అఖిల భారత కాంగ్రెస్ పిలుపు మేరకు సోమవారం సర్ అక్రమాలకు >>2

గజ్వేల్ తహసీల్దార్ స్వామి సస్పెన్షన్ 5

రైతు సంఘాల హర్షం


ఆదివారం గోవాలో కాంగ్రెస్ పాదయాత్రలో పాల్గొన్న సిఎం రేవంత్

# జ్ఞానేశ్ పేరుతో పేదల ఓట్లు చోరీ

గోవాను డ్రగ్స్ హబ్‌గా మార్చారు.. బిజెపివి విభజన రాజకీయాలు

సిఎం ప్రమోద్‌సావంత్ కాదు.. ప్రాపర్టీ సావంత్

గోవాలో కాంగ్రెస్ పాదయాత్రలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు11:** గోవాలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో భూములు మిగలవని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ పాలనలో గోవా సర్వనాశనమైందని, రాష్ట్రాన్ని డ్రగ్స్ హబ్‌గా మార్చారని ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చాలామంది డ్రగ్స్ బారిన పడుతున్నారని >>7

# సుప్రీం మార్చ్‌కు రండి

## జ్ఞానేశ్ రాజీనామా చేసేదాకా వదలం

ఓట్ల చోరీని అరికట్టాల్సిందే..

నేడు సుప్రీం సిజెను కలుస్తాం: రాహుల్



**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** ఓట్లచోరీ జరుగుతోందన్న ఆరోపణలకు నిరసనగా, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఢిల్లీలోని సుప్రీంకోర్టు వరకు మార్చ్‌లో పాల్గొనాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదివారం పౌరులకు, ప్రతిపక్ష పార్టీలకు, యువతకు, పౌర సమాజ సంఘాలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, తాను, రాహుల్ గాంధీ సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసి తమ ఆందోళనలను వివరించనున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ ఆయనకు >>2

కాంగ్రెస్ వినతికి 'నో' చెప్పిన సిజెఐ

పిటిషన్ దాఖలు చేయాలని సూచన 7


ఆదివారం న్యూఢిల్లీలో ఆందోళనకారులను అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

## ఆగని నిరసనలు

కొనసాగిన అరెస్టులు

**న్యూఢిల్లీ,అక్టోబరు 11:** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పిలుపునిచ్చిన నిరసనలకు మద్దతుగా ప్రతిపక్ష పార్టీల ఆందోళనలో భాగంగా ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలో వందమందికిపైగా నిరసనకారులను భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఈ నిరసనలకు సంబంధించి ఢిల్లీ పోలీసులు 20 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. సీజేపీ నేతృత్వంలో చేపట్టిన ఆందోళనలు ఆదివారం రెండోరోజుకు చేరుకున్నాయి. నిరసనకారులు జంతర్ మంతర్ వైపు ర్యాలీగా వెళ్లి, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఢిల్లీ పోలీసులు వారినిఅదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి >>2



## జిబౌటి తీరంలో పడవ మునక

109 మంది వలసదారులు మృతి

వారిలో 15 మంది చిన్నారులు.. మరో 116 మంది గల్లంతు

**జెనీవా, అక్టోబరు 11:** జిబౌటి తీరంలో మధ్య రాత్రి జరిగిన ఘోర పడవ ప్రమాదంలో కనీసం 109 మంది వలసదారులు మృతి చెందగా, మరో 116 మంది గల్లంతయ్యారు. మృతుల్లో 15 మంది చిన్నారులు ఉన్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ వలసల సంస్థ ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించింది. జిబౌటి నుంచి యెమెన్‌కు 350 మందితో >>2

# భవిష్యత్ జెన్‌జడ్‌దే


చెన్నైలో జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయ స్వర్ణోత్సవ వేడుకల్లో మోడీ

వారితోనే ప్రపంచ సమస్యలకు పరిష్కారం

సరైన లక్ష్యాలతో యువత సాగాలి: చెన్నైలో ప్రధాని మోడీ

**చెన్నై, అక్టోబరు 11:** ప్రపంచానికి ప్రస్తుతం ఎంతో అవసరమైన పరిష్కారాలను అందించే సామర్థ్యం జెన్ జెడ్ యువతకు ఉందని ప్రధానమంత్రి మోడీ అన్నారు. యువత తమ భవిష్యత్తును విశాల దృక్పథంతో చూడాలని, పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చెన్నైలోని నందంబాక్కంలో ఉన్న చెన్నై ట్రేడ్ సెంటర్‌లో జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాల స్వర్ణోత్సవ వేడుకల్లో మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి అవసరమైన కొత్త ఆలోచనలు, పరిష్కారాలు దేశ భవిష్యత్తుతోపాటు ప్రపంచ భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తాయని పేర్కొ న్నారు. ప్రపంచం ప్రస్తుతం అనేక సమస్యలకు పరిష్కారాల కోసం ఎదురుచూ స్తోందని, వాటిని అందించే సామర్థం యువతలో ఉందని అన్నారు. ప్రతి యువ కుడు తన భవిష్యత్తును విశాలమైన లక్ష్యాలతో ముడిపెట్టుకోవాలని సూచించారు. ఇది మీ సమయం మీకు లభించిన గొప్ప అవకాశమని మోడీ పేర్కొన్నారు. తాను కాశీకి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, వారణాసి తన లోక్‌సభ నియోజకవర్గమని ప్రధాని గుర్తుచేశారు. నిర్భయంగా జీవించాలనే స్ఫూర్తినిచ్చే మహాకవి సుబ్రహ్మణ్య భారతి రచనలను ప్రస్తావిస్తూ, యువత తమ ఆలోచనలకు అవకాశం కల్పించాలని సూచించారు. మీ ఆలోచనలపై పనిచేయండి.పెద్దకలలు కనండి. విభిన్నంగా ఆలో చించండి. భయం లేకుండా ముందుకు సాగండి. భారతదేశంలోఅపారమైన అవకాశాలు ఉన్నాయి. ఇది మీ సమయం, మీకు లభించిన అవకాశం. మనమంతా కలిసి సాధించగలమని >>2



## రాష్ట్రంలో భానుడి భగభగలు

38 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు

సాధారణం కంటే 4.5 డిగ్రీలు అధికం

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగిపోతుండటంతో వేసవి కాలాన్ని తలపించేలా భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రాష్ట్రంలో గడిచిన కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు పతాక స్థాయికి చేరుకుంటున్నాయి. పగటిపూట తీవ్రమైన ఎండతో పాటు భరించలేని ఉక్కపోత తోడవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ర్ష్టంలో సాధారణం కంటే సుమారు 2 నుంచి 4.5 డిగ్రీలవరకు అత్యధిక ఉష్ణోగ్రతలునమోదవుతున్నాయి.ముఖ్యంగా నైరుతిరుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ వేగవంతం కావడం, ఆకాశంలో మబ్బులు లేకపోవడమే ఈ హఠాత్ ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమని అధికారులు తెలిపారు. ఇక జిల్లాల్లో క్రమేపీవేడి >>2

# మీకు హక్కులు మాకు నిర్బంధాలా?



ఇదేనా కాంగ్రెస్ మార్కు ప్రజాస్వామ్యం?: కిషన్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** రాజ్యాంగాన్ని కాపాడతామని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని, ప్రతిపక్షాల గొంతుకను గౌరవించాలని కాంగ్రెస్ పార్టీ పదేపదే చెబుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో ఆ పార్టీ చెబుతున్న మాటలకు, తెలంగాణలో వారి ప్రభుత్వం చేస్తున్న పనులకు ఏమాత్రం పొంతన కనిపించడం లేదన్నారు. గత 3,4 రోజులుగా ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనల కారణంగా.. ప్రజలకు అసౌకర్యం కలిగినా, శాంతిభద్రతల సమస్యలుతలెత్తినా.. వారికి నిరసన తెలిపే అవకాశాన్ని అనేక సార్లు ఢిల్లీ పోలీసులు కల్పించారు. ప్రియాంక గాంధీ రోడ్డుపై పడుకున్నా, బారికేడ్లపైకి ఎక్కి జుగుప్సాకరంగా రాహుల్ వ్యవహరించినా.. వారి భావప్రకటన స్వేచ్ఛను పోలీసులు, ప్రభుత్వం గౌరవించాయన్నారు. రాహుల్ గాంధీ దేశమంతా స్వేచ్ఛగా తిరుగుతూ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీపైన, కేంద్ర ప్రభుత్వంపైన తప్పుడు ఆరోపణలు, పచ్చి అబద్ధాలతో తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, భారత సైన్యం వంటి సంస్థలపైనా ఆరోపణలు చేస్తున్నారు. వారు అబద్ధాలు ప్రచారం చేసినా..రాజకీయంగా ఆయన మాట్లాడే హక్కును అడ్డుకోవాలని మాప్రభుత్వం ఏనాడూ ప్రయత్నించ >>2

# వంటింట్లో ధరల మంటలు!



ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాలు

చేదెక్కుతున్న చక్కెర, చేజారుతున్న కూరగాయలు

ఖరీఫ్, రబీలను మింగేస్తున్న ఎల్‌నినో

అంతటా ముంచుకొస్తున్న ఆహార సంక్షోభం

**పుణె, అక్టోబరు 11:** అభివృద్ధి చెందుతున్న సూపర్ ఎల్ నినో, ఈ యేడాది వర్షాకాలం తర్వాత కూడా పంట ఉత్పత్తికి అంతరాయం కలిగించి, సరఫరాను తగ్గించి, ఆహార ద్రవ్యోల్బణాన్ని పెంచే ప్రమాదం ఉన్నందున, 2027లో సంభవించే సరఫరా సంక్షోభం గురించి భారత ఆహార పరిశ్రమ హెచ్చరిస్తోంది. పప్పుధాన్యాల ధరలను నిర్ణయించడంలో రబీ శనగ పంట కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, "రాబోయే కొద్ది నెలల గురించి మేము అంతగా ఆందోళన చెందడం లేదు. మాకు ఆందోళన కలిగిస్తున్నది వచ్చే యేడాది 2027 గురించే" అని ఇండియన్ పల్సెస్ అండ్ గ్రైన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిమల్ కోఠారి అన్నారు. రాబోయే రెండు సీజన్లు కష్టంగా ఉంటాయని చక్కెర ఉత్పత్తిదారులు భయపడుతున్నారు. "2026-27, 2027- 28 సంవత్సరాలు చక్కెర ఉత్పత్తికి, లభ్యతకు అత్యంత సవాలుగా మారవచ్చని మేము భయపడుతున్నామ్ము" అని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ గ్రెయిన్ ఎనర్జీకి చెందిన దిలీప్ పాటిల్ అన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడదెబ్బ, అధిక నీటి డిమాండ్ గురించి కూడా శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఎల్ నినో దీర్ఘకాలిక ప్రభావం కోసం భారతదేశం ప్రణాళిక వేసుకోవాలని వస్తు, వాతావరణ నిపుణులు హెచ్చరించారు. ఖరీఫ్ పంటలపై తీవ్రప్రభావం చూపిన ఎల్‌నినో ఇప్పుడు మరింత బలపడింది. సూపర్ ఎల్‌నినోగా ప్రపంచ మానవాళిపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఎల్‌నినో ప్రభావం నైరుతి రుతుపవనాలపై తీవ్రంగా పడింది.దీంతో దేశవ్యాప్తంగా 34శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇందులో ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యధిక లోటు వర్షపాతం నమోదుకాగా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, >>2

ఒకే శత్రువుతో అనేకసార్లు యుద్ధం చేయవద్దు. అలా చేస్తే నీ యుద్ధకళలన్నీ అతనికి నేర్పుతావు.

- నెపోలియన్ బోనపార్టీ

# పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ట!

పంచభూతాలను రక్షించుకోవడం మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించిన సంగతి మన పురాణాలు మనకు ప్రస్ఫుటంగా చెబుతున్నాయి. అయినా మనం వాటి ప్రాధాన్యతలను గుర్తించకపోవడమే అసలుసిసలైన లోపం. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవతా స్వరూపంగానే భావించారు. అందుకే నదులను జీవన దాయిని, మాతృ మూర్తులుగా భావిస్తున్నాము. ప్రాచీన సంస్కృతి, నాగరికతలు నదీతీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగుతున్నాయి. భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్నీ మనపరిసరాలనూ, చెట్టూ పుట్టా, గాలీ నీరు, కొండా కోనా వాగూ వంకా, చిలుకా పిచికా, అన్నిటినీ రక్షించుకోవడమే మూలంగా సాగేవి. ఇప్పుడా ఊసేలేదు. ఇప్పటికీ పాలపిట్ట దర్శనం గురించి విస్తృత ప్రచారంలో ఉంటుంది. అవి క్రమేపీ అంతరించిపోతున్నాయని చెప్పుకుంటున్నాం. ఇలా జంతు వృక్షజాతులు మాయమౌతున్నాయి. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీస్తున్నామని అనుకోలేకపోతున్నాం. పైగామనకెందుకులే అనే ధోరణి ప్రబలిపోతోంది. ఏది ఎలా విధ్వంసం జరిగినా వాటిని కాపాడుకునే ఆలోచన చేయడం లేదు. మరో పక్క పాలకుల విధ్వంసకర విధానాలవల్ల దేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడంలేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమించకపోవడం వల్ల ఎల్‌నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చిపడుతున్నాయి. పెరుగుతున్న జనాభే పర్యావరణవిధ్వంసానికి మొదటి చేటుగా గుర్తించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను, మట్టిని తోడేస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు. నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేకపోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జనావాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైనపదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగవుతున్నా దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది. అందుకే నేడు ఈపర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది. దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, మకర సంక్రాంతి, జన్మాష్టమి. శ్రీ రామనవమి వంటిపర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియచేస్తున్నాయి. భూగోళంపై 80 శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరుదొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధ జలం మానవ చర్యలవల్ల పనికిరాకుండాపోతోంది. దీనివల్ల కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భ జల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే సాగుకు, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరి శుభ్రంగా ఉంచడం మనందరి నైతికబాధ్యత. గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు. నివాస ప్రాంతాలనుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రజలు కూడా వారి దారిలోనే యథారాజా తథాప్రజా! అన్నట్లుంది. పర్యవసానంగా దేశంలో ఉన్నప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పం చెప్పుకోవలసి ఉంది. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్యఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యంపెరిగిపోతోంది. మానవప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. తనకు ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని మనిషే నాశనం చేస్తున్నాడు. గృహవ్యర్థాలు, చెత్తా చెదారం వల్ల భూసారం దెబ్బతింటోంది. మన దేశంలో ప్రతిరోజూ లక్షాడెబ్బై వేలటన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకుభూమిలో నాశనం కాకుండా నిల్వఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశుపక్ష్యాదులు వీటిని తినడంవల్ల చనిపోతున్నాయి. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ప్రమాదం. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు పాటుపడాల్సిన అవసరం ఉంది.

మోక్షం అంటే నిష్క్రియలో స్వేచ్ఛ కాదు. క్రియాశీలతలో స్వేచ్ఛ కలిగి ఉండడమే మోక్షం.



స్వామి చిన్మయానంద

మూర్ఖుల పట్ల కృతజ్ఞతగా ఉండాలి తప్ప, వాళ్లతో పోటీ పడకూడదు.



మార్క్ ట్వైన్

## ప్రజావాక్కు



### సవాలుగా మారుతున్న ఉగ్రవాదం

అంతర్జాతీయ సంబంధాల్లో ఉగ్రవాదం ఇప్పటికీ ప్రపంచ శాంతి, భద్రతలకు అతిపెద్ద సవాళ్లలో ఒకటిగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకుచోటు ఉండకూడదని భారత్ చాలా కాలంగా స్పష్టంగాచెబుతోంది. ఇటీవల అమెరికాకు భారత్ చేసినహెచ్చరికలు, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వివిధ అంతర్జాతీయ వేదికలపై చేసిన వ్యాఖ్యలు కూడా ఇదే ఆందోళనను ప్రతిబింబిస్తున్నాయి. భారత్ ఎప్పటినుంచో ఒక విషయాన్ని నొక్కిచెబుతోంది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వ్యవస్థలు, వాటికి మద్దతు ఇచ్చే నెట్‌వర్క్‌లు ఏ రూపంలోఉన్నా వాటిని నిర్దాక్షిణ్యంగాఎదుర్కోవాలి. రాజకీయ లేదా వ్యూహాత్మక ప్రయోజనాల కోసం కొన్ని ఉగ్ర వాద సంస్థలపై మౌనం పాటించడం చివరకు ప్రపంచ శాంతికే ప్రమాదమని భారత్ అభిప్రాయం.

- సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

### సభ్యత్వాలను వదులుకోవాలి

పదవుల్లో ఉన్నా లేకపోయినా ఎమ్మెల్యేగా గెలిచిన వారందరు అసెంబ్లీకి వెళ్లి ప్రజల పక్షాన మాట్లాడాలి. సభలో వారి సమస్యలు లేవనెత్తాలి. అయితే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాజీలు అయ్యాక అసెంబ్లీ మొహం చూడకుండా, ప్రజాసముహాల్లోకి రాకుండా నివాస గృహాల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. తమ నియోజకవర్గ ప్రజలకు కూడా వారు కనిపించడం లేదు. ఇలాంటి వారిని ఆ పార్టీ నాయకులు సమర్థిస్తున్నారు. వెనకేసుకు వస్తున్నారు. ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ప్రతిపక్ష నాయకులుగా తమ బాధ్యతలను నిర్వర్తించాలి. లేకుంటే సభ్యత్వాలను వదులుకోవాలి.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### మంచి సినిమాలు ప్రదర్శించాలి

గ్రామాలలో మారుతున్న కాలానుగుణంగా నిరంతరం ఏదో ఒక పనిలో నిమగ్నమవుతున్న ప్రజలకు సమాజం పట్ల ,కుటుంబ పట్ల బాధ్యత, సంబంధాల బాంధవ్యాల పట్ల అవగాహన కల్పించే సినిమాలను ఉచితంగా గ్రామలలో ప్రదర్శించాలి. గ్రామ పాలకవర్గం ప్రత్యేక దృష్టి పొందుపరిచి ప్రజలు వీక్షించేలా అవకాశం కల్పించాలి. అందరూ ఒకే దగ్గరికి చేర్చడంతో పాటు సినిమాలోని భావాలను పంచుకునే అవకాశం కలదు. కొంచెమైనా మార్పు తీసుకొచ్చే అవకాశం ఉంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### మరికొన్ని అనాధాశ్రమాలు నెలకొల్పాలి

పిల్లల ఆదరణ కరవైన తల్లిదండ్రులువృద్ధాశ్రమాలను ఆశ్రయిస్తున్నారని అనేక వ్యాసాలు, ఉపన్యాసాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఇందులో కొంత నిజమయినా పరిపూర్ణతతో కూడిన వాస్తవం లేదు. ఎందుకంటే ఇదివరకు అన్నీ ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అందరు తలోపని పంచుకుని చేసుకునే వారు. ఇప్పుడు ఆ వ్యవస్థ లేదు. భార్యాభర్తలు ఉద్యోగాలు, పిల్లలు చదువుల కోసం ఇలా అందరూ ఇళ్ళకు తాళం వేసి బయటకు వెళ్ళిపోతారు. వృద్ధులైన తల్లిదండ్రులు వారి పని వారు చేసుకోవడమే కష్టంగా ఉంటోంది. కన్న వారింటికి వెళ్ళినా అక్కడా వంటపని, ఇంటి పని తప్పడం లేదు. ఇది సామాన్య మధ్యతరగతి కుటుంబాల గాధ. ఏదో కొంత డబ్బు కట్టో లేక ఉచిత ఆశ్రమాలలోనో అయితే వేళకు ఇంత తిని ప్రాణం నిలుపుకోవచ్చు. ఇంట్లో చేసుకుతినే శ్రమ తప్పుతుంది. ఇందులోవృద్ధులైన ఆడవారి బాధలు వర్ణనాతీతం. కొడుకులు కోడళ్ళు మంచివాళ్ళు కావచ్చు. కానీ అన్నిసదుపాయాలు సమకూర్చడం సమస్యగా మారుతుంది.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### రాజ్యాంగంలో రీకాల్ పొందుపరచాలి

సిజెపికాక్రోచ్ జనతా పార్టీనుకాంగ్రెస్ జనతా పార్టీ అనవచ్చు. కాంగ్రెస్ అంటే కలయిక. జెన్‌జి యువతరం అసహనం మొదట్లో పరీక్షల విధానం మీద, ఇప్పుడు ఎన్నికల సంఘం మీద. ఇది ప్రభుత్వం మీద కాదు ప్రభుత్వానికి వ్యతిరేకం కూడా కాదు .న్యాయ వ్యవస్థకు వ్యతిరేకం అంతకన్నా కాదు. వారి నిరసన తెలుపడానికి రాజ్యాంగపరంగా వారికి హక్కు ఉంది. చదువుకున్న యువతరం గళం ప్రజాప్రతినిధులు విని తీరాలి. ఎప్పుడైనా ప్రజాస్వామ్య యుతంగా ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు మెజారిటీ ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తే రీకాల్ చేసేవిధానం ఇప్పటికైనా రాజ్యాంగంలో పొందుపరచాల్సిన అవసరం ఉంది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### పాలమూరు వలసలు

ఎల్‌నినో ప్రభావంతో కరవుతాండవంచేస్తున్న ఈ సమయంలో మళ్లీ పాలమూరు వలసలు ఇబ్బందులు పెడుతున్నాయి. కృష్ణమ్మా పరవళ్లు విన్న ఆ జిల్లా ఇప్పుడు పాలమూరు వలస బాటపడుతుంది. ఎక్కువస్థాయిలో వర్షపాతం నమోదు కావాల్సి నజిల్లాలో పంటలు ఎండిపోయిన పరిస్థితులలోట్యాంకర్స్ పెట్టి నీళ్లు కొట్టించుకుంటున్న పరిస్థితి ఉంది. కాబట్టి నీటిని పొదుపుగా వాడుకుంటూ నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి .

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# జల కాలుష్యంలోనే గోదావరి 'పుష్కరం'

*గోదావరినిత్యం ప్రవహించేది అయినా, వర్షాధారితం, గంగా యమునా ప్రణాళికలు ఇక్కడ పనిచేయకపోవచ్చు. సముద్రతీర ప్రాంతం సమీపంలో ఉండటం ఆంధ్రప్రదేశ్‌కు ప్రకృతి ప్రసాదించిన అద్భుతవరం. కాకినాడ ఉప్పాడ ప్రాంతానికో, ధవళేశ్వరం సముద్ర తీరానికో ప్రత్యేక కాల్వల ద్వారా, లేదా భారీ గొట్టాల ద్వారా వ్యర్థపారిశ్రామిక, నగర, స్మశాన, చాకి రేవుల ఇతరత్రా కాలుష్య జలాలను గోదావరిలోకి వెళ్లకుండా సముద్రజలాలలోకి తరలించే భగీరథ ప్రయత్నం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు రానున్న పుష్కర సందర్భాన్ని కేంద్రానికి సమయ విజ్ఞతతో గుర్తు చేసే సదవకాశంగా చేపట్టాలి. వేదంలా ఘోషించే, పవిత్ర గోదావరి సజీవ రమణీయతను 2027 పుష్కర ప్రవేశంలో ఇహ, పరాలుగా ఆరాధ్యనీయం చేసుకోగలమా?*

జయసూర్య

మహారాష్ట్రుల కూతురుగా, తెలుగు వారి కోడలిగా బంగారు తెలంగాణ రాష్ట్రసీమలో పాదం మోపి, స్వర్ణాంధ్రప్రదేశ్ వైపు పరుగులు తీస్తున్న గోదావరి ప్రస్తుత రెండు తెలుగు రాష్ట్రాల జనావళి ఐహిక, ఆముష్మిక కలల సాఫల్యానికి గుండెలలో గుడికట్టుకుంది. తెలంగాణ రాష్ట్రంలోని అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నదీ తీరాలలో రెండు తెలుగు రాష్ట్రాల సంపన్న, సౌభాగ్య ప్రదాయినిగా గోదావరి కదులుతోంది. గోదావరి, కృష్ణ వంటి జీవనదీ జలాలు ఆకలి, దప్పులు లేకుండా జనాన్ని బతికిస్తున్నాయి. నదుల జలాలను మనం యధేచ్ఛగా వినియోగించుకొంటున్నాం. నిజం చెప్పాలంటే అవసరాలకు మించి దురాశతో కొల్లగొడ్తున్నాం. 'గోదావరీ.. నమోస్తుతే' అంటూ ప్రణుతించమని అనాదిగా, మహత్త్వ తత్త్వం ప్రబోధిస్తోంది. ప్రకృతితో నిరంతరం తాదాత్మ్యం చెందే మహోన్నత లక్షణాలలో భాగం చెట్టు, పుట్టా, గాలి, నేల, నీరు, నిప్పు మనకు బతుకు ప్రసాదించే దైవత్వభావన ఆరాధనా దృష్టితో సాగిలపడడం మన జీవన ధర్మం. పన్నెండేళ్లకోసారి గోదావరికి, ఆ నదిని పూజించి తరించే ప్రగాఢ విశ్వాసం, పుష్కర పవిత్రత సమకూర్చుతుంది. నదిని తల్లిగా కృతజ్ఞతాపూర్వకంగా ఆరాధించే ఆరాధన, స్వర్గస్థులైన పెద్దలకు, స్మృతికి భక్తిశ్రద్ధలతో తీర్థ విధులు దానవితరణలు, పురాణ ప్రాచీన ఆలయాల సందర్శన నదులు పుట్టినప్పటి నుంచి పుష్కర పవిత్రత కోట్లాది ఆసక్తి భారతీయులను అలరారిస్తోంది. భారతీయ జనతాపార్టీ కేంద్రాధికారం చేపట్టిన తర్వాత భారతీయ ఆధ్యాత్మికతకు, మత ఔన్నత్య జీవన విలువలకు మరింత ప్రాధాన్యత పెరిగింది. ఆధ్యాత్మిక పర్యటనలకు ప్రభుత్వపరంగా ఆదరణ, ప్రోత్సాహం లభిస్తోంది. స్నానఘట్టాలు, దేవాలయాల సుందరీకరణ, పారిశుధ్య నిర్వహణ, యాత్రికులకు రవాణా సౌకర్యాలు, ప్రత్యేక వసతి ఏర్పాట్లు, ప్రత్యేక రైళ్లఏర్పాటు చేయడం పట్లరాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు శ్రద్ధ వహిస్తున్నాయి. కాని గోదావరి, కృష్ణా వంటి నదీజలాల సజీవతను సంరక్షించే దిశగా ప్రభుత్వాలు చర్య తీసుకోవడం లేదు. మహానగరాల కాలుష్యం, నదీ తీరాల పరిశ్రమల కాలుష్యం ఏ స్థాయికి చేరిందంటే, స్నానాల మాట దేవుడెరుగు కనీసం నీళ్లను పుక్కిట పట్టడం కూడా భయపడాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. విపరీతజన సమ్మర్దంలో ఒకరినొకరు తోసుకుంటూ ముందుకు వెళ్లాలని ఆశించేవారికి దురదృష్టవశాత్తు తప్పించుకోలేని ప్రమాదాలలో చిక్కుకొంటామనే ఆలోచన ఆ సమయంలో ఉండదు. వెనక్కి సురక్షితంగా రావటానికి తొట్రుపాటు, ఆందోళన, నిస్సహాయత కారణంగా మరింత తొక్కిడిలో ఇరుక్కుపోయి పిల్లలు, వృద్ధులు, మహిళలు ప్రాణాలు కోల్పోతుంటారు. పవిత్ర స్నానాల కోసం తాపత్రయపడే భక్తులు, పుణ్యం కోసం మహూర్తంలోనే స్నానం చేయాలనే మీడియా ద్వారా 144వ సంవత్సరాల పుష్కరపవిత్రత వంటి ప్రచారం గోదావరి పుష్కర 2015 ఆరంభఘట్టాన్ని విషాదమయంచేసింది. కోట్లాదిగా యాత్రికులు తరలి రావాలనే ప్రభుత్వం పిలుపు ఇవ్వడం, ముహూర్త ప్రకటనలు, ప్రభుత్వం పర్యాటక ఆదాయం పెంచుకోవాలనే అత్యాశ, భక్తజనులు ఎదుర్కొనే అధికారుల అనుభవ శూన్యత కారణంగా యాత్రికులు ప్రాణాలు పోగొట్టుకొంటున్నారు. 21వ శతాబ్దంలో తృతీయ దశాబ్దం



లోకి, మూడు సంవత్సరాలలో అడుగుపెట్టనున్న, తెలుగు భక్తజన సందోహానికి 2027 పుష్కర సన్నాహం ప్రచారం ప్రారంభమైంది. మళ్లీ పుష్కరాలకు ఎవరు ఉంటారో, ఎవరు ఉండరో అనే తాత్త్విక చింతన ఉండనే ఉంది. పవిత్ర పుష్కరుడు నదిలో ప్రవేశించే, నదుల వరుసలో గోదావరిఐదవది. బాసర, ధర్మపురి, కాళేశ్వరం, భద్రాచలం, రాజమండ్రి, అంతర్వేది కొవ్వూరు, నరసాపురం ఇత్యాది గోదావరీ నదీ తీర క్షేత్రాలలో ప్రస్తుత రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాక, ఆధ్యాత్మిక తీర్థవిధులకు ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వం కేంద్రంలోనూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ ఉండటం కారణంగా కోట్లాది ఆస్తికులు యావద్భారతం నుంచే కాక దేశ విదేశాల నుంచి తరలివచ్చే అవకాశాలు ఈ పుష్కరాలకు పుష్కలంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో నెలకొని ఉన్న కూటమి ప్రభుత్వాధినేతలు, కేంద్రాధిపత్యం కనుసన్నలలో వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రస్తుతం వ్యవహారశైలి, పూర్వపు ముఖ్యమంత్రిగా, గత పుష్కరాల అనుభవానికి తోడుగా రానున్నపుష్కరాలు 'మహాకుంభమేళాస్థాయిలో ఉత్తరాది పెద్దల దృష్టి ఆకట్టుకోవాలనే సన్నాహం ఆరంభమైంది. డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పుష్కరాలు నిర్వహించే అంశం తానే చూసుకొని మోడీజీ కనుసన్నలలో పడటానికి, గోదావరిలో స్వయంగా రాజమండ్రి ప్రాంతంలో పంట్ మీద పయనించి, గోదావరి కాలుష్యం చూసి అవాక్కయ్యారు. పట్టుమని పది నెలల సమయం మాత్రమే ఉంది. రానున్న జూన్ 26 ప్రభుత్వం పుష్కర ఆరంభంగా ప్రకటించింది. దేశమంతటా భక్తజనులు ఉవ్విళ్లూరుతున్నారు. గోదావరీ జలాలు తాగడానికి కాదు. ఔపోసనం పట్టడానికి పనికిరాని పరిస్థితులున్నాయి. ఉప ముఖ్యమంత్రి అత్యుత్సాహం ఉన్నా రాజమండ్రి పుష్కర సన్నాహంలో అతికీలకమైన జలకాలుష్య నివారణ ఆలోచన అటకెక్కింది. పేపర్ మిల్లు కాలుష్యం, కోటి లింగాల స్మశానంలో శవాల బూడిద, నగరంలోని మురికిని మోసే నల్లా కాల్వ కాలుష్యం యధేచ్ఛగా గోదావరిలో కలుస్తోంది. ఆనీళ్లే దిగువ ప్రవాహంలో శుద్ధి చేయబడి మంచినీటిగా మునిసిపాలిటీ సరఫరా చేస్తోంది. గోదావరి అంతా, ప్లాస్టిక్ సహిత వ్యర్థాలతో అత్యంత దుర్గంధం, పక్కకు చేతితో తొలగించుకొని రజకులు మాసిన బట్టల మురికి వదుల్చుకొంటున్నారు. అదీ గోదావరిలోకే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సమర్థుడైన చంద్రబాబు నాయుడు గతంలో పుష్కరాలను అతిఘనంగా నిర్వర్తించిన దీక్షాదక్షుడు. భౌగోళికంగా రాజమహేంద్ర సాంస్కృతిక, ఆధ్యాత్మిక విశిష్టత గుర్తించినముఖ్యమంత్రి రాజమండ్రి కాదు, ఇక రాజమహేంద్రిగా ఆ మహానగరాన్ని నామకరణం చేసే గౌరవం స్వయంగా ఇచ్చారు. గోదావరీ పుష్కరాలకు మారుపేరు రాజమండ్రి పుష్కరాలు. కేంద్రంలో పాలనాధిపత్యంలోని మోడీ ప్రభుత్వం రైల్వే, విమాన యానానికి ఇస్తున్న ప్రాధాన్యత ఇంతా అంతా కాదు. ఉత్తర, దక్షిణ భారత అనుసంధానికి, రైల్వే విమాన యానం అతి వేగం, సురక్షితంగా కేంద్రం ఆదాయంతో పాటు అభివృద్ధి సాధిస్తోంది. ఉత్తరాంధ్ర ప్రాంతాలకు గోదావరీ జలాలతరలింపు సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరీ నదీమతల్లికి, స్వయంగా నేల మీద సాగిలపడి సాష్టాంగ ప్రమాణం చేయడం యావద్భారత దేశాన్ని కదలించింది. ఆంధ్రప్రదేశ్ భౌగోళిక స్థితిగతులలో, గోదావరి పుష్కరాలంటే చటుక్కున గుర్తువచ్చేది రాజమహేంద్ర నగరం. ఆ మహానగర సమీపంలోనే ధవళేశ్వరం సమీప బంగాళాఖాతంలో గోదావరి అతి ఉధృత వరద ప్రవాహం ఆ సమయంలో కలుస్తోంది. గోదావరినిత్యం ప్రవహించేది అయినా, వర్షాధారితం, గంగా యమునా ప్రణాళికలు ఇక్కడ పనిచేయకపోవచ్చు. సముద్రతీరప్రాంతం సమీపంలో ఉండటం ఆంధ్రప్రదేశ్‌కు ప్రకృతి ప్రసాదించిన అద్భుతవరం. కాకినాడ ఉప్పాడ ప్రాంతానికో, ధవళేశ్వరం సముద్ర తీరానికో ప్రత్యేక కాల్వల ద్వారా, లేదా భారీ గొట్టాల ద్వారా వ్యర్థపారిశ్రామిక, నగర, స్మశాన, చాకి రేవుల ఇతరత్రా కాలుష్య జలాలను గోదావరిలోకి వెళ్లకుండా సముద్రజలాలలోకి తరలించే భగీరథ ప్రయత్నం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు రానున్న పుష్కర సందర్భాన్ని కేంద్రానికి సమయ విజ్ఞతతో గుర్తు చేసే సదవకాశంగా చేపట్టాలి. వేదంలా ఘోషించే, పవిత్ర గోదావరి సజీవ రమణీయతను 2027 పుష్కర ప్రవేశంలో ఇహ, పరాలుగా ఆరాధ్యనీయం చేసుకోగలమా? •

# ఎన్నికల వ్యవస్థపై పటిష్టమైన విశ్వాసం అవసరం

సి.హెచ్.ప్రతాప్

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కేవలం రాజకీయ ప్రక్రియ కాదు. అవి ప్రజల విశ్వాసానికి ప్రతిబింబం. ఓటరు తన ఓటు ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకుంటాడు, పాలనను ప్రభావితం చేస్తాడు, అధికారాన్ని జవాబుదారీతనానికి లోబరుస్తాడు. అందుకే ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకం బలహీనపడితే ప్రజాస్వామ్య పునాదులే కదిలే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చుట్టూ జరుగుతున్న చర్చలు ఎన్నికల పారదర్శకత, సమగ్రత, విశ్వసనీయతపై మరింత దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి సుమారు 96 కోట్ల మంది నమోదిత ఓటర్లు ఉండటం దేశ ఎన్నికల వ్యవస్థ విస్తృతిని ప్రతిబింబిస్తోంది. ఇంత భారీ స్థాయిలో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడం ప్రపంచ ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక విశేషమైన ఘట్టం. అయితే ఎన్నికలపై ప్రజలవిశ్వాసం కేవలం పోలింగ్ రోజుమాత్రమే కాకుండా, ఓటరు జాబితాల తయారీ నుంచి ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలో నెలకొనాలి. ప్రస్తుతం ప్రధాన చర్చకు కారణమైన ఎస్ఐఆర్ గణాంకాలు ప్రజల్లో ఆసక్తితో పాటు ఆందోళనలను కూడా పెంచుతున్నాయి. మహారాష్ట్ర సర్ ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం రాష్ట్రంలోఉన్న 9.78 కోట్ల మంది నమోదిత ఓటర్లలో 7.71 కోట్ల మంది మాత్రమే డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌లో చోటు దక్కించుకోగా, 2.06 కోట్ల మంది ఓటర్లు 'అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్ లేదా ఇతర కారణాలు' అనే వర్గంలోకి వెళ్లారు. ఇది మొత్తం ఓటర్లలో 21.14 శాతానికి సమానం. అనంతరం అక్టోబర్ 4నాటికి కొత్త నమోదులు, అభ్యంతరాలు, సవరణల కోసం 6.24లక్షల అప్లికేషన్లు అందినట్లు అధికార గణాంకాలు వెల్లడించాయి. ఈ గణాంకాలు ఒకముఖ్యమైన ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. ఎన్నికల జాబితా పరిశుభ్రత అవసరమే అయినప్పటికీ, అర్హులైన ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకూడదు. ముఖ్యంగా వలస కార్మికులు, పట్టణ పేదలు, వృద్ధులు, అట్టడుగు వర్గాలకు చెందిన పౌరులు డాక్యుమెంటేషన్ లేదా చిరునామా మార్పుల కారణంగా జాబితా వెలుపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. అందువల్ల వెరిఫికేషన్ ప్రక్రియలో మానవీయ దృష్టి, పారదర్శకత, సమర్థమైన అప్పీల్ వ్యవస్థ తప్పనిసరి. సాంకేతికత ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేసే సాధనంగా మారుతోంది. ఓటరునమోదు, ఎలక్టోరల్ రోల్ పరిశీలన, ఎన్నికలసమాచారం వంటిసేవలను ఒకే డిజిటల్ వేదికపై అందించే ఇసిఐనెట్ వంటి చర్యలు పారదర్శకతను పెంచగలవు. అయితే టెక్నాలజీ మాత్రమే సరిపోదు. ఎన్నికల సంఘం స్వతంత్రత, రాజకీయపార్టీల బాధ్యతాయుత వైఖరి, మీడియా వాస్తవాధారిత కవరేజ్, పౌరుల చైతన్యం కూడా అంతే ముఖ్యం. ఎన్నికల ప్రక్రియపై వచ్చిన ప్రతిసందేహాన్ని శత్రుత్వంగా కాకుండా ప్రజాస్వామ్య ఆరోగ్యానికి సంబంధించిన అంశంగా చూడాలి. ప్రజల ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం, గణాంకాలను బహిరంగంగా పంచుకోవడం, ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయడం ద్వారా విశ్వాసాన్ని మరింత బలపరచవచ్చు. ప్రజాస్వామ్యం పార్లమెంట్‌లోకాదు, ఓటరు జాబితాలో ప్రారంభమవుతుంది. ఆ జాబితాలోని ప్రతిపేరు ఒక పౌరుడి స్వరానికి ప్రతీక. ఆస్వరం ఎక్కడా కనుమరుగుకాకుండా చూడటం ఎన్నికల సంఘం, రాజకీయపక్షాలు, మీడియా, పౌర సమాజం అందరి ఉమ్మడి బాధ్యత. •

# సర్కారీ స్థలాల పరిరక్షణ భవిష్యత్తుకు భరోసా



పాపని నాగరాజు

వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌కు అభివృద్ధి ఎంత అవసరమో, ఆ అభివృద్ధికి పునాది అయిన చెరువులు, నాలాలు, పార్కులు, రహదారులు, ప్రభుత్వ భూములు, ఇతర ప్రజా అవసరాల స్థలాలను కాపాడటం కూడా అంతే ముఖ్యం. నగరం విస్తరిస్తున్న కొద్దీ భూమి విలువ పెరగడం, నివాస-వాణిజ్య అవసరాల కోసం భూమిపై ఒత్తిడి పెరగడం, పట్టణ ప్రణాళికలోని లోపాలు, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపాలుకలిసి ప్రజాస్థలాలు, నీటి వనరులపై ఒత్తిడిని పెంచాయి. అందువల్ల ఆక్రమణల సమస్య నిన్నో మొన్నో పుట్టింది కాదు. ఈ నేపథ్యంలో హైడ్రా చెరువుల పునరుద్ధరణ, పూడిక తొలగింపు, నీటి ప్రవాహ మార్గాల పరిరక్షణ, ప్రజాఆస్తుల రక్షణ వంటి చర్యలు చేపడుతోంది. కుందన్‌పల్లి చాముండిపట్నం కాలనీలో పార్కు, మార్కెట్ కోసం కేటాయించిన 7,200 చదరపు గజాల స్థలాన్ని రక్షించడం, పటాన్‌చెరులోని సాకి చెరువుకు సుమారు కిలోమీటరు మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వంటి చర్యలు ప్రజా స్థలాల పరిరక్షణ అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇవి కేవలం ఆక్రమణ తొలగింపులు కాదు. నగర భవిష్యత్తులో వరదలు, నీటి కొరత, పర్యావరణ నష్టాలను తగ్గించే చర్యలుగా చూడాలి. అయితే కూల్చివేతల తర్వాత స్పందించడం కంటే, మొదటి ఇటుక పడకముందే అక్రమాన్ని అడ్డుకోవడమే సమర్థవంతమైన పరిపాలన. ఫుల్ ట్యాంక్ లెవల్ ( ఎఫ్.ఎల్.టి), బఫర్ జోన్, నాలాల పరిధి, భూమి స్వభావం వంటి అంశాలు నిర్మాణానికి ముందే స్పష్టంగా నిర్ధారించాలి. ఇక్కడే పరిపాలనా వ్యవస్థలోని ఒక విరుద్ధత కనిపిస్తుంది. ఒకవైపు స్థానిక సంస్థలు నిర్మాణ అనుమతులు ఇస్తుంటే, మరోవైపు అదే నిర్మాణం తరువాత అక్రమమని తేలితే హైడ్రా చర్య తీసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితి కొనసాగితే సమస్యకు శాశ్వత పరిష్కారం రాదు. మున్సిపల్, పట్టణ, గ్రామస్థాయి అధికారులు హైడ్రాతో సమన్వయం చేసుకుని భూమి స్వభావం, ఎఫ్.ఎల్.టి, బఫర్ జోన్, నాలా, ప్రజా స్థలాల అంశాలను ముందుగానే పరిశీలించాలి. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చిన సందర్భాల్లో సంబంధిత అధికారుల జవాబుదారీతనం కూడా నిర్ధారించాలి. అవినీతికి అవకాశం లేకుండా అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి. ఉపగ్రహ చిత్రాలు, భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్), డిజిటల్ మ్యాపింగ్ వంటి సాంకేతికతలను ముందస్తు పర్యవేక్షణకు ఉపయోగించాలి. అప్పుడు హైడ్రా ఆక్రమణలను తొలగించే సంస్థగా మాత్రమే కాకుండా, ఆక్రమణలు పుట్టకుండా నిరోధించే సంస్థగా మారుతుంది. ప్రజా ఆస్తుల పరిరక్షణలో కఠినత్వం ఎంత అవసరమో, పేదల విషయంలో మానవతా దృక్పథం కూడా అంతే అవసరం. జీవనోపాధి కోసం చిన్నఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను, ప్రజాభూములను పెద్ద ఎత్తున ఆక్రమించి వాణిజ్య ప్రయోజనాలు పొందే వ్యక్తులతో ఒకే



గాటన చూడకూడదు. ముఖ్యంగా పేదలకు భూములు విక్రయించిన దళారులు, మధ్యవర్తులు, అక్రమ లేఅవుట్ల వెనుక ఉన్నవారిపై కూడా చర్య ఉండాలి. ఇప్పటికే నివసిస్తున్న కుటుంబాల విషయంలో నిర్ణీత తేదీని ప్రామాణికంగా తీసుకుని, నివాస కాలం, కుటుంబానికి ప్రత్యామ్నాయ నివాసం ఉందా, నిర్మాణం నివాస అవసరానికేనా, భూమిస్వభావం, కుటుంబ ఆర్థిక పరిస్థితి వంటి ప్రమాణాలతో అర్హతను నిర్ణయించాలి. ఈ పరిశీలన హైడ్రా, రెవెన్యూ శాఖ, సంబంధిత స్థానిక సంస్థల ప్రతినిధులతో కూడిన పారదర్శక వ్యవస్థ ద్వారా జరగాలి. అర్హులైన కుటుంబాలకు అవసరమైన చోట ప్రత్యామ్నాయ నివాసం లేదా పునరావాసం కల్పించాలి. ముఖ్యంగా ఎఫ్.ఎల్.టి, నాలా, వరద మార్గంవంటి ప్రమాదకర ప్రాంతాల్లో నివసించే కుటుంబాలను భద్రతకారణంగా తరలించాల్సి వస్తే, తరలింపు ముందు ప్రత్యామ్నాయ నివాసం, ప్రాథమిక సదుపాయాలు, సాధ్యమైనంత వరకు జీవనోపాధికి అనుసంధానం వంటి అంశాలను ప్రభుత్వం స్పష్టంగా నిర్ధారించాలి. యుఎన్ హ్యాబిటేట్ 2026 వరల్డ్ సిటీస్ రిపోర్టు కూడా అనధికార నివాసాల విషయంలో కేవలం తొలగింపుకంటే స్థానిక పరిస్థితులకు అనుగుణమైన అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం, జీవనోపాధి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తోంది. పేదల ఇళ్లను తొలగించి, వారిని అక్కడికి తీసుకువచ్చిన దళారీ వ్యవస్థ అలాగే మిగిలిపోతే సమస్య పరిష్కారం కాదు. అదే సమయంలో ఈ మానవతా విధానం కొత్త ఆక్రమణలకు ప్రోత్సాహంగా మారకూడదు. వరదల విషయంలో కూడా పైకి కనిపించేది నీటిముంపు. కానీ లోపల ఉన్నసమస్య సహజనీటి ప్రవాహ మార్గాల మార్పు, నాలాల సామర్థ్యం తగ్గడం, చెరువులఅనుసంధానం దెబ్బతినడం, ప్రమాద ప్రాంతాల్లో నిర్మాణాలు పెరగడం. అందువల్ల ఒక చెరువును మాత్రమే రక్షించడం కాకుండా, ఒక చెరువు నుంచి మరో చెరువుకు నీరు వెళ్లే సహజ మార్గాలను కూడా ప్రజాఆస్తులుగా గుర్తించి కాపాడాలి. వర్షంపడిన తర్వాత నీటిని తోడటం అవసరమే, కానీ నీరు ఎక్కడికి వెళ్లాలి, దానిమార్గాన్ని ఎక్కడ అడ్డుకున్నారు, ఏ ప్రాంతం ప్రమాదంలో ఉంది అనే విషయాలను ముందుగానే గుర్తించడం మరింత ముఖ్యం. హైడ్రాకు అసలు పరీక్ష ఇక్కడే ఉంది. కూల్చివేతల సంఖ్య కంటే కట్టకముందే ఎన్ని అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నాం, ముందుగానేఎన్ని ప్రజా ఆస్తులను రక్షించాం అనేదే దాని పనితీరుకు ముఖ్యమైన కొలమానంగా మారాలి. ఎందుకంటే ఒక అక్రమ నిర్మాణం కూల్చివేసిన తరువాత కనిపించేది భవనం మాత్రమే. కానీ అది అక్కడికి ఎలా వచ్చింది, ఎవరు భూమిని విక్రయించారు, ఎవరు అనుమతి ఇచ్చారు, పర్యవేక్షణ ఎక్కడ విఫలమైంది అనే అసలు ప్రశ్నలు మిగిలిపోతాయి. మూల కారణాలను సరిచేయకుండా కేవలం కూల్చివేతలు కొనసాగితే సమస్య మరోప్రాంతంలో మళ్లీ పుట్టే అవకాశం ఉంటుంది. అందుకే హైడ్రా, మున్సిపల్ సంస్థలు, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, నీటిపారుదల శాఖలు పరస్పరం బాధ్యతను నెట్టుకోకుండా సమన్వయంతో పనిచేయాలి. ప్రజలకు అందుబాటులో ఉండే ఎఫ్.ఎల్.టి, బఫర్ జోన్, నాలాలు, ప్రభుత్వ భూముల మ్యాపులు, పారదర్శక అనుమతులవ్యవస్థ, ఫిర్యాదులపై నిర్ణీత కాలపరిమితిలో చర్య, అధికారుల జవాబుదారీతనం అవసరం. హైడ్రా చట్టబద్ధత, పారదర్శకత, సమానత్వం, మానవతతో పనిచేస్తూ రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా వ్యవహరించాలి. నగరాన్ని కాపాడటం అంటే కేవలం భూమిని కాపాడటంకాదు, ప్రజలకు సురక్షితమైన నివాసం, జీవనోపాధి, పర్యావరణం, ప్రజాస్థలాలను సమన్వయంతో కాపాడటం. చెరువులు, నాలాలు, పార్కులు, రహదారులు, పాఠశాల స్థలాలు, ప్రభుత్వ భూములు నేటి తరానికే కాదు, భవిష్యత్ తరాలకుచెందిన సామూహిక ఆస్తులు. వాటిని కాపాడటంలో హైడ్రా చూపుతున్న చొరవను దూర దృష్టి, మానవత, సమానత్వం, జవాబుదారీతనంతో మరింత బలపరచడమే హైదరాబాద్ భవిష్యత్తుకు నిజమైన భరోసా. •

# దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ

## రాజ్యాంగ వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని కేంద్రం దెబ్బ తీస్తోంది : ఖర్గే



**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** దేశ రాజకీయంలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తూ, ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తోందని కాంగ్రెస్ అగ్రనేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో ప్రస్తుతం అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు దాపురించాయని ఆరోపిస్తూ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను స్వయంగా కలవనున్నట్లు ప్రకటించి సరికొత్త సంచలనానికి తెరతీశారు. సుప్రీంకోర్టు తలుపు తట్టనున్న కాంగ్రెస్ దిగ్గజాలు బెంగళూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడిన మల్లికార్జున ఖర్గే దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థల ప్రస్తుత దుస్థితిని వివరించేందుకే తాము సీజేఐ అపాయింట్‌మెంట్ కోరినట్లు వెల్లడించారు.

సోమవారం సాయంత్రం 4:00 నుంచి 5:00 గంటల మధ్య సమయం కేటాయించాల్సిందిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తాము ఇప్పటికే లేఖలు రాశామని తెలిపారు. అత్యున్నత న్యాయస్థానం ముందు తమ విన్నపాన్ని చేతులు జోడించి వినమ్రంగా సమర్పిస్తామని, దేశంలో జరుగుతున్న అక్రమాలను వారి దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు ఎన్నికల కమిషన్ స్వతంత్రతపై దాడి.. ఓట్ల చోరీ ఆరోపణలు కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నిష్పాక్షికంగా వ్యవహరించకుండా, తోటి కమిషనర్లు స్వతంత్ర నిర్ణయాలు తీసుకోకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈసీలో జరుగుతున్న అక్రమాలు, అవకతవకలపై తోటి సభ్యులు బహిరంగంగానే ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అధికార పక్షానికి అనుకూలంగా ఓట్ల అక్రమాలకు తావిస్తూ, అన్యాయంగా ప్రభుత్వాలను ఏర్పాటు చేసేందుకు సహకరిస్తున్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. 2023 చట్టంపై మండిపాటు.. అపరిమిత రక్షణపై ప్రశ్నలు 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు.

ఈ చట్టం ద్వారా సీఈసీ, ఇతర సభ్యులకు జీవితాంతం ఎలాంటి చట్టపరమైన చర్యల నుంచి విచారణ మినహాయింపు (రక్షణ) కల్పించారని మండిపడ్డారు. చివరికి భారత రాష్ట్రపతికి లేదా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా లేని ప్రత్యేక రక్షణను ఒక్క ఎన్నికల కమిషనర్‌కు ఎందుకు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని మోసం చేసి ఓట్లను దోచుకోవడానికి చేసిన కుట్రలో భాగమే ఇదంతా అని, దీనిపై తాము రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో విపక్షాల నిరసనలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఖర్గే తీవ్రంగా నిరసించారు. శనివారం జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలను అడ్డుకునేందుకు దాదాపు 32వేల మంది పోలీసులను రంగంలోకి దించడం, 45 మెట్రో స్టేషన్ల గేట్లను మూసివేయడం కేంద్ర ప్రభుత్వంలో ఉన్న భయానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేతలు అరవింద్ కేజ్రీవాల్, పినరయి విజయన్, మమతా బెనర్జీతో పాటు దాదాపు వెయ్యి మందిని నిర్బంధించడం ప్రజాస్వామిక హక్కులను కాలరాచడమేనని ధ్వజమెత్తారు. దేశంలో భయాందోళనలు సృష్టిస్తూ పాలన సాగిస్తున్న ఈ తీరుపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నట్లు కాంగ్రెస్ స్పష్టం చేసింది.

# ఉద్యోగుల సేవలన్నీ డిజిటలైజ్

## ఒకే డిజిటల్ గొడుగుకిందకు టెండర్ ప్రక్రియ

### ఆన్‌లైన్‌లో అనుమతులు, బిల్లులు

### రాష్ట్ర సర్కార్ సంచలన నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం పాలనలో పారదర్శకతను పెంచడం కోసం పరిపాలనా విధానాలు, అనుమతులు, ఉద్యోగుల సర్వీసులు బిల్లుల చెల్లింపులను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని నిర్ణయించింది. ఉద్యోగుల వివరాల డిజిటలైజేషన్ చేసే క్రమంలో మానవ వనరుల నిర్వహణ వ్యవస్థ (ఈహెచ్‌ఆర్‌ఎమ్‌ఎస్)ను ప్రవేశపెట్టారు. ప్రభుత్వ ఉద్యోగుల పూర్తి వివరాలు, సర్వీసు రికార్డులను పారదర్శకంగా ఉంచేందుకు మానవ వనరుల నిర్వహణ సిస్టమ్ విధానాన్ని 100 శాతం డిజిటలైజ్ చేయాలని తాజాగా ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే దాదాపు 93 శాతం మంది ఉద్యోగుల డేటా డిజిటలైజేషన్ పూర్తయింది. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ సిబ్బంది బ్యాంక్ ఖాతాలు, జీతాల వివరాలను కూడా డిజిటలైజ్ చేస్తున్నారు. దీనివల్ల ఏజెన్సీల ప్రమేయం తగ్గి, ప్రతినెలా ఒకటో తేదీనే నేరుగా వారి ఖాతాల్లో జీతాలు జమ అయ్యేలా పారదర్శకత పెరుగుతుంది. తెలంగాణ సమీకృత ఆర్థిక నిర్వహణ మరియు సమాచార వ్యవస్థ (ఐఎఫ్ఎమ్ఐఎస్) పోర్టల్ ద్వారా ప్రభుత్వ బిల్లుల చెల్లింపుల ప్రక్రియను పూర్తిగా పేపర్లెస్ డిజిటల్ విధానంలోకి మార్చారు. అభివృద్ధి పనుల మంజూరీ, సాంకేతిక మంజూరు, కాంట్రాక్టుల కేటాయింపుల్లో ఎలాంటి అవకతవకలు, పక్షపాతానికి తావులేకుండా ఉండేందుకు మొత్తం టెండర్ ప్రక్రియను ఒకే డిజిటల్ గొడుగు కిందికి తీసుకువచ్చేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కాగా రాష్ట్రంలో డిజిటల్ పరిపాలనను అమలు చేయడం కోసం తెలంగాణ ప్రభుత్వం అఫీషియల్ కమిటీ డిజిటల్ పాలనను బలోపేతం చేసేందుకు, 100 రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం అఫీషియల్ కమిటీ డిజిటల్ గవర్నన్స్ పేరుతో ఇప్పటికే ఏర్పాటు చేసింది. డిజిటల్ పాలనను బలోపేతం చేసేందుకు, 100 రోజుల్లోగా సమగ్ర నివేదిక ఈ అధికారిక కమిటీ ప్రభుత్వానికి సమర్పించనుంది. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా రాబోయే రోజుల్లో సచివాలయం నుండి క్షేత్రస్థాయి కార్యాలయాల వరకు అన్ని రకాల అనుమతులు, ఫైళ్ల కదలికలు పూర్తిగా ఆన్లైన్ రూపాన్ని సంతరించుకోనున్నాయి. ప్రజా పాలన పూర్తిగా పారదర్శకంగా ఉందనే విధంగా, అవినీతికి ఆస్కారమే లేకుండా చేయలనే లక్ష్యంతో సీఎం ఈ విధానానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్టుగా ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

### తలకు ప్లాస్టిక్ కవర్ చుట్టుకొని, హీలియం గ్యాస్ పీల్చి..

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

**హైదరాబాద్ (గచ్చిబౌలి), అక్టోబరు 11, ప్రభాతవార్త:** తలకు ప్లాస్టిక్ కవర్ చుట్టుకొని, హీలియం గ్యాస్ పీల్చి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొన్నేళ్లుగా ఉన్న అనారోగ్య సమస్యలతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నట్లు నోట్ రాసి తనువు చాలించాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... హర్యానా రాష్ట్రానికి చెందిన సౌరబ్ శేఖర్(36) మాదాపూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. రాయదుర్గంలోని మైహోం భుజాలో ఉంటున్న సోదరుడు లక్ష్య శేఖర్ వద్ద ఉంటున్నాడు. శనివారం సాయంత్రం 2019 బ్యాచ్‌కు చెందిన తన స్నేహితులను కలిసేందుకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కొండాపూర్‌లోని రాజరాజేశ్వరీనగర్‌లో గల వివి హైట్స్‌లో ఉన్నట్లు కుటుంబ సభ్యులకు రాత్రి 7.30 గంటలకు మెసేజ్ పెట్టాడు. కాగా రాత్రి ఇంటికి తిరిరిరాకపోవడం, మరుసటి రోజు కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆదివారం ఉదయం సోదరుడు లక్ష్య శేఖర్ రాజరాజేశ్వరీనగర్‌లోని వివి హైట్స్‌కు వెళ్లాడు. ప్లాట్ నెంబరు 401కి వెళ్లి చూడగా తలకు ప్లాస్టిక్ కవర్, హీలియం గ్యాస్ సిలీండర్ పెట్టుకొని సౌరభ్ శేఖర్ చనిపోయి కనిపించాడు. గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా మనస్థాపంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని, మమ్మీ, పాపా సారీ అంటూ నోట్ రాసి పెట్టి ఆత మ్రహత్య చేసుకున్నాడు. నొప్పి లేకుండా చనిపోయేందుకు హీలియం గ్యాస్ తెచ్చుకొని, ప్లాస్టిక్ కవర్‌తో తలకు చుట్టుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. కాగా సౌరభ్‌కు గత పదేళ్లుగా అన్నం తిన్న వెంటనే కడుపు నొప్పి రావడం, వాంతులు అవుతూ అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమేరకు గచ్చిబౌలి పోలీసులు మ ృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



సౌరభ్ శేఖర్(ఫైల్)

# విమానంలో పవర్ బ్యాంక్‌కు మంటలు

### శంషాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్

**శంషాబాద్ అక్టోబరు 11, ప్రభాతవార్త :** ఢిల్లీ నుంచి చెన్నై వెళ్తున్న ఇండిగో విమానంలో ప్రయాణికుడి పవర్‌బ్యాంక్‌కు మంటలు అంటుకోవడంతో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. అప్రమత్తమైన క్యాబిన్ సిబ్బంది విమానంలోని భద్రతా పరికరా లతో మంటలను వెంటనే అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం విమా నాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో సురక్షి తంగా దించారు. ఈ ఘటనలో ప్రయా ణికులు, సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నారు. పవర్ బ్యాంక్‌కు మంటలు అంటుకోవడానికి గల కారణాలు, దాని బ్రాండ్ వివరాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.



# సూడాన్-ఈజిప్ట్ సరిహద్దులో వైమానిక దాడి

### 13 మంది బంగారు గని కార్మికులు మృతి.. 28 మందికి గాయాలు

**కైరో, అక్టోబరు 11:** సూడాన్, ఈజిప్ట్ సరిహద్దు ప్రాంతంలో జరిగిన వైమానిక దాడిలో కనీసం 13 మంది బంగారు గని కార్మికులు మృతి చెందారు. మరో 28 మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని సూడాన్‌లో కొనసాగుతున్న ఘర్షణలను పర్యవేక్షిస్తున్న సూడాన్ డాక్టర్స్ నెట్‌వర్క్ ఆదివారం వెల్లడించింది. సూడాన్, ఈజిప్ట్, లిబియా దేశాల సరిహద్దులు కలిసే ప్రాంతమైన బోర్డర్ ట్రయాంగిల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో చిన్న తరహా బంగారు గనుల తవ్వకాలు విస్తృతంగా జరుగుతున్నాయి. దాడికి పాల్పడింది ఎవరన్నది తక్షణమే తెలియరాలేదు. ఈ ప్రాంతం నుంచి ఖాళీ చేయాలని ఈజిప్టు అధికారులు గని కార్మికులను పలుమార్లు హెచ్చరించినట్లు తమకు సమాచారం అందిందని సూడాన్ డాక్టర్స్ నెట్‌వర్క్ తెలిపింది. ఈ ప్రాంతం ఈజిప్టు భూభాగంలో భాగంగా ఉన్నట్లు సమాచారం. సూడాన్‌లో కొనసాగుతున్న యుద్ధంలో బంగారం కీలక పాత్ర పోషిస్తోంది. తిరుగుబాటు పారామిలిటరీ దళమైన రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ దర్ఫూర్, కోర్డోఫాన్ ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ తమ కార్యకలాపాలకు నిధులు సమకూర్చుకుంటున్నట్లు సమాచారం. ఈ దాడి నుంచి ప్రాణాలతో బయటపడిన అబ్దెల్ అజీజ్ యూసుఫ్ మీడియాతో మాట్లాడుతూ.. శనివారం ఉదయం పర్వత ప్రాంతంలోని చిన్న తరహా బంగారు గనిపై గుర్తుతెలియని విమానం దాడి చేసిందని తెలిపారు. ఈ ఘటనలో పలువురు మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారని చెప్పారు. తదుపరి దాడులు జరుగుతాయనే భయంతో చాలామంది ఆ ప్రాంతం నుంచి పారిపోయారని వెల్లడించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని, వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్ల మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సూడాన్ డాక్టర్స్ నెట్‌వర్క్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా, సూడాన్ సరిహద్దు ప్రాంతంలో అక్రమంగా బంగారం తవ్వడం, అక్రమ రవాణాకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో ఈజిప్టు భద్రతా దళాలు జూన్‌లో విదేశీయులు సహా వందలాది మందిని అదుపులోకి తీసుకున్నాయి. 2024లో ఐక్యరాజ్యసమితి నిపుణుల బృందం సమర్పించిన నివేదిక ప్రకారం సూడాన్‌లో తవ్విన బంగారంలో 50 శాతానికి పైగా అక్రమంగా దేశం దాటించినట్లు వెల్లడైంది.

# కపిల్ సిబాల్ అసంతృప్తిపై సుప్రీం స్పందన



**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** ఎన్నికల ఓటర్ల జాబితాలో అక్రమాలపై పదే పదే సుప్రీంకోర్టును ఆశ్రయించి విసిగిపోయానని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు. సిబల్ వ్యాఖ్యలపై స్పందించిన సుప్రీంకోర్టు న్యాయవ్యవస్థపై ఆయనకు ఉన్న నమ్మకాన్ని తిరిగి తీసుకువస్తామని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ శనివారం నిర్వహించిన నిరసనలపై సుప్రీంకోర్టు ఆదివారం ప్రత్యేక విచారణ చేపట్టింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరిగిన ఆందోళనల్లో పలువురు నిరసనకారుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామాలపై సిబల్ అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భంలో, సుప్రీంకోర్టు సిబల్ నమ్మకాన్ని తిరిగి పునరుద్ధరించేందుకు మేము ఇక్కడే ఉన్నాం, ఆయన విశ్వాసం మా ఆయుధాగారంలోని అత్యంత బలమైన ఆయుధాల్లో ఒకటి అని వ్యాఖ్యానించింది. దీనికి ముందు సిబల్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాలో అక్రమాలపై పదేపదే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నా ఆశించిన ఉపశమనం లభించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టుకు వెళ్లి మేము విసిగిపోయాం. అక్కడికి వెళ్లడం వల్ల ప్రయోజనం లేదనే భావన నాలో కలుగుతోంది అని అన్నారు. ప్రధాన న్యాయమూర్తిపై అసంతృప్తిగా ఉన్నారా అని ప్రశ్నించగా ఇది వ్యక్తిగత సంతృప్తి లేదా అసంతృప్తికి సంబంధించిన విషయం కాదని, ప్రజల హక్కుల కోసం పోరాడటం న్యాయవాదుల బాధ్యత అని చెప్పారు.

భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించి నిరసనలను అడ్డుకోవడాన్ని సిబల్ ప్రశ్నించారు. శాంతియుతంగా నిరసన తెలిపే వ్యక్తుల వల్ల సమాజానికి ఏం ముప్పని ప్రశ్నించారు. సమాజానికి ప్రమాదం లేదని, ప్రభుత్వానికి ప్రమాదం ఉన్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. నిరసనకారులపై ఢిల్లీ పోలీసుల నిర్బంధంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజేపీ లీగల్ హెడ్ రత్నా సింగ్‌తో పాటు న్యాయవాదులు తారా నరులా, శుభాంగిని శర్మలను అడ్డుకోవడాన్ని కపిల్ సిబల్ ప్రస్తావించారు.

# అందని విద్యుత్, నీరు.. తీవ్ర సంక్షోభంలో ఖరీఫ్

### కళ్ల ముందే ఎండుతున్న పంటలు

### రైతుల కంటిమీద కునుకు కరవు

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త :** తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. అన్నదాతల కష్టాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వర్షాభావ పరిస్థితులు తెలంగాణ అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సాగు కోసం విద్యుత్, బూగర్భ జలాలు, ప్రాజెక్టుల్లో నీరు లేక పొలాలు బీడువారుతున్నాయి. ఆకాశం వైపు చూస్తే వాన జాడ లేకపోగా, మోటరు బోర్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం, ప్రాజెక్టుల్లో అడుగంటిన నీటిమట్టాలు, వేసవిని తలపిస్తున్న ఉష్ణోగ్రతలు ఖరీఫ్ పంటల సాగుపై ప్రభావం చూపుతున్నాయి. పచ్చగా కళకళ్లాడే భూములు బీటలు వారి, చేతికొచ్చిన పంట కళ్లముందే ఎండిపోతుంటే దానిని బతికించుకునేందుకు రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. కాలం కలిసిరాక, మరోవైపు అధికారుల ఉదాసీనత వల్ల తమ పెట్టుబడులు బూడిదవుతున్నాయని రైతులు వాపోతున్నారు. వర్షాభావ పరిస్థితులకు తోడు విద్యుత్ సరఫరాలో అప్రకటిత కోతలు కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం భారీగా పడిపోగా, ఉన్న కొద్దిపాటి పంటను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా భూగర్భ జలాల ఆధారిత వ్యవసాయం ఎక్కువగా ఉండే ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, మెదక్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాపై వర్షాభావం పిడుగులా పడింది. తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల నడుమ ఉమ్మడి జిల్లాల్లో వర్షాలు లేకపోవడంతో బోరుబావులపైనే రైతాంగం పూర్తిగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బోరుబావులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పెరిగి లో వోల్టేజ్ సమస్యలు, సాంకేతిక అంతరాయాలు తప్పడం లేదు. ఫలితంగా బోర్లు ఉన్నప్పటికీ పంటలకు అవసరమైన సమయంలో నీరందక చేలు ఎండిపోతున్నాయని రైతాంగం ఆందోళన చెందుతోంది.

పంట కీలక దశకు చేరిన సమయంలో నీరు అందకపోవడంతో పొలాలు బీటలు తీస్తుండగా, వాటిల్లోని చేలు ఎండిపోయి దిగుబడి పూర్తిగా దెబ్బతింటుంది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట కళ్లముందే ఎండిపోతుంటే పెట్టుబడి వ్యయం ఎంతైనా సరే ముందు పంటను కాపాడుకుందామనే ఉద్దేశంతోనే అప్పులు చేసి మరీ ట్యాంకర్లు, భారీ జనరేటర్లను ఆశ్రయిస్తున్నారు. అద్దెకు జనరేటర్లు తెచ్చి, వాటి ద్వారా బోరు మోటార్లు నడిపిస్తున్నారు. జనరేటర్ అద్దెతో పాటు లీటర్ల కొద్దీ డీజిల్ వాడాల్సి రావడంతో రోజుకు ఎకరాకు దాదాపు రూ. 3 వేల వరకు అదనపు ఖర్చు అవుతోంది. దీంతో రైతులకు పెట్టుబడులు పెరిగిపోయాయి. ఇప్పుడు పంట చివరి దశలో నీటి తడులు అందించడానికి చేస్తున్న డీజిల్ ఖర్చులు రైతులకు తలకుమించిన భారంగా మారాయి. రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేసిన పంటను కళ్లముందే ఎండనివ్వలేక అప్పులు చేసి మరీ డీజిల్ కొనుగోలు చేస్తున్నారు. వరి కంకులు వేసి గింజలు బిగుస్తుండగా, పత్తి పంట ఇప్పటికే చివరి దశకు చేరుకుంది. మిరపలో అధికంగా సంభవించే తెగుళ్లయిన కింది ముడత, పై ముడుత, నల్లి, వైరస్ తోపాటు మొక్క గిడస పోవడం, కాయ తొలుచు పురుగు వంటి అనేక రకాల తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. ఈ క్రమంలో వాటిని అరికట్టేందుకు అనేక వ్యయ ప్రయాసాలకోర్చి క్రిమిసంహారక మందులను వినియోగిస్తున్నారు. ఫర్టిలైజర్ తో పాటు సస్య రక్షణ చర్యలు చేపట్టేందుకు ఎకరాకు 50 వేలకు పైగా పెట్టుబడి అవుతోందని రైతులు వాపోతున్నారు.

# కుటుంబాల్లో జీవనవ్యయ సంక్షోభం

### ప్రతికూలంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ

### నాబార్డు దేశవ్యాప్త సర్వే వెల్లడి

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** నగ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోందని జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) వెల్లడించింది. జూన్, జూలై నెలలకు సంబంధించి గ్రామీణ పరిస్థితులపై సర్వే చేసింది. ఈ నివేదిక ప్రకారాం దేశ వ్యాప్తంగా 53 శాతం మేర గ్రామీణ కుటుంబాల ఆదాయంలో ఎటువంటి పెరుగుదల లేదని స్పష్టం చేసింది. మరోపక్క ఇంకో 20 శాతం కుటుంబాల ఆదాయం గతంలో పోల్చితే క్షీణించిందని తెలిపింది. అయితే 28 శాతం కుటుంబాలు మాత్రం తమ ఆదాయాన్ని పెంచుకున్నాయని వెల్లడించింది. కాగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రజలను తీవ్రంగా వేధిస్తోందని పేర్కొంది. అలాగే గ్రామీణులకు ఉపశమ నాన్ని ఇచ్చే ప్రభుత్వ సబ్సిడీలు, సంక్షేమ పథకాల వాటా కూడా పడిపోయిందని నివేదికలో పేర్కొంది. గత ఏడాది జనవరిలో గ్రామీణ కుటుంబ సగటు ఆదాయంలో ప్రభుత్వ సబ్సిడీలు, సంక్షేమ పథకాల నిధుల వాటా 10 శాతం ఉండగా, అది క్రమేపీ 8 శాతానికి తగ్గిందని వివరించింది. గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 74 శాతం కుటుం బాలు రోజువారీ ఖర్చులు విపరీతంగా పెరగడంతో పొదుపు చేసుకునే అవకాశం లేక తీవ్ర జీవన వ్యయ సంక్షోభంలో కూరుకుపోతున్నాయని తెలియ చేసింది. ప్రతీ కుటుంబం తమ నెలవారీ ఆదాయంలో 66శాతం చొప్పున దాదాపు మూ డింట రెండొంతులు కేవలం కుటుంబ పోషణ, నిత్యావసర ఖర్చులకే వ్యయం చేయాల్సి వస్తోందని వివరించింది.

### రైతు సంఘాల నాయకుల హర్షం

**గజ్వేల్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** దేశానికి అన్నం పెట్టే అన్నదాతలను చిన్నచూపు చూసే అధికారుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిందేనని రైతు సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. గజ్వేల్ తహసీల్దార్ స్వామిని ప్రభుత్వం సస్పెండ్ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన నిరుపేద రైతు ఏసు పట్ల తహసీల్దార్ హోదాలో ఉన్న స్వామి అవహేళనగా మాట్లాడిన ఘటనపై రైతు సంఘాల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతు సమస్యలను అధికారులు ఓపికగా విని పరిష్కరించాల్సిన బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి రైతులను కించపరిచేలా వ్యవహరించడం దురదృష్టకరమని మండిపడ్డారు.

**రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదు**

రైతులు తమ భూముల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే గౌరవంగా మాట్లాడి న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారం ఉందనే అహంకారంతో సామాన్య ప్రజలను, రైతులను అవమానించే ధోరణికి అధికారులు స్వస్తి చెప్పాలన్నారు. తహసీల్దార్ స్వామి సస్పెండ్‌తో సరిపెట్టకుండా ఘటనపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఉద్యోగం నుంచి తొలగించాలని రైతు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇతర అధికారులకు కూడా గుణపాఠం కావాలని, భవిష్యత్తులో ఏ రైతుకు ఇలాంటి అవమానం ఎదురుకాకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని, రైతుల గౌరవానికి భంగం కలిగించే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

# గజ్వేల్ తహసీల్దార్ స్వామి సస్పెన్షన్



గజ్వేల్ తహసీల్దార్ స్వామి

**తహసీల్దార్ సస్పెన్షన్‌పై సోషల్ మీడియాలో చక్కర్లు**

గజ్వేల్ తహసీల్దార్ స్వామిపై ప్రభుత్వం సస్పెండ్ వేటు వేయడంతో గజ్వేల్ పట్టణంలో ఉన్న అన్ని సోషల్ మీడియా గ్రూపుల్లో ప్రతి ఒక్కరూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి హర్షం వ్యక్తం చేశారు. తహసీల్దార్ స్వామి తీరుపై మాజీ మంత్రి కెటిఆర్‌తో పాటు ప్రముఖ నాయకులు చక్రధర్‌గౌడ్‌లు స్పందిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కల్వకుంట్ల కవిత

# ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లకు పూర్తి అధికారాలు ఉండాలి

### టిఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లకు పూర్తి అధికారాల కోసం కృషి చేయాలని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లు వేర్వేరుగా ఉండాలని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు, పార్లమెంట్ మాజీ సభ్యురాలు కల్వకుంట్ల కవిత చెప్పారు. రాష్ట్రంలో ఆనేక కమిషన్‌లు ఉన్నప్పటికి వాటి ఆదేశాలను కోర్టులు కొట్టివేస్తున్నాయని, అందుకే పూర్తి అధికారాల సాధన కోసం కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. తెలంగాణ ఎస్సీ అండ్ ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఛైర్మన్‌గా రిటైర్డ్ హైకోర్టు జడ్జిని నియమించాలని' చేపట్టిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. కమిషన్‌కు ఛైర్మన్‌గా రిటైర్డ్ జడ్జినే ఉండాలన్న విషయానికి తాను వ్యతిరేకమని, చదువుకుని చట్టాలు తెలిసి కష్టపడి పనిచేసే రాజకీయ నాయకుడు కూడా ఛైర్మన్ పదవి అర్హులేనని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఎసీ ్స, ఎస్టీ కమిషన్‌లను వేర్వేరుగా ఏర్పాటు చేస్తామని, ఈ పద్ధతి ఎపిలో కూడా అమలు జరుగుతున్నదని, అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడతామని చెప్పారు. హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లకు ఛైర్మన్‌లుగా హైకోర్టు మాజీ జడ్జిలను నియమించాలని కోరడం మంచిదేనని, ఇది న్యాయమైన డిమాండేనన్నారు. మను ధర్మశాస్త్రం ఎంతో దుర్మార్గమైనదని, వివక్షతలను తీసుకువచ్చిందని ఆరోపించారు. దేశంలో ఇంకా అంటరాని తనం, మూఢనమ్మకాలు కొనసాగుతున్నాయని వీటిని రూపు మాపడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మతాంగి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎసీ ్స, ఎస్టీ కమిషన్‌కు ఛైర్మన్‌గా రిటైర్డ్ హైకోర్టు, జిల్లా జడ్జిలనే ప్రభుత్వం నియమించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ,ఎస్టీ సంఘాల నాయకులు చింతల రాజలింగం, ప్రొఫెసర్ ముత్తన్న, పి.ఎం.రాజు, ఇస్మాయల్, తులసీదాస్, చైతన్య, మారయ్య, లోకిని రాజు, లక్ష్మణ్‌నాయక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గోవా-హైదరాబాద్ డ్రగ్స్ నెట్‌వర్క్‌పై పోలీసుల ఉక్కుపాదం

### పరారీలో ఉన్న నిందితుడు గోవాలో అరెస్ట్

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు అనుమానిస్తున్న నెట్‌వర్క్‌పై తెలంగాణ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఈగల్ బృందం, హైదరాబాద్ సిటీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి, పరారీలో ఉన్న నిందితుడు కస్టోడియో ఫెర్నాండెస్ అలియాస్ క్రిస్టీని గోవాలో అరెస్టు చేశారు. పంజాగుట్ట డ్రగ్స్ కేసు విచారణలో గోవాతో సంబంధాలు బయటపడటంతో పోలీసులు ఆ దిశగా ప్రత్యేక దృష్టి సారించారు. నిందితుడు గోవాలో ఉన్నట్లు సమాచారం అందడంతో పక్కా ప్రణాళిక ప్రకారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. గతంలో పంజాగుట్ట పోలీసులు నిర్వహించిన దర్యాప్తులో 13 గ్రాముల ఎండీఎంఏ, 7 గ్రాముల చరస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా డ్రగ్స్ సరఫరా వెనక ఉన్న వ్యక్తులు, వారి మధ్య సంబంధాలు, నగదు లావాదేవీలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తున్నారా? ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుడి మొబైల్ ఫోన్‌లో హైదరాబాద్‌కు చెందిన పలువురి పేర్లు, ఫోన్ నంబర్లను పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న తెలంగాణకు చెందిన 25 మందికి పైగా వ్యక్తుల వివరాలను సేకరించారు. అయితే జాబితాలో పేర్లు ఉన్నంత మాత్రాన వారంతా నేరానికి పాల్పడినట్లు భావించలేమని, వారి పాత్రపై దర్యాప్తు ద్వారా స్పష్టత రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. నిందితుడి మొబైల్ ఫోన్ డేటా, బ్యాంకు లావాదేవీలను విశ్లేషిస్తూ పోలీసులు కీలక ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. గోవా నుంచి హైదరాబాద్‌కు వచ్చి డ్రగ్స్ సరఫరా చేసి, నగదు వసూలు చేసినట్లు అనుమానిస్తున్న వ్యక్తులను కూడా విచారిస్తున్నారు. డ్రగ్స్ కొనుగోలుదారులు, సరఫరాదారుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, ఆర్థిక లావాదేవీలు ఈ కేసులో కీలకంగా మారే అవకాశం ఉంది. గోవాతో పాటు బెంగళూరు, ముంబయి, ఢిల్లీ తదితర నగరాల్లోని అనుమానిత సరఫరాదారులు, కొనుగోలుదారుల వివరాలపైనా అధికారులు నిఘా పెట్టారు.

# డేటా కేంద్రాల రక్షణ, భద్రత కీలకం

### ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** డేటా రక్షణ, డేటా గోప్యతను కాపాడటం, డిజిటల్ వ్యవస్థలను సురక్షితంగా ఉంచడానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో బిలియన్స్ ఎఐ సెంటర్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏఐ సాధనాలను ఉపయోగించేటప్పుడు అవి ఎంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నాయో పరిశీలించాల్సి ఉందన్నారు. ఎఐ వినియోగంలో బాధ్యత, పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని తెలిపారు. సాంకేతికతను ఉపయోగించుకోవడంతోపాటు దాని ద్వారా ఎదురయ్యే సవాళ్లపైనా దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను ప్రోత్సహించడానికి దృష్టి సారించాలని సూచించారు. డిజిటల్ భద్రతకు ప్రాధాన్యమిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని హితవు చెప్పారు. సంప్రదాయ విద్యావిధానాలకు సాంకేతికతను జోడించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యారంగంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక మార్పులు తీసుకొస్తోందని అన్నారు. ఏఐ ఆధారిత పరిష్కారాలు విద్యార్థుల అభ్యాస ప్రక్రియను మరింత మెరుగుపరుస్తాయని ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రాక్టీస్, లెర్నింగ్ కోసం ఎడ్యుకేషన్ టెక్నాలజీని వినియోగించుకోవడం సంతోషకరమని చెప్పారు. నీట్ పేపర్ లీక్ తర్వాత .. డేటా లీక్ అరికట్టాల్సిన అవసరం మరింత పెరిగిందని అన్నారు. ఇంపాక్ట్ 2025 సర్వే ప్రకారం ఎడ్యుకేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్న పిల్లల్లో 77 శాతం మంది ప్రాక్టీస్, లెర్నింగ్ కోసం వినియోగిస్తున్నారని వివరించారు. విద్యాసంస్థల్లో ఎదురయ్యే సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు అందుబాటులోకి రావాల్సి ఉందని అన్నారు. డిజిటల్ వ్యవస్థల భద్రత, డేటా విశ్లేషణలో ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.



ఆదివారం బస్‌భవన్ వద్ద జరిగిన సభలో ప్రసంగిస్తున్న టిఎంయు ప్రధాన కార్యదర్శి, జెఎసి వైస్‌చైర్మన్ థామస్‌రెడ్డి

# ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియను వేగవంతం చేస్తాం

### టిఎంయు ప్రధానకార్యదర్శి, జెఎసి వైస్‌చైర్మన్ థామస్‌రెడ్డి

**హైదరాబాద్ (చిక్కడపల్లి) అక్టోబరు 11, ప్రభాతవార్త :** ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియను వేగవంతం అయ్యే విధంగా తమవంతు కృషి చేస్తామని టి ఎం యు ప్రధాన కార్యదర్శి, జేఏసీ వైస్ చైర్మన్ థామస్ రెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన సభలో థామస్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎంప్లాయిస్ యూనియన్ ఆర్టీసీ ఎన్నికలలో ఘనవిజయం సాధించిన సందర్భంగా ఆయన .. ప్రభాతవార్త తో మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంలో సీఎం రేవంత్ రెడ్డి , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు ఎండీ నాగి రెడ్డి ని కలిసి వివరిస్తామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులందరికీ చెల్లించాల్సిన 2017 పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని, దీనికి సంబంధించి బ్యాంకు గ్యారంటీ వంటి అవకాశాలను పరిశీలించాలన్నారు.

ఆర్టీసీ కార్మికులు తమపై ఉంచిన అపారమైన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, పెండింగ్‌లో ఉన్న ప్రతి సమస్య పరిష్కారానికి, కార్మికుల హక్కుల రక్షణకు జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని ఆర్టీసీ కార్మికులందరికీ అంకితం ఇస్తున్నామని, టీఎంయూ నేతలతో పాటు జేఏసీ పూర్తి మద్దతుతో ఈ ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల రక్షణకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సంస్థను లాభాల బాటలో నడిపిస్తూనే కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. ఈ విజయాన్ని ఆర్టీసీ కార్మికులందరికీ అంకితం ఇస్తున్నట్లు నేతలు తెలిపారు. కూటమి నేతలు ఈదురు వెంకన్న, థామస్ రెడ్డి, మోలానా మద్దతుతో కూటమి అధిక్యంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, పెండింగ్ బకాయిల చెల్లింపు, కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

# సింగరేణి నైపుణ్య కొలువుల బాట

### శిక్షణ కేంద్రం నుంచి 112 మంది

### తొలి విడతలో 55 మంది మహిళలు

### సంస్థ సిఎండి డాక్టర్ ప్రకాశ్

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** సింగరేణి ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు కల్పించాలన్న సింగరేణి సంకల్పం సత్ఫలితాలనిస్తోంది. రామగుండం-1 ఏరియాలోని సింగరేణి జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా తాజాగా 154 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. దీనికి 127 మంది మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ మేరకు సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో ఇంటర్వ్యూకు హాజరైన 87 మంది హైదరాబాద్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 25 మంది పురుష అభ్యర్థులు సోలార్ టెక్నిషియన్లుగా ఉద్యోగాల్లో చేరనున్నట్లు తెలిపారు. ఫాక్స్‌కాన్కు ఎంపికైన మహిళల్లో తొలి విడతగా 55 మంది గోదావరిఖని నుంచి హైదరాబాదుకు బయలుదేరినట్లు వెల్లడించారు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఈ కేంద్రం స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలను అందిస్తోంది. గత రెండేళ్లలో 500 మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించింది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటోంది. మహిళలకు తయారీ రంగంలో అవకాశాలు ఫాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో గత వారం జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో మహిళా అభ్యర్థులకు ప్రత్యేక ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని కంపెనీ తయారీ కేంద్రంలో ఆపిల్ ఇయర్‌పాడ్స్, ఎలక్ట్రానిక్ విడిభాగాల అసెంబ్లింగ్ విభాగాల్లో పనిచేసేందుకు 87 మంది మహిళలను ఎంపిక చేశారు. స్థానిక మహిళలకు పారిశ్రామిక రంగంలో లభించిన ఈ అవకాశాలు వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడనున్నాయని ఈ సందర్భంగా ప్రకాష్ పేర్కొన్నారు. సోలార్ టెక్నిషియన్ కోర్సులో శిక్షణ పొందిన 25 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆర్జీ-1 జీఎం డి. లలిత్ కుమార్ తెలిపారు. వీరు పది రోజుల్లో ఎల్ అండ్ ఎన్ కంపెనీలో ఉద్యోగాల్లో చేరనున్నట్లు పేర్కొన్నారు. నైపుణ్యాలతో భవిష్యత్తుకు పునాదిసింగరేణి ప్రభావిత ప్రాంతాల యువతకు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. శిక్షణను ఉద్యోగ అవకాశాలతో అనుసంధానించడం ద్వారా యువత మెరుగైన భవిష్యత్తును నిర్మించుకునే అవకాశం లభిస్తోందని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో పనిచేస్తూ వృత్తిలో ఎదగాలని సూచించారు.

# భారత్-జపాన్ స్నేహపూర్వక బంధాలు మరింత బలోపేతం కావాలి

### శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు11,ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ సైబర్ గార్డెన్స్‌లో ఆదివారం హైదరాబాద్ జపాన్ ఫెస్టివల్-2026 కార్యక్రమాన్ని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. హైదరాబాద్-జపాన్‌లోని మియోషి నగరాల మధ్య సిస్టర్ సిటీ భాగస్వామ్యం ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శనలను చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జపాన్ సంస్కృతి, కళలు, సాంకేతికత, సంప్రదాయాలను ప్రతిబింబించే స్టాళ్లను సందర్శించారు.



ఆదివారం హైటెక్‌సిటీ సైబర్‌గార్డెన్స్‌లో హైదరాబాద్-జపాన్ ఫెస్టివల్-2026 కార్యక్రమాన్ని ప్రారంభించిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

జపాన్ ప్రతినిధులతో ముచ్చటించి, ప్రదర్శనల విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డిమాట్లాడుతూ "భారతదేశం, జపాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

హైదరాబాద్, మియోషి నగరాల మధ్య ఏర్పడిన సిస్టర్ సిటీ భాగస్వామ్యం 20 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం సంతోషకరమైన విషయమని తెలిపారు. ఇలాంటి అంతర్జాతీయ సాంస్కృతిక కార్యక్రమాలు ఇరు దేశాల ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు విద్య, సాంకేతికత, పరిశ్రమలు, పర్యాటకం, సాంస్కృతిక రంగాల్లో పరస్పర సహకారానికి దోహదపడతాయని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, క్రమశిక్షణ, పారిశ్రామిక అభివృద్ధిలో జపాన్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం కూడా ఐటీ, ఫార్మా, పరిశ్రమలు, ఆవిష్కరణల రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోందని పేర్కొన్నారు. తెలంగాణ, జపాన్ మధ్య విద్యా, పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో మరిన్ని భాగస్వామ్యాలు ఏర్పడాలని ఆకాంక్షించారు. భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన దేశాల మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకాహాషి, మియోషి నగర డిప్యూటీ మేయర్ తెరువో యమజాకి, జపాన్‌కు చెందిన ఇతర ప్రముఖ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు కోల్పోయిన వారందరినీ తీసుకొస్తా

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి ఇదే నా సవాల్. ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా. తేదీ, సమయం చెప్పండి ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకుండా సమగ్ర ప్రక్షాళన జరిగిందని నిరూపించగలరా? ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీల ఓట్ల తొలగింపుపై సమాధానం ఇవ్వండి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ చేశారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓట్లు తొలగించారని ఆరోపించారు. సర్ ప్రక్రియపై తెలంగాణ ప్రభుత్వం,కాంగ్రెస్ నాయకులు లేని పోని ఆరోపణలు చేస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శిస్తూ రాష్ట్రంలోని ఓటరు జాబితా నుంచి పేరు డిలీట్ అయిన ఒక్క ఓటరునైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల ముందుకు తీసుకురాగలరా? అని ప్రశ్నించడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఓటు కోల్పోయిన అర్హుల జాబితాలతో గణాంకాలతో స్పందించారు. హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు పోయానీ, రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల ఓట్ల సవరణ పేరుతో తీసేశారని ఆవేదన చెందారు. ఓట్ల తొలగింపుపై రికార్డులను పరిశీలించి ప్రజలకు వాస్తవాలు చెప్పాలి. ఓటర్ల జాబితాలో ఏమైనా తప్పులుంటే వాటిని సరిదిద్దుకుందాం. మా నాన్న పేరులో చిన్న తేడా చూపి, నా ఓటు తొలగించే ప్రయత్నం జరిగిందనీ పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఓటరు జాబితా సమగ్ర ప్రక్షాళన చేస్తే సరిగా చేయాలని అర్హులను తమకు ఓటు వేయరని పూర్వనిర్ధారిత అభిప్రాయంతో తొలగించడం తగదని వ్యాఖ్యానించారు. ఓటు హక్కు కోసం కొట్లాడే వారిని దూషించకూడదని, ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకూడదని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని కోరారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా చూడటం ఎన్నికల సంఘం బాధ్యత అని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా పెద్దసంఖ్యలో ఓట్లు తొలగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్న క్రమంలో ఎన్ని ఓట్లు తొలగించారు? వాటిలో అనర్హులైన వారి ఓట్లు ఎన్ని? అర్హులైన వారి ఓట్లు పొరపాటున తొలగించారా? అనే అంశాలపై స్పష్టమైన వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఓట్ బచావో, దేశ్ బచావో నినాదంతో పోరాడాల్సిన అనివార్యత కల్పించారని ఆవేదన చెందారు. సమగ్ర ఓటర్ల సవరణలో పొరపాట్లను సరిదిద్దడానికి ఎబివిపి,బిజెపి, కార్యకర్తలు కూడా భాగస్వాములు కావాలని ప్రజాస్వామ్యానికి మేలు జరుగుతుందని పొన్నం పిలుపు నిచ్చారు. సర్‌పై జరుగుతున్న ఆందోళనలను తప్పుబడుతూ, ఓటు హక్కు కోల్పోయిన వారు ఎవరైనా ఉన్నారా? అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ప్రశ్నించడం సరికాదని మంత్రి పొన్నం తీవ్రంగా మండిపడ్డారు.





ఆదివారం సైబర్ గార్డెన్స్‌లో నిర్వహించిన జపాన్ ఫెస్టివల్-2026 కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి వివేక్

# భారత్-జపాన్ స్నేహ బంధం దీర్ఘకాలికం

### సైబర్ గార్డెన్స్‌లో ఘనంగా జపాన్ ఫెస్టివల్-2026

### పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్,అక్టోబరు11,ప్రభాతవార్త:** భారతదేశం, జపాన్ దేశాల మధ్య ఎన్నో ఏళ్ల నుంచి మంచి స్నేహ సంబంధాలు కొనసాగుతున్నాయని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. రెండు దేశాల మధ్య పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక సహకారం ఆధారంగా దీర్ఘకాలిక స్నేహ బంధాన్ని కొనసాగిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్‌లో జపాన్ ఫెస్టివల్-2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలంగాణ రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. సాంకేతికత, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, విద్య, సాంస్కృతిక మార్పిడి వంటి రంగాల్లో భారత్, జపాన్ మధ్య సంబంధాలు మరింత అభివృద్ధి చెందాయని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, పారిశ్రామిక అభివృద్ధి రంగాల్లో ముందు వరుసలో ఉందని, ముఖ్యంగా పెట్టుబడులు, ఆధునిక తయారీ, సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో హిరోషిమా ప్రిఫెక్చర్ తో సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని వివరించారు. హిరోషిమా శాంతికి, స్థిరత్వానికి, మానవ సంకల్పానికి ప్రతీకగా గౌరవించబడుతోందన్నారు. భారత్‌జపాన్ దేశాల మధ్య ఉన్న స్నేహ బంధాన్ని మనం గొప్పగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మరింత సహకారం, ప్రజల మధ్య సంబంధాలతో భారత్, జపాన్ మధ్య బంధాలను ఇంకా బలోపేతం చేసుకోవాలని కోరుకుంటున్నామని తెలిపారు.

# రాష్ట్రంలో 20.33 లక్షల ఇళ్లకు సోలార్ కరెంటు

### మొత్తం 4066 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ మఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద యుటిలిటీలెడ్ అగ్రిగేషన్ (యుఎల్ఎ) నమూనా కింద 4,066 మెగావాట్ల ఉమ్మడి సామర్థ్యంతో తెలంగాణలో రూఫ్‌టాప్ సోలర్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధంగా రాష్ట్రంలో మొత్తం 20.33 లక్షల గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసే లక్ష్యంగా చర్యలు చేపట్టింది. రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (రెడ్కో) అమలు చేస్తున్న ఈ కార్యక్రమం, గృహ విద్యుత్ బిల్లులను తగ్గించడం, స్వచ్ఛమైన ఇంధనాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు విద్యుత్ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో అర్హులైన కుటుంబాలకు 3 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ కోసం రూ.78 వేల వరకు ఆర్థిక సహాయం అందనుంది. రాష్ట్రంలోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ రిధిలో 2,023 మెగావాట్ల లక్ష్య సామర్థ్యంతో ప్లాంట్ల ఏర్పాటు కోసం 10,11,533 గృహాలను గుర్తించారు. కేంద్ర నూతన మరియు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ మొదటి దశలో 20,175 ప్లాంట్ల ఏర్పాటుకు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. గ్రామీణ సౌరశక్తి వినియోగం కోసం, రూఫ్‌టాప్ సిస్టమ్‌లు, వ్యవసాయ పంపుసెట్‌ల కొరకు ప్రభుత్వం రూ.943.47 కోట్లు మంజూరు చేసింది. ఇందులో 80,698 మెగావాట్ల సామర్థ్యం గల 40,349 గృహ రూఫ్‌టాప్ సిస్టమ్‌ల కోసం రూ.306.66 కోట్లు, 1,26,038 మెగావాట్ల సామర్థ్యం గల 16,805 వ్యవసాయ పంపుసెట్‌లను సౌరశక్తితో నడిపించడానికి రూ.636.81 కోట్లు కేటాయించింది. ఈ కార్యక్రమం 80 గ్రామాలలో 40,349 కుటుంబాలను కవర్ చేస్తుంది, ఇందులో దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ పరిధిలోని 43 గ్రామాలలో 14,898 కుటుంబాలు ఉన్నాయి. గుర్తించిన 8,964 వ్యవసాయ పంపుసెట్‌లు కూడా ఈ యుటిలిటీ పరిధిలోకి వస్తాయి. ఈ నెల 9వ తేదీ నాటి డేటా ప్రకారం 79,976 రిజిస్ట్రేషన్లు, 62,818 ఇన్‌స్టాలేషన్‌లను నమోదు చేసింది, వీటి మొత్తం సామర్థ్యం 831.872 మెగావాట్లుగా ఉంది. పీఎం సూర్య ఘర్ కింద, 44,662 రిజిస్ట్రేషన్లకు గాను 125.613 మెగావాట్ల సామర్థ్యంతో 29,816 వ్యవస్థలను ఏర్పాటు చేశారు. నెట్‌మీటరింగ్ విభాగంలో 640.852 మెగావాట్ల సామర్థ్యంతో 29,777 వ్యవస్థలను ఏర్పాటు చేశారు. మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమంలో 3,190 వ్యవస్థలను ఏర్పాటు చేయగా, పీఎంకుసుమ్ కాంపోనెంట్ ఎ కింద 35 వ్యవస్థలను ఏర్పాటు చేశారు.

# అథ్లెటిక్స్‌లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

### జిల్లా అథ్లెటిక్స్‌లో 9 పతకాలు కైవసం

### 3 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలు

**హైదరాబాద్,అక్టోబరు11,ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ పరుగు, క్షేత్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి మొత్తం 9 పతకాలు సాధించారు. వీటిలో మూడు స్వర్ణాలు, మూడు రజతాలు, మూడు కాంస్య పతకాలు ఉన్నాయి. అండర్10 బాలికల విభాగంలో సీహెచ్ లాస్యశ్రీ 60, 200 మీటర్ల పరుగు పందాల్లో స్వర్ణ పతకాలు సాధించింది. లంక పార్వతి ఈ రెండు విభాగాల్లో రజత పతకాలు గెలుచుకుంది. అండర్10 బాలికల లాంగ్‌జంప్‌లో సాన్విక గౌడ్ కాంస్యం, అండర్12 బాలికల లాంగ్‌జంప్‌లో ఎం.అశ్విని రజత పతకం సాధించారు. అండర్14 బాలికల 60 మీటర్ల పరుగులో సింధం వజ్ర వరుణవి కాంస్య పతకం గెలుచుకుంది. బాలుర విభాగంలో అండర్12 300 మీటర్ల పరుగులో సీహెచ్ రితేష్ రజతం, సీహెచ్ జీవన్ కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థుల విజయాలపై పాఠశాల సిబ్బంది ,యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించేందుకు ప్రోత్సహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది తెలిపారు.





జిల్లా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సాధించిన పతకాలతో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ విద్యార్థులు

# రాష్ట్రంలో రూ.2,800 కోట్ల ముద్రా రుణాలు

### 1.20 లక్షల మందికి మంజూరు

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ముద్రా యోజన పథకం తెలంగాణలో చిన్న వ్యాపారాలు నిర్వహించే వారికి, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే ఔత్సాహికులకు ఆర్థికంగా అండగా నిలుస్తోంది. స్వయం ఉపాధిని ప్రోత్సహించడం, చిన్న వ్యాపారాలకు ఆర్థిక సహాయం అందించడం, స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలు. మహిళా సాధికారతకు కూడా ఈ పథకం ప్రాధాన్యం ఇస్తోంది. ముద్రా రుణాల ద్వారా చిన్న పరిశ్రమలను ప్రారంభించడంతో పాటు, ఇప్పటికే ఉన్న వ్యాపారాలను విస్తరించుకునే అవకాశం కలిగింది. 2026 జూన్ 30 నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, తెలంగాణలో 1,20,000కు పైగా ముద్రా రుణ ఖాతాల ద్వారా రూ.2,800 కోట్లకు పైగా రుణాలు మంజూరయ్యాయి. తెలంగాణలో 45 వేల మందికి పైగా మహిళా లబ్ధిదారులకు రూ.508.13 కోట్ల రుణాలు అందించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ముద్రా యోజనలో నాలుగు రకాల రుణ కేటగిరీలు ఉన్నాయి. శిశు కేటగిరీలో రూ.50 వేల వరకు రుణాలు అందిస్తారు. కొత్తగా చిన్న వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి ఈ కేటగిరీ ఉపయోగపడుతుంది. తెలంగాణలో ఈ విభాగంలో 41 వేలకు పైగా ఖాతాల ద్వారా రూ.183.64 కోట్లు మంజూరయ్యాయి. కిశోర్ కేటగిరీలో రూ.50 వేల కంటే ఎక్కువ నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు పొందవచ్చు. ఈ విభాగంలో తెలంగాణలో 65 వేలకు పైగా ఖాతాల ద్వారా రూ.1,112.81 కోట్లు మంజూరయ్యాయి. తరుణ్ కేటగిరీ కింద రూ.5 లక్షలకు మించి రూ.10 లక్షల వరకు రుణాలు అందిస్తారు. రాష్ట్రంలో ఈ కేటగిరీలో 14 వేలకు పైగా ఖాతాల ద్వారా రూ.1,218.65 కోట్లు మంజూరయ్యాయి. ఇక తరుణ్ ప్లస్ కేటగిరీ కింద రూ.10 లక్షలకు మించి రూ.20 లక్షల వరకు రుణాలు పొందే అవకాశం ఉంది. తెలంగాణలో ఈ విభాగంలో 2 వేలకు పైగా ఖాతాల ద్వారా రూ.379.29 కోట్లు మంజూరయ్యాయి.

# సిఎం బంధుప్రీతి వల్లే బొగ్గులేక కరెంటు కష్టాలు

### కృష్ణా, గోదావరిలో నీళ్లున్నా రాష్ట్రంలో పెరిగిన కరవు : హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సిఎం రేవంత్‌రెడ్డి అవినీతి బంధుప్రితితో..బామర్దికి బొగ్గు ఉత్పత్తి టెండర్లు దక్కడానికి ప్రయత్నించడంతోనే థర్మల్ ప్రాజెక్టులకు బొగ్గులేక విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయి కరెంట్ కోతలు ప్రారంభమై నాయని.. దీనికి తోడు కృష్ణా, గోదావరిలో పుష్కలంగా నీళ్లనా కాళేశ్వరం, కల్వకుర్తి, దేవాదుల మోటార్ల కట్‌కలు ఆన్ చేయక పోవడం తోనే కరువు వచ్చిందని మాజీ మంత్రి,బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా ఆవిర్భావానికి 10 యేండ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వచ్చిన కరువు కాదు కాలం తెచ్చిన కరువు కావు ఇది కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన కరువు అన్నారు.సిఎం రేవంత్‌రెడ్డి చేత గానీ తనంతోనే కరువు వచ్చిందన్నారు.కల్వకుర్తి, దేవాదుల,కన్నెపల్లిలో కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు 24 గంటల మోటార్లు నడిపించారని సిఎం రేవంత్‌రెడ్డి మాత్రం 24 గంటలు మోటార్లు నడిపించకుండా రైతులను అరిగోసపెడుతున్నారని తెలిపారు.దేశం అంతా కరువు వచ్చిన తెలంగాణలో కరువు లేకుండా కెసిఆర్ 2 పంటలకు సాగునీరు అందించి రైతులను ఆదుకున్నారని తెలిపారు. కృష్ణ,గోదావరి జలాలను ఎత్తిపోయనందుకు సిఎం రేవంత్‌రెడ్డి వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఎపి సిఎం వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కుప్పంకు నీరు తీసుకెళ్తుంటే పక్కనే ఉన్న మన ప్రాంతానికి కరవు వచ్చిందన్నారు. పగ, ప్రతికారం, కుళ్లు, కుట్రలతో రేవంత్‌రెడ్డి సర్కార్ పని చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో కరువు,కరెంటు కోతలు ప్రారంభమయ్యాయన్నారు. రైతుల కోసం కెసిఆర్ రైతు బీమా తెస్తే కాంగ్రెస్ సర్కార్ రద్దు చేసిందన్నారు. సిద్దిపేటకు వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి 45 రోజుల్లో రైతు భరోసా నిధులు ఇస్తానని చెప్పిన నేటికి పూర్తిస్థాయిలు అమలు కాలేదన్నారు. ఎకరానికి రైతు భరోసా ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని దేవుళ్ల మీద ఒట్టేసి రుణమాఫీ చేస్తానని చెప్పి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా రైతులను మోసం ఘరన మోసగాడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు ఎగవేతల రేవంత్‌రెడ్డి అన్నారు. నాడు తెలంగాణ ఉద్యమానికి , కొత్త జిల్లాల ఏర్పాటుకు సిద్దిపేట ాంది కాగా తిరిగి బిఆర్ఎస్ అధికారంలోకి రావడానికి సిద్దిపేట నుంచే ఉద్యమం ప్రారంభం కావాలన్నారు.జిల్లాను ఇవ్వడంతో పాటు సాగునీరు తెచ్చిన కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు రంగనాయకసాగర్ నుంచి తెచ్చిన గోదావరి జలాలతో కెసిఆర్ చిత్ర పటానికి జలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శ్రీనివాస్, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్యే సతీష్‌బాబు, ప్రతాప్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం జిల్లా మొదటి కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్లు శ్రీనివాస్,వెంకటయ్య, సినీ హీరో సంపూర్ణేష్‌బాబులను ఘనంగా సత్కారించారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

### స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయకుంటే

# టిడిపి కార్యాలయాల ముట్టడి

### జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 11, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత కోర్టులను సాకుగా చూపి రిజర్వేషన్‌లు తగ్గించి ఎపి సిఎం ఎన్.చంద్రబాబునాయుడు బిసిలను మోసం చేస్తున్నారని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. బిసిలు తెలుగుదేశం పార్టీకి వెన్నెముక అని గొప్పలు చెపుతూనే మరొక ప్రక్క రిజర్వేషన్‌లు తగ్గించి వెన్ను విరుస్తున్నారని ఆయన విమర్శించారు. ఆదివారం నాడిక్కడ బిసి కార్యాలయంలో జరిగిన బిసి సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బిసిలపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను నిలిపివేసి చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్‌కళ్యాణ్ ఢిల్లీ వెళ్ళి ప్రధాని నరేంద్రమోదీని కలిసి 24 గంటల్లో రిజర్వేషన్‌లు సాధించడం పెద్ద విషయం కాదన్నారు. రిజర్వేషన్‌లు తగ్గించి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బిసిలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని, అవసరమైతే టిడిపి కార్యాలయాలను ముట్టడించడానికి కూడా వెనుకాడరని జాజుల హెచ్చరించారు. ఈ సమావేశానికి బిసి కులా సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్‌చారి అధ్యక్షత వహించగా, సమావేశంలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, కులక్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, తాడికొండ విక్రమ్‌గౌడ్, శ్యాంకురుమ తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల జెఎన్టీయు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

### కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు

### ప్రస్తుత ప్రాంగణంలోనే కళాశాల కొనసాగించాలి

### సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ విజ్ఞప్తి

**హైదరాబాద్,అక్టోబరు11,ప్రభాతవార్త:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. 2021లో రూ.402 కోట్ల పరిపాలనా అనుమతులతో మంజూరైన జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణం ఇప్పటికీ పెండింగ్‌లో ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. మంధేపల్లి గ్రామంలో 20 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో కళాశాల ప్రస్తుతం అగ్రహారంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలికంగా కొనసాగుతోందని తెలిపారు. కళాశాలను ప్రస్తుత ప్రాంగణం నుంచి మరో ప్రైవేటు భవనానికి తరలించే ప్రతిపాదనలు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలు నిరుపయోగం కాకుండా చూడాలని సూచించారు. ఈ నేపథ్యంలో మండేపల్లి లో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని, కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించేందుకు అనుమతించాలని కేటీఆర్ కోరారు. తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు కళాశాల ప్రస్తుత ప్రాంగణాన్ని ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేయకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

# కాంగ్రెస్ వినతికి 'నో' చెప్పిన సిజెఐ

### పిటిషన్ దాఖలు చేయాలని ఇండియా కూటమికి సూచన



**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** ఎన్నికల అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీల ఇండియా కూటమికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్‌ను కలిసేందుకు అనుమతి లభించలేదు. ఈ అంశంపై సోమవారం సుప్రీంకోర్టుకు ర్యాలీగా వెళ్లి, సీజేఐకి వినతిపత్రం సమర్పించాలని ప్రతిపక్షాలు నిర్ణయించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. భేటీ కోసం చేసిన అభ్యర్థనకు స్పందించిన సీజేఐ వారు లేవనెత్తాలనుకుంటున్న అంశాలు ఇప్పటికే సుప్రీంకోర్టు విచారణలో ఉన్నాయని, అందువల్ల పిటిషన్ దాఖలు చేయాలని సూచించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రాజకీయ పార్టీకి చెందిన ప్రతినిధి బృందాన్ని ఈ విధంగా పరిపాలనా స్థాయిలో కలిసే అధికారం న్యాయస్థానానికి లేదని సీజేఐ స్పష్టం చేసినట్లు సమాచారం. పిటిషన్‌ను విచారించి తీర్పు ఇవ్వడమే న్యాయస్థానం పరిధిలోని అంశమని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు తలుపులు ప్రజలందరికీ 24 గంటలూ తెరిచే ఉంటాయని, ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులను కాపాడేందుకు కోర్టు కట్టుబడి ఉందని ఆయన చెప్పినట్లు సమాచారం. ప్రతిపక్షాల ర్యాలీ మాత్రం యథావిధిగా జరిగే అవకాశముంది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో పాటు పలు అంశాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు, యువజన బృందం కాకోరో జనతా పార్టీ వరుస నిరసనలు చేపడుతున్నాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ ర్యాలీ రాజకీయ పార్టీకి మాత్రమే పరిమితమైనది కాదని, భారతీయులందరికీ సంబంధించినదని పేర్కొన్నారు. సీఈసీతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీనేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా ఒత్తిడి పెంచడమే లక్ష్యమని ఆయన అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ వల్ల బీజేపీ ప్రభుత్వానికి ప్రయోజనం చేకూరిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. గత శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించిన వినతిపత్రంలో ఇండియా కూటమి నాలుగు ప్రధాన డిమాండ్లను ప్రస్తావించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి. ఎన్నికల కమిషనర్లను, ఇతర ఎన్నికల కమిషనర్లను ఎన్నుకునే ప్రక్రియకు చట్టబద్ధమైన రక్షణ కల్పించే 2023 చట్టాన్ని రద్దు చేయాలి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, తొలగించిన 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలి. అన్ని ఎన్నికల్లో మళ్లీ పేపర్ బ్యాలెట్ల విధానాన్ని ప్రవేశపెట్టాలి. గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని నిర్ధారించే ఆధారాలు సమర్పించిన సందర్భాల్లో, ఆ ఎన్నికలను రద్దు చేయాలి. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణకు సంబంధించి ఈ డిమాండ్లను ప్రతిపక్ష కూటమి ముందుకు తెచ్చింది. ఎన్నికల అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు, వాటిపై న్యాయస్థాన నిర్ణయాలు వేర్వేరు అంశాలుగా పరిగణించాల్సి ఉంటుంది.

# కెబిఆర్ పార్క్ చుట్టూ విజయవంతమైన వన్ వే

### చురుగ్గా సాగుతున్న జంక్షన్ల విస్తరణ, ఇతర పనులు

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయ ప్రకటన

**హైదరాబాద్,అక్టోబరు11,ప్రభాతవార్త:** బండి వేగం అందుకునేలోగా పడిపోయే ట్రాఫిక్ సిగ్నళ్లు.. రహదారులను మించిన కూడళ్లు, ఆగుతూ, సాగుతూ వాహనదారులకు నిత్యం నరకం కనిపించే కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రయాణం ఒక్క ఆలోచనతో మారిపోయింది.. ప్రయోగాత్మకంగా పరిశీలించిన వన్‌వే విధానం విజయవంతమైంది. దాంతో దానిని శాశ్వతంగా మార్చివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రయాణం సజావుగా సాగుతోంది. అయితే, ఇందులోనూ చిన్న, చిన్న సమస్యలున్నాయి. వాటన్నింటిని పరిష్కరించి మరింత వేగంగా, క్షేమంగా ట్రాఫిక్ సాగేందుకు జీహెచ్ఎంసీ పనులు చేపడుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా మార్చాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో నగరంలో వివిధ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే కేబీఆర్ పార్క్ పనులను చేపట్టారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న జంక్షన్లు ఎత్తుపల్లాలుగా, కొన్ని చోట్ల పెద్దవిగా, మరికొన్ని చోట్ల చిన్నవిగా ఉన్నాయి. అలాగే ఇతర ప్రాంతాలకు మళ్లే మార్గాలు సక్రమంగా లేవు. ఈ నేపథ్యంలో వాటిని సరైన విధంగా మార్పులు చేస్తున్నారు. ప్రధానంగా అగ్రసేన్ జంక్షన్‌తో పాటు కీలకమైన రోటరీ ఐలాండ్‌ల వద్ద పెద్ద ఎత్తున మార్పులు చేస్తున్నారు. వన్‌వే ట్రాఫిక్ సజావుగా సాగడానికి, వాహనాలు సురక్షి తంగా ఒక లేన్ నుంచి మరో లేన్‌కు మారడానికి వీలుగా ఫిల్మ్ నగర్ జంక్షన్,రోడ్ నెం.45 జంక్షన్ల వద్ద ట్రాఫిక్ ఛానలైజేషన్ ఐలాండ్‌లను (ట్రాఫిక్ విభజన దిమ్మెలు) ఏర్పాటు చేస్తున్నారు. కేబీఆర్ పార్క్ సమీపంలోకి చేరిన వాహనాలు ఎక్కడా ఆగకుండా వెళ్లడంతో పాటు ఎటువంటి ఆటంకం లేకుండా ఎడమ వైపునకు (ఫ్రీ లెఫ్ట్) మళ్లేందుకు, అలాగే ముందుకు సాగేందుకు వీలుగా శాశ్వత వన్‌వే విధానానికి అనుగుణంగా అన్ని జంక్షన్ ఐలాండ్‌లను పునఃనిర్మిస్తున్నారు. వన్‌వే విధానంతో సహజంగానే వాహనాల వేగం పెరుగుతుంది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనదారులు, పాదచారుల భద్రతకు పెద్దపీట వేసేందుకు వాహనాలు ఎక్కడ ఎటు వైపు మళ్లుతాయి.. ఎక్కడా క్రాసింగ్ ఉంది.. ఎక్కడ మళ్లాలనే దానిని చూపేలా రహదారులపై గుర్తులు, సైట్ లైన్స్, క్రాసింగ్ పాయింట్లు, ప్రత్యేక వీవింగ్ జోన్‌ల పనులు చేపడుతున్నారు. ముఫఖం జా కాలేజ్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు 4.3 కిలోమీటర్ల దూరం 6వరుసల ఎలివేటెడ్ కారిడార్ పనులు జోరుగా సాగుతున్నాయి. పర్యావరణహితంగా, వేగంగా నిర్మించేందుకు రూ.1,090 కోట్లతో స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభించారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెం: 1ను అనుసంధానించేలా ప్రత్యేక కనెక్టింగ్ ర్యాంప్ నిర్మిస్తున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్‌తో 5 ప్రధాన ట్రాఫిక్ జంక్షన్‌ల వద్ద ఆగే పని లేకుండా పోతుంది. ఫలితంగా ప్రయాణ సమయం తగ్గడంతో పాటు వాహనాల ఇంధన వినియోగం గణనీయంగా తగ్గి వాహనదారులకు సమయం, డబ్బులు ఆదా అవుతాయి. ఈ ఎలివేటెడ్ కారిడార్‌తో కింద రహదారి విస్తరణ పనులు చేపట్టాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ ఎలివేటెడ్ కారిడార్‌కు బదులుగా రహదారుల విస్తరణ చేపడితే ప్రైవేట్ ఆస్తుల సేకరణకే సుమారు రూ.1000 కోట్లు వెచ్చించాల్సి వచ్చేది. ఆ రూపేణా ఖజానాకు మేలు జరగడంతో పాటు ప్రైవేట్ భూములు సేకరించాల్సిన ఇబ్బంది లేకుండా పోయింది. కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే సజావుగా సాగాలంటే పలు చోట్ల విలువైన ఆస్తులు సేకరించాల్సి వచ్చింది. అందులో ప్రధానమైనవి సినీ నటుడు బాలకృష్ణ ఇంటి స్థలం, శబ్దాలయా స్టూడియో, భవ్య కన్‌స్ట్రక్షన్ భవనం... అయితే, తమ స్థలాలు ఇచ్చేందుకు వారంతా ముందుకొచ్చారు. ఇక్కడ గజం రూ.4 నుంచి రూ.5 లక్షలు పలుకుతోంది. భారీ ధరతో పాటు నగరం నడిబొడ్డున ఉన్న స్థలాలు కావడంతో నివాసం, వ్యాపారానికి ఇవి ఎంతో కీలకమైనవి. బంజారాహిల్స్/జూబ్లీహిల్స్ నుంచి కేబుల్ బ్రిడ్జ్, దుర్గం చెరువు, నాలెడ్జ్ సిటీ (హైటెక్ సిటీ) వైపు వెళ్లే భారీ రద్దీని నివారించాలంటే సినీ నటుడు బాలకృష్ణ ఇంటి ముందున రోడ్ నెం: 45 జంక్షన్‌ను బాగా విస్తరించాల్సి ఉంది. ఇందుకోసం అధికారులు బాలకృష్ణను సంప్రదించగా తాను ఉంటున్న ఇంటి స్థలంలో సుమారు 862.77 చదరపు గజాలు ఇచ్చేందుకుఆయన అంగీకరించారు. ఈ జంక్షన్‌ను విస్తరిస్తే టెక్ పార్కుల వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ జామ్ కాదు. దీంతో ప్రతిరోజూ ప్రధాన ఐటీ హబ్‌లకు వెళ్లే వేలాది మంది ఉద్యోగుల ప్రయాణం సులభమవుతుంది.

# విద్యుత్ కోతలతో రాష్ట్రంలో నిరసనలు తీవ్రం

### నిరంతర సరఫరాకై రైతుల ఆందోళన

### పలు జిల్లాల్లో సబ్‌స్టేషన్ల ముట్టడి, ధర్నాలు

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త :** నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాకై తెలంగాణలో రైతులు చేస్తున్న ఆందోళనలు క్రమేపీ తారాస్థాయికి చేరుకుంటున్నాయి. నిరంతరం, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోన పలు జిల్లాల్లో రైతులు ఆదివారం నిరసనలు చేపట్టారు. రాష్ట్రంలోని పాలమూరు, నిజామాబాద్, సూర్యాపేట తదితర జిల్లాల్లోని రైతులు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాను డిమాండ్ చేస్తూ ఆదివారం విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. విద్యుత్ అంతరాయాలు, కాలువ నీటి కొరత పంటలకు ముప్పు కలిగిస్తున్నాయని, సాగు రుణాల భారాన్ని మరింత పెంచుతున్నాయని ఆవేదనతో రైతులు రోడ్డెక్కినట్లు వారు తెలిపారు. తమ పంటలు కీలక దశలో ఉన్నాయని, విద్యుత్ అంతరాయాల వల్ల తీవ్ర నష్టాలు వాటిల్లవచ్చని వారు అన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో, ఉర్కొండపేట, జాకినాలపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఉర్కొండ మండల సబ్‌స్టేషన్ వద్ద గుమిగూడి నిరసన చేపట్టారు.

# శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ

**తిరుమల, అక్టోబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** అంగరంగ వైభవంగా జరుగనున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్స వాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. అంకురార్పణ సందర్భంగా సేనాధిపతి విష్వక్సే నులు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్య వేక్షించారు. అనంతరం వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టం నిర్వహించారు. విత్తనాలు మొలకెత్తడాన్ని అంకు రార్పణ అంటారు. ఉత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామివారి ఆశీస్సులు పొందడమే ఈ ఘట్టం ఉద్దేశం. సూర్యుడు అస్తమించిన తరువాతే అంకురార్పణ నిర్వహిస్తారు. జ్యోతిష శాస్త్ర సిద్ధాంతాల ప్రకారం చంద్రుడిని సస్యకారక అంటారు. ఈ కారణంగా పగటివేళ అంకురాలను ఆరోపింపచేయడం తగదు. సాయంత్రం వేళ మంచి ముహూర్తంలో అంకురార్పణ నిర్వహిస్తారు. అంకురార్పణంలో పలు పవిత్ర విత్తనాలు నాటడం తెలిసిందే. అంకురార్పణంలో నాటే విత్తనాలు బాగా మొలకెత్తుతాయి. విత్తనాలు బాగా మొలకెత్తడం వల్ల ఉత్సవాలు కూడా గొప్పగా నిర్వహించబడతాయి.

### వివేకా హత్య కేసు..

# శివశంకర్‌రెడ్డికి ఇడి నోటీసులు

**హైదరాబాద్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ఏ5 నిందితుడు దేవిరెడ్డిశివశంకర్‌రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. హత్యకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై ఆరా తీయనుంది. సీబీఐ దర్యాప్తు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో విచారణ చేపట్టనుంది. పీఎంఎల్ఏ చట్టం కింద ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. హైదరాబాద్లోని ఈడీ ఆఫీసులో సోమవారం శివశంకర్ రెడ్డి విచారణకు హాజరుకానున్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న సునీల్ యాదవ్, ఎర్ర గంగిరెడ్డి, దస్తగిరి పాత్రపై గతంలో ఈడీ విచారణ చేపట్టింది. ఈ నెల 14న కడప ఎంపీ వైఎస్. అవినాశ్ రెడ్డిని కూడా ఈడీ ప్రశ్నించనుంది.

### బతుకమ్మ నిమజ్జనం చేస్తున్నారా!

# మొసళ్లతో జర జాగ్రత్త

**హైదారబాద్, అక్టోబరు11,ప్రభాతవార్త:** బతుకమ్మ నిమజ్జనం చేస్తున్నారా? మన ఊరి చెరువే కదా అని అజాగ్రత్తగా నీటి ఒడ్డున ఉండటం మానండి. చాలామంది నదుల దగ్గరకు, సరస్సుల వద్దకు వెళితే జాగ్రత్తగా ఉండాలని చెప్తారు. నీళ్లలో మొసళ్లు ఉంటాయి. అవి దాడులు చేస్తాయని అందుకే చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్తారు. మన ఊర చెరువుల్లో ప్రాజెక్టుల నీటితో మొసలి వచ్చి ఆవాసం చేసుకొంటుందేమో అని ముందు జాగ్రత్తతో వ్యవహరించండి లేదంటే వాటి ప్రమాదానికి గురికావాల్సి వస్తోంది. ఇట ీవల చెరువుల్లోకి మొసలి వచ్చి ఆవాసం ఏర్పాటు చేసుకోవడం సర్వ సాధారణంగా మారింది.
ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లాలో భారీ మొసలి బాలుడి(12)పై దాడి చేసి నీళ్లలోకి లాక్కెళ్లిన సంఘటన బతుకమ్మ నిమజ్జనంలో తెలంగాణ గడ్డమీద పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండండి. గ్రామాల్లో చెరువుల కట్టలపై లైటింగ్ వంటి ఏర్పాట్లు ఉండవు. చీకటిలోనే బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు మహిళలు వెళుతూ అనేక ఇబ్బందులు పడటం రివాజు. ముఖ్యంగా కృష్ణా, గోదావరి,మంజీర నది పరివాహంలో ఉండే గ్రామాల ప్రజలు బతుకమ్మ నిమజ్జనానికి వెళ్లే మహిళలు, చిన్నారులను ప్రమాదాల బారినపడకుండా తగిన ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది.
వనపర్తి జిల్లా అమడబాకుల చెరువకట్టపై భారీ మొసలి ఆదివారం తెల్లవారుజామున కనపడింది. చెరువు సమీపంలోని శివాలయం రాతి కట్టడంపై భారీ మొసలిని సెల్‌ఫోన్ కెమెరాలో బంధించారు. బతుకమ్మ వేడుకలు జరుగుతుండటంతో మహిళలు చిన్నారులు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు వస్తుంటారు. వారం రోజుల క్రితం వనపర్తి జిల్లా పెద్దమందడిలో మొసలి గొర్రెలకాపరి రాంచంద్రయ్యపై దాడి చేయడానికి రాగా కుక్కల అరుపులతో ప్రమాదం నుంచి తప్పించుకొన్నారు. గొర్రెల కాపరి, ఆయన కుమారుడు కురుమూర్తి ఎర్ర కుర్మయ్య పొలం వద్ద రాత్రి గొర్రెల మందని నిలిపారు. అక్కడే తండ్రి, కొడుకులు ఇద్దరు నిద్రించారు.
అర్ధరాత్రి దాటిన తర్వాత గొర్రెల మంద వద్ద నిద్రిస్తున్న రామచంద్రయ్య సమీపానికి ఓ భారీ మొసలి వచ్చింది. మొసలిని గమనించిన కుక్కలు మొరగడంతో కుమారుడు కురుమూర్తి నిద్ర లేచి చూసేసరికి నిద్రలో ఉన్న తండ్రి రామచంద్రయ్య వద్దకు మొసలి చేరుకుంది.
వెంటనే అప్రమత్తమైన కురుమూర్తి తండ్రిని నిద్రలేపి పక్కకు లాగాడు. త్రుటిలో మొసలి దాడి నుంచి తప్పించుకున్నారు. స్థానిక ఎస్సై జలంధర్‌రెడ్డికి ఈ తెలియ జేయడంతో సాగర్ స్నేక్ సొసైటీకి చెందిన కృష్ణ సాగర్, అటవీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఉదయం ఇరువురు ఘటనాస్థలికి చేరుకున్నారు. గ్రామస్థుల సహకారంతో 9 అడుగులు, 270 కిలోల బరువున్న భారీ మొసలిని తాళ్లతో బంధించారు. ఆ తర్వాత అటవీ శాఖ అధికారులకు అప్పగించడంతో కృష్ణ నది తీరం వద్దకు తీసుకెళ్లి అక్కడ సురక్షి తంగా వదిలేశారు.
హైదరాబాద్ నడిబొడ్డున అంబర్‌పేట్‌లోని బతుకమ్మ కుంట వద్ద ఆగస్టులో రెండు మీటర్ల పొడవు, 15 కిలోల బరువున్న చిన్న మొసలిని విపత్తు ప్రతిస్పందన దళం విజయవంతంగా పట్టుకుంది. సంగారెడ్డి జిల్లాలోని కోల్కూర్ సమీపంలో ఉన్న పోల్కమ్మ కుంటలోకి సెప్టెంబరులో ఒక పెద్ద మొసలి వచ్చి చేరింది. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు శివారులోని నక్కవాగులో మచ్చుగూడెం చిట్కూరు శివారులో,పోచారం వద్ద మొసలి నాలుగునెలల క్రితం కనపడింది. మంజీరా నదితో అనుసంధానంగా ఉండటంతో ఇటువైపు మొసలి వచ్చి ఉండవచ్చని అప్పుడు అటవి అధికారులు ధ్రువీకరించారు.
వనపర్తి జిల్లా పాంగల్ మండలం, మహమ్మ దపూర్ గ్రామానికి సమీపంలో ఉన్న కేశనికుంటలో గత అక్టోబరులో మొసలి చేపల వలలో చిక్కుకుంది. ఉదయం పూట స్థానిక జాలర్లు ఈ మొసలిని గమనించి, వన్యప్రాణి సంరక్షణ కార్యకర్తలను సంప్రదించారు. ఎస్సారెస్పీ నీటి వనరుగా ఉన్న నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, కరీంనగర్ పెద్దపల్లి జిల్లాలో చెరువుల్లో కూడా అపడపుడు మొసళ్ల సంచారం ఉంటుంది.

# 70 మ్యూల్ అకౌంట్లతో సైబర్ మోసాలు

### హైదరాబాద్‌లో ఇద్దరి అరెస్ట్

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు (మ్యూల్ అకౌంట్లు) సరఫరా చేస్తూ భారీ మోసాలకు సహకరిస్తున్న ఇద్దరు వ్యక్తులను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు అందించిన సుమారు 70 మ్యూల్ అకౌంట్ల ద్వారా దేశవ్యాప్తంగా 450 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయని, వీటిలో రూ.60 నుంచి 70 కోట్ల వరకు లావాదేవీలు జరిగాయని పోలీసులు ఆదివారం వెల్లడించారు. రామాంతపూర్‌కు చెందిన గుమ్మ రమేశ్ (39), ముదలె అనిల్ (19) అనే ఇద్దరిని నిందితులుగా గుర్తించారు. ఫేస్‌బుక్ ద్వారా పాత రూపాయి నోటుకు రూ.45 లక్షలు ఇస్తామని నమ్మించి, ఓ బాధితుడి నుంచి రూ.7,93,351 వసూలు చేసిన మోసంపై అందిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో భాగంగా దర్యాప్తు చేయగా ఈ భారీ నెట్‌వర్క్ గుట్టు రట్టయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐటీ చట్టంలోని సెక్షన్లు 66డి, 66దీలతో పాటు బీఎన్ఎస్ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించినట్లు సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ డీసీపీ ఎస్. చైతన్య కుమార్ తెలిపారు.

# జ్ఞానేశ్ పేరుతో పేదల ఓట్లు చోరీ

>> ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్ నుంచి గోవాకు వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం గోవాలో గోయ్ రాఖోన్న్ యాత్రలో పాల్గొన్నారు. చీఫ్టెన్స్ స్మారకం నుంచి కున్కోలిమ్ బస్టాండ్ వరకు పాదయాత్ర సాగింది, అక్కడ జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. గోవా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గత నెల 22న పనాజీలో గోయ్ రాఖోన్న్ యాత్ర ప్రారంభమైంది. 27 రోజుల పాటు 40 నియోజకవర్గాలను కవర్ చేస్తూ ఈ పాదయాత్ర సాగుతోంది. ఈనెల 18న యాత్ర ముగియనుంది. గోవా భూములు, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును కాపాడుకోవడమే యాత్ర ప్రధాన ఉద్దేశం. అధికార బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకు గోవా కాంగ్రెస్ విభాగం ఈ యాత్రను నిర్వహిస్తుంది. కాగా, ఈ యాత్రకు మద్దతు ఇచ్చేందుకు గోవా పర్యటనకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వెళ్లాల్సి ఉండగా, ఢిల్లీలోనే ఉండిపోవడంతో వెళ్లలేదు. గోవా సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'రాహుల్ గాంధీ ప్రతినిధిగా నేను గోవాకు వచ్చా, రాహుల్ గాంధీ గోవాకు రావాల్సి ఉన్నా, ఢిల్లీలో నిరసన కార్యక్రమాల నేపథ్యంలో ఆయన రాలేకపోయారు. అందుకే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాహుల్ గాంధీ ప్రతినిధిగా నన్ను ఇక్కడకు పంపించారు' అని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నషాముక్త్ భారత్ గురించి మాట్లాడుతున్నారని, అలాంటప్పుడు గోవాలో డ్రగ్స్ సమస్యను ఎందుకు అరికట్టడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు రవాణా అవుతున్న డ్రగ్స్ కూడా గోవా నుంచే వస్తున్నాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. యువత భవిష్యత్తును కాపాడాలంటే నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంతో పాటు మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గోవా భూములను కాపాడుకోవాలని, అక్కడి సహజ వనరులు, ప్రజల ప్రయోజనాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. బీజేపీకి విభజన రాజకీయాలు అలవాటుగా మారాయని రేవంత్‌రెడ్డి విమర్శించారు. గోవాలో ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ.. గతంలో ఒకసారి తప్పు జరిగిందని, మరోసారి కూడా జరిగిందని వ్యాఖ్యానించారు. 2027లో గోవాలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. నిరుద్యోగం, డ్రగ్స్ సమస్యలు తొలగిపోవాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. ప్రజల భవిష్యత్తు, యువత ఉపాధి, రాష్ట్ర భూముల పరిరక్షణ కాంగ్రెస్ ప్రాధాన్యాలని తెలిపారు. జ్ఞానేష్ కుమార్ పేరుతో మోదీ పేదల ఓట్లను తొలగించాలని చూస్తున్నారని, గోవా ప్రజలు బీజేపీతో విసిగిపోయారని చెప్పారు. మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే గోవా ప్రజలు పరాయి వారిగా మారిపోయె పరిస్థితి ఏర్పడుతుంది, ఇక్కడి భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, గోవా సీఎం ప్రమోద్ సావంత్ కాదు.. ప్రాపర్టీ సావంత్ అని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు, గోవా సీఎం, గోవాను అభివృద్ధి చేసే పనిలో కాకుండా ఇక్కడి ఆస్తులను ఇతరులకు అప్పగించే పనిలో ఉన్నారు' అని ఆరోపించారు. గోవా యువతను డ్రగ్స్‌కు బానిసలుగా మార్చారని, బిజేపీ పాలనలో.. గోవా డ్రగ్స్ సోర్స్‌గా మారిపోయింది, గోవాను డ్రగ్స్ పెడ్లర్స్ అడ్డాగా మార్చారు. ఇది గోవాకు కీర్తిని తెచ్చి పెడుతుందా.. గోవా పేరును చెడగొడుతుందా? అని ప్రశ్నించారు. గోవా యువత డ్రగ్స్ కు బానిసలు కావద్దు, గోవా పేరు చెడిపోవద్దన్నదే మా ఆకాంక్ష' అని చెప్పారు. గోవాలో కాంగ్రెస్ పార్టీకి కాకుండా ఏ పార్టీకి ఓటు వేసినా అది బీజేపీకే చేరుతుంది, డ్రగ్స్ లార్డ్స్, ల్యాండ్ మాఫియా గోవాలో రాజ్యమేలాలా? మీరే ఆలోచన చేయండి' అని పిలుపునిచ్చారు. ఇది రావణ్, రాముడికి మధ్య జరుగుతున్న పోరాటం, రావణ్ అంటే బీజేపీ, రాముడు అంటే కాంగ్రెస్ పార్టీ, రావణ్‌ను ఓడించాలంటే మీరంతా రాముడికి మద్దతుగా నిలబడాలి, రెండుసార్లు గోవా ప్రజలు మోసపోయారు.

# పట్టభద్రుల ఓట్ల కోసం రాజకీయ పార్టీల పరుగులు

### ఓటరు నమోదు కీలకం, గ్రాడ్యుయేట్లలో గుబులు

### డిసెంబర్ 30న పట్టభద్రుల తుది ఓటర్ల జాబితా

### ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు

### అభ్యర్థిత్వాలపై ఇంకా కసరత్తులో బిఆర్ఎస్, బిజెపి

**హైదరాబాద్,అక్టోబరు11,ప్రభాతవార్త:** తెలంగాణలో మరోసారి ఎమ్మెల్సీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరుకుంటోంది. వచ్చే ఏడాది మార్చితో పదవీకాలం ముగియనున్న రెండు కీలక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల పోరుకు రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే తెరలేపాయి. ప్రస్తుతం మహబూబ్‌నగర్-రంగారెడ్డి -హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజక వర్గాలను స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సురభి వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం 2027 మార్చి 29వ తేదీతో ముగియనున్నది. ఈ రెండు స్థానాలను దక్కించుకోవడాన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలు సైతం ఓటర్ల నమోదు ప్రక్రియను అత్యంత సీరియస్‌గా తీసుకున్నాయి. ఈ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకున్న పట్టభద్రులు మాత్రమే ఓట్లు వేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలు పోటాపోటీగా ఎన్‌రోల్‌మెంట్ పనుల్లో తలమునకలయ్యాయి. శాసనసభ లేదా లోక్‌సభ ఎన్నికల్లా కాకుండా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ప్రతి ఎన్నికకు ముందు కొత్తగా ఎలక్టోరల్ రోల్ తయారు చేస్తారన్న విషయం తెలిసిందే. గతంలో ఓటు ఉన్నప్పటికీ ఈసారి కొత్తగా ఫారం18 ద్వారా దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి. ఎన్నికల సంఘం సెప్టెంబర్ 28న నోటిఫికేషన్ విడుదల చేయగా, నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు విధించింది. నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనున్నారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు స్వీకరించి, డిసెంబర్ 30న పట్టభద్రుల తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తా రు. డిగ్రీ పూ ర్తయి మూడేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ అర్హులు కావడంతో అర్హులైన ప్రతి పట్టభద్రుడి చేత ఓటు నమోదు చేయించేందుకు రాజకీయ పార్టీల స్థానిక శ్రేణులు గ్రామాలు, పట్టణాలు, కాలేజీలు, యూనివర్సిటీల వారీగా జల్లెడ పడుతున్నాయి. ఈ ఎన్నికలను రాబోయే రాజకీయ పరిణామాలకు సెమీఫైనల్స్‌గా భావిస్తున్న ప్రధాన పార్టీలు యుద్ధప్రాతిపదికన ఓటర్ల నమోదును నిర్వహిస్తున్నాయి. నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌చార్జులు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను పర్యవేక్షి స్తున్నారు. ప్రైవేట్ ఉద్యోగులు, ఐటీ నిపుణులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువతను లక్ష్య ంగా చేసుకుని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేయించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. తమ సానుభూతిపరులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను స్థానిక నాయకులకు అప్పగించాయి. ఈ ఎన్నికల కోసం ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని సమాయత్తం చేస్తూ డివిజన్లు, మండలాల వారీగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. సాధ్యమైనంత ఎక్కువ మంది పట్టభద్రులను తమ ఖాతాలో వేసుకునేందుకు క్షేత్రస్థాయిలో శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో నమోదు చేసుకున్న పట్టభద్రులే ఓట్లు వేయనుండటంతో ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు మొదలుపెట్టాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ సమస్య, విద్య, నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి అంశాలు ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించే అవకాశముంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉన్న రాజకీయ బలాబలాలే ఫలితాలను నిర్ణయించవు. ఉద్యోగులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, యువతతో పాటు వివిధ వృత్తి సంఘాలు, విద్యార్థి సంఘాలు, గ్రాడ్యుయేట్ ఓటర్లతో అభ్యర్థికి ఉన్న వ్యక్తిగత సంబంధాలు కూడా ఇక్కడ కీలకం. అందుకే ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎంపిక అత్యంత కీలకం కానుంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు పట్టభద్రులతో ప్రత్యక్షంగా సమావేశాలు నిర్వహించడంతోపాటు సోషల్ మీడియా ద్వారా చేరువయ్యే వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి. ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ ఈ 2 స్థానాలకు సంబంధించి అభ్యర్థులను ముందుగానే ప్రకటించి ప్రచారంలో దూసుకెళ్తోంది. ప్రత్యర్థి పార్టీలు బిఆర్ఎస్, బిజెపి కూడా త్వరలోనే తమ వ్యూహాలను తుది రూపానికి తెచ్చి అభ్యర్థులను ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

# నాలుగైదు రోజుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

### బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

**హైదరాబాద్,అక్టోబరు11,ప్రభాతవార్త:** గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నాలుగైదు రోజుల్లో అభ్యర్థులను ప్రకటిస్తామని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే తమ పార్టీ నేతలు ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియపై పూర్తి ఫోకస్ పెట్టారని చెప్పారు. ఈ ఎన్నికల్లో తాను పోటీ చేయాలా? వద్దా? అనేది పార్టీ నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలకు కట్టుబడి ఉంటామని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆశావాహుల పేర్లు ఇప్పటికే అధిష్ఠానానికి పంపించామని వివరించారు. తుది నిర్ణయం అధిష్ఠానానిదేనని టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు పేర్కొన్నారు. అంతకుముందు తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు అధ్యక్షతన రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ విజయవంతంగా 25 సంవత్సరాల ప్రజా పరిపాలనను పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ భేటీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. తెలంగాణలో రెండు గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడింది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఇద్దరు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. అలాగే బీఆర్ఎస్ కూడా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది.

## నేటి అలంకరణ

# శ్రీగాయత్రిదేవి



"ముక్తా విద్రుమ హేమనీల ధవళచ్ఛాయై ముక్తైస్త్రీ క్షణైః
యుక్తామిందు నిబద్ధరత్న మకుటాం తత్త్వార్థ వర్ణాత్మికామ్
గాయత్రీం వరదాభయాంకుశకశాశ్శుభ్రం కపాలం గదాం
శంఖం చక్రమధారవింద యుగళం హసైర్వహంతీం భజే"

దసరా ఉత్సవాలలో రెండవ రోజున సోమవారం దుర్గమ్మ శ్రీ గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిస్తుంది. సకల వేద స్వరూపం గాయత్రీదేవి. అన్ని మంత్రాలకు మూలశక్తి ఆ మాత. ముక్త, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలు కలిగిన అయిదు ముఖాలతో శంఖం, చక్రం, గద, అంకుశం ధరించి దర్శనమిస్తుంది. ఆదిశంకరులు గాయత్రీదేవిని అనంతశక్తి స్వరూపంగా అర్చించారు. ప్రాతఃకాలంలో గాయత్రీ దేవిగా, మధ్యాహ్నకాలం సావిత్రిగా, సాయంసంధ్యలో సరస్వతిగా ఈమె ఉపాసకులతో ఆరాధనలు అందుకుంటుంది. ముఖంలో అగ్ని, శిరస్సులో బ్రహ్మ, హృదయంలో విష్ణువు, శిఖపై రుద్రుడు కొలువు ఉంటారని పురాణాలు చెబుతున్నాయి. గాయత్రి మాతను ధ్యానిస్తే అనంత మంత్రశక్తి కలుగుతుంది. సకల దురిత ఉపద్రవాలు శాంతిస్తాయి. బ్రహ్మ జ్ఞానం కలుగుతుంది. గాయత్రీ ఉపాసన వల్ల బుద్ధి తేజోవంతం అవుతుంది. గాయత్రీ మంత్రజపం చతుర్వేద పారాయణ ఫలితాన్ని ఇస్తుంది.

**అలంకారం :** అమ్మవారిని మెరూన్ (వక్కపొడి) వర్ణంతో ఉన్న పట్టుచీరతో అలంకరిస్తారు.

**పుష్పాలు :** తామరపూలు, కలువ పూలు

**మంత్రం:** "ఓం భూర్భువస్సువః తత స్వితుర్వరేణ్యం భర్గో దేవస్యధీమహి ధియో యోనః ప్రచోదయాత్" అనే మంత్రాన్ని 108 సార్లు జపిస్తూ అమ్మను ధ్యానించాలి.

**నైవేద్యం:** పులిహోర నివేదన చేసి, గాయత్రీ స్తోత్రాలు పారాయణ చేయాలి.

- భట్టిప్రోలు నటరాజకుమార్

## వాల్లో! 'పేలు'టే!



చదువు తున్నా, నిద్రపోతున్నా కొంత మంది చిన్న పిల్లలు అసంకల్పితంగా తలను గోక్కుంటూనే ఉంటారు. పేల సమస్యే ఇందుకు కారణం. చిన్నారి మనస్వి జుట్టేమో ఎప్పుడూ నిర్జీవంగానే కనిపిస్తుంది. తల దువ్వుతుంటే చాలు చుండ్రు పొట్టులా రాలుతుంది. పిల్లల కురులు ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియక సతమతమవుతుంటారు చాలామంది తల్లులు. అలాంటివారికోసమే ఈ చిట్కాలు.

**తడి లేకుండా..** ఆటపాటల్లో మునిగి తేలే చిన్నారులకు చెమట ఎక్కువగా పడుతుంది. పనుల ఒత్తిడో, తరవాత మాట వినరనే అనుమానమో చాలామంది తల్లులు.. తలస్నానం చేశాక తడి పూర్తిగా ఆరకుండానే రబ్బరు బ్యాండ్ పెట్టేస్తారు. ఇలా చేయడం వల్లా చుండ్రు ఇబ్బంది పెడుతుంది. జుట్టూ నిర్జీవంగా మారుతుంది. అలాకాకుండా జుట్టుని పూర్తిగా ఆరనిచ్చాక జడ వేయడం, రోజు విడిచి రోజు తప్పనిసరిగా తలస్నానం చేయడం అలవాటు చేయాలి. ఇలా చేస్తే చుండ్రు దరిచేరదు.

**పేలు లేకుండా...** తలస్నానం చేయ డానికి ముందు కప్పు కొబ్బరి నూనెలో రెండు చుక్కల వేపనూనె కలిపి తలకు రాసి మర్దన చేయండి. అరగంటయ్యాక గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే సరి. ఇలా వారినికోసారి చేస్తుంటే సమస్య దూరమవుతుంది. లేదంటే ఆముదం కొబ్బరినూనె మిశ్రమాన్నీ పట్టించొచ్చు. వేప, ఆముదంలో ఉండే రసాయనాలు, చేదు..పేలు పారిపోయేలా చేస్తాయి.

**నిగనిగలాడేలా:** కొబ్బరినూనెలోపచ్చి ఉసిరి ముక్కలు, కాసిన్ని మెంతులు వేసి మరిగించండి. దీన్ని తలస్నానం చేయడానికి ముందు రాసుకోండి. అలానే శీకాయ, కుంకుడు కాయల్ని నీళ్లల్లో ఉడికించి రసం తీయండి. ఈ మిశ్రమాన్ని గాలిచొరని సీసాలో పోసుకుని నేచురల్ షాంపూలా వాడుకోండి. ఇవి బుజ్జాయి జుట్టుని ఆరోగ్యంగా ఉంచడంతో పాటు నిగనిగలాడేలా చేస్తాయి. ◻

## ఫోన్ ఎవరికీ ఇవ్వొద్దు !



మన ఫ్రెండ్ కదా ! ఓసారి ఫోన్ ఇవ్వు అనగానే ఎందుకు? ఏమిటి అని అడగకుండానే ఇచ్చేస్తాం. 'ఎవరూ తెలియదమ్మా... మా వాళ్లకి ఫోన్ చేసుకోవాలి' అనగానే జాలిపడి చేస్తాం. కానీ జాగ్రత్త! ఆ నమ్మకం, జాలి మనకే ప్రమాదం కావొచ్చు. అలా ఇచ్చి దాడులు, బెదిరింపులకు జరుగుతున్న ఉదంతాలు చాలానే! అందుకే...

ఫోన్ ఇచ్చేముందు భద్రత చూసుకోండి. యాప్ పిన్నింగ్... స్మార్ట్ ఫోన్లు అన్నింటిలోనూ ఇప్పుడు ఈ ఆప్షన్ లభి స్తోంది. దాన్ని ఆన్ చేసు కోండి. అప్పుడు ఎవరైనా కాల్, క్యాలిక్యులేటర్... ఇలా ఏ అవసరానికి తీసుకున్నారో అది మాత్రమే వాడగలుగు తారు. ఫొటోలు, బ్యాంకు, ఇతర యాప్‌లు తెరవలేరు. తెలిసినవాళ్లైనా, తెలియనివాళ్లైనా కాల్ చేసుకోవాలి అంటే ఫోన్ అన్లాక్ చేసి, చేతిలో పెట్టొద్దు. స్వయంగా డయల్ చేసి ఇవ్వండి.లాక్ బటన్ నొక్కడం తప్పనిసరి.

ఎంత స్నేహితులైనా మీ స్క్రీన్‌లాక్, పిన్, పాస్‌వర్డ్ వగైరా చెప్పొద్దు. ఫొటోలు, వాట్సాప్, సోషల్మీ డియా మెసేజ్ లు, పోస్టులు... వ్యక్తిగత సమాచారం కోసం వీలున్నవే వాటికి యాప్ లాక్ పెట్టుకోండి. పాస్వర్డ్, ఫింగర్ ప్రింట్ లేకుండా ఎవరూ తెరవలేరు. మీ సమాచారమూ సురక్షితం. అయితే ఫోన్ ఇచ్చేముందు బ్యాగ్రౌండ్‌లో యాప్స్ అన్నీ తీసేసి ఇవ్వాలి. అన్నీ తీసేసి ఇవ్వాలి. చాలాసార్లు మెసేజ్, ఈమెయిల్ వగైరా చూడా లంటే ఫోన్ లాక్ తెరవాల్సిన పనే ఉండదు. లాక్ స్క్రీన్ మీద నోటిఫికేషన్లలో కనిపిస్తూ ఉంటాయి. అదీ ప్రమాదమే. ఓటీపీలు, ముఖ్యమైన సమాచారం పొరపాటున వేరే వాళ్ల చేతిలో పడగలదు. కాబట్టి, లాక్ స్క్రీన్ మీద అది కనిపించకుండా నోటిఫికేషన్ ప్రివ్యూని ఆఫ్ చేయడం మేలు. ఫొటోలు, వీడియోలు చూపిస్తూ ఒక్కోసారి ఫోన్ ఇస్తుంటాం. చిక్కుల్లో పడటానికి చిన్న ఏమరుపాటు చాలు. కాబట్టి. అలా ఇవ్వాల్సి వస్తే మీరు దగ్గరే ఉండండి. తెలియని వాళ్లు, ఎక్కువగా ఉన్నచోట మరీ జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ఫోన్ తీసుకుని పారిపోవచ్చు. ఎవరికైనా ఫోన్ ఇచ్చాక ఓసారి చెక్ చేసుకోండి. కొత్త యాప్‌లు వేయడం, సెట్టింగులు మారడం, బ్యాంకు, సోషల్ మీడియా అకౌంట్లు తెరిచినట్లు అనిపిస్తే... వాటి పాస్ వర్డ్‌లను మార్చడమే మంచిది. ఇటీవల ఒకమ్మాయి... అలా ఫోన్ ఇచ్చే దాడికి గురైంది. ఇంకొకరు సైబర్ దాడికి ప్రయత్నించారు. గమనిం చాలే కానీ... ఇలాంటి సంఘటనలు చాలానే! తెలిసిన శత్రువుతో కంటే స్నేహితుల ముసుగులో ఉండే నమ్మక ద్రోహులతోనే ప్రమాదం. కావాలని కాకపోయినా తెలిసో తెలియకో కూడా కొన్నిసార్లు మన ఫొటోలు, వివరాలు చేయొచ్చు. బెదిరింపులు, డబ్బులు నష్టం వగైరా ఎదుర్వచ్చు. అవన్నీ వద్దంటే జాగరూకత కావాల్సిందే! ◻

## నేడు ముద్దపప్పు బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లోమూడవ రోజు తంగేడు, గునుగు, బంతి, చెమంతి తదితర పూలను మూడు ఎత్తుల్లో పేర్చి గౌరమ్మను వాటిపై పెడతారు. ఈ రోజు నైవేద్యం : శనగపప్పు, బెల్లం, పాలు

## భక్తితో గుడాన్నం



తమిళనాడులో మధుర మీనాక్షి, మైసూర్ చామండేశ్వరీ అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో గుడాన్నాన్ని నివేది స్తారు. పర్వదినాల్లో పరమాన్నం చేయడం మనందరికీ తెలిసిందే. నిజానికి సరైన కొలతలతో చేస్తే రుచి రెట్టింపు అవుతుంది. అదెలాగంటే.. ముందుగా కుక్కర్లో అరకప్పు బియ్యంలో ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసి గంటసేపు నాన బెట్టాలి. చిట్టి ముత్యాల బియ్యం వాడితే గూడా న్నం చాలా రుచిగా ఉంటుంది. ఇవిలేకపోతే మనం రోజూవాడే బియ్యంతోనే చేసు కోవచ్చు. నాలుగు విజిల్స్ వచ్చేంతవరకూ ఉడికించి బాగా మెదుపుకోవాలి. రెండు కప్పుల బెల్లంలో పావుకప్పు నీళ్ల పోసి కరిగించాలి. బెల్లం ఎప్పుడూ బియ్యానికి నాలుగు రెట్లు ఉండాలి. పాత బెల్లం అయితే అన్నానికి మంచి రంగు వస్తుంది. కరిగిన బెల్లాన్ని వడకట్టుకోవాలి. దీంట్లో అన్నం కలిపి తక్కువ మంట మీద పావుగంటపాటు ఉడికించుకోవాలి. టేబుల్‌స్పూన్ చొప్పున నెయ్యివేసు కుంటూ మధ్యలో కలుపుతూ ఉండాలి. దీనికి అరకప్పు వరకూ నెయ్యి అవసరం అవుతుంది. దీంట్లో రెండు చిటికెల పచ్చ కర్పూరం, చిటికెడు యాలకుల పొడి వేసి బాగా కలిపి దించేయాలి. చివరగా కొంచెం నేతిలో గుప్పెడు జీడిపప్పు వేసి ఎర్రగా వేయించి గుడాన్నంలో కలపాలి. తర్వాత గూడాన్నం ప్రీత మానస అంటూ అమ్మవారిని శ్రద్ధాభక్తులతో ప్రార్థిస్తూ నివేదించడమే.దీన్ని అరటిపండు ముక్కతోకలిపి తమిళనాడు లోని ఆలయాల్లో భక్తులకు ప్రసాదంగా ఇస్తారు. ◻

## చిట్కా

- ఇంటిపని, వంటపని చేస్తున్నప్పుడు మెత్తని స్పాంజితో తయారుచేసిన చెప్పులనే వాడాలి.
- చెప్పులు షూలు పెట్టుకునేందుకు స్టాండ్స్ వాడాలి.
- పొడి చర్మం గలవారు వారానికి ఒకసారి గోరువెచ్చటి నూనెలో పాదాలు కాసేపు వుంచాలి.
- జీర్ణకోశ ఇబ్బందులకు ఆపిల్ ముక్కలకు తేనెకలిపి తీసుకుంటే జీర్ణకోశ ఇబ్బందులు ఉండవు. ◻



ఆదివారం బిసి సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేష్, సి.రాజేందర్ తదితరులు

# బిసిల రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కొట్టి వేయడం ప్రజాస్వామ్య హక్కును కాలరాయడమే

### శాశ్వత పరిష్కారానికి చంద్రబాబు, పవన్ చొరవ తీసుకోవాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 11 ప్రభాత వార్త:** ఆంధ్రప్రదేశ్‌లో బిసిలకు ప్రభుత్వం కల్పించిన 34 శాతం రిజర్వేషన్‌లను సుప్రీంకోర్టు కొట్టి వేస్తూ తీర్పు ఇవ్వడం చాలా బాధకరమని, బిసిల ప్రజాస్వామ్య హక్కును కాలరాయడమేనని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి రాజ్యాంగ సవరణే శాశ్వత పరిష్కారమని, ఇందుకు సిఎం ఎన్.చంద్రబాబునాయుడు చొరవ తీసుకోవాలని ఈ మేరకు లేఖ రాయడం జరిగిందన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 14 బిసి సంఘాలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కోర్టు తీర్పు ప్రకారం ఎపిలో బిసి జనాభా లెక్కలు తీయడం జరిగిందని, అసెంబ్లీలో చట్టం చేశారని, గతంలో జరిగిన మూడు ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయడం జరిగిందని, బలమైన ప్రతిపాదకలలో అసెంబ్లీలో రిజర్వేషన్లు చట్టం చేసినా బలమైన ఆధారాలు ఉన్నప్పటికి సుప్రీంకోర్టు కొట్టివేయడం విచారం కరమన్నారు. బిసిలు 56 శాతం జనాభా ఉంటే విద్యా, ఉద్యోగ రంగాలలో 25 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ అన్యాయం చేస్తున్నారని, ఇక రాజకీయ రిజర్వేషన్‌లు, చట్టసభలలో రిజర్వేషన్‌ల ఊసేలేదన్నారు. గతంలో పలు రాష్ట్రాలలో బిసిలకు ప్రభుత్వాలు రిజర్వేషన్‌లు కల్పిస్తే కొట్టి వేయడం జరిగిందని, ఈశాన్య రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీలకు కలిపి 70 నుంచి 90 శాతం వరకు రిజర్వేషన్‌లు అమలు చేస్తున్నారని, కాని బిసిల విషయానికి వస్తే మాత్రం 50 శాతం పరిమితి చూపడం సరి కాదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఎన్.చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని శాశ్వత పరిష్కారానికి పిఎం నరేంద్రమోదీ ద్వారా చట్టసభలలో రాజ్యాంగ సవరణ చేయించాలని ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిసి నేతలు నీల వెంకటేశ్, సి.రాజేందర్ ముదిరాజ్, పగిళ్ల సతీష్, అనంతయ్య, మోదీ రాందేవ్, అల్లం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# సుచిత్ర ఫ్లైఓవర్ పనులు వెంటనే ప్రారంభించాలి

### ఫ్లైఓవర్‌కు పిండ ప్రదానం

**పేట్ బషీరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** సంవత్సరాలు గడుస్తున్నా నిర్మాణ పనులు జాప్యం కావడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్లోని సుచిత్ర ఫ్లైఓవర్ నిర్మాణ పనుల జాప్యానికి నిరసనగా, ఫ్లైఓవర్ స్తంభాలకు మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు సుచిత్ర ఫ్లైఓవర్‌కు పిండప్రదానం చేశారు.

నేషనల్ హైవే 44 మార్గంలో ట్రాఫిక్ నియంత్రణకు హెచ్ ఎండీఏ, నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో రెండు వేర్వేరు ప్రాజెక్టుల నిర్మాణం కొన సాగుతున్నాయని తెలిసిందే. ప్యారడైజ్ బోయి నపల్లి మీదుగా డెయిరీ ఫామ్ వరకు ఫ్లైఓవర్ 5.32 కిలోమీటర్లకు రెండో ప్రాజెక్ట్ సుచిత్ర నుంచి కొంపల్లి మీదుగా మేడ్చల్ 6 లైన్ల ఫ్లైఓ వర్‌తో అండర్ పాస్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. అయితే సంవత్సరాలు గడుస్తున్నా నిర్మాణ పనులు జాప్యం కావడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైద రాబాద్‌లోని సుచిత్ర ఫ్లైఓవర్ నిర్మాణ పనుల జాప్యానికి నిరసనగా, ఫ్లైఓవర్ స్తంభాలకు మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు సుచిత్ర ఫ్లైఓవర్‌కు పిండ ప్రదానం చేశారు.

నాలుగేండ్లకు సగం పనులేనా..? ఆగిపోయిన ఫ్లైఓవర్ పనులు వెంటనే ప్రారంభించాలి. రిప్ రిప్ సుచిత్ర ఫ్లైఓవర్ అంటూ నినాదాలు చేశారు. 2022లో ప్రారంభమైన నిర్మాణ పనులు మొదట్లో 2024 డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అయితే ఆ టైంకు పూర్తికాకపోవడంతో తిరిగి తుది గడువును జూన్ 2026 వరకు పొడిగించారు. సుచిత్ర నుంచి మేడ్చల్ వరకు నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్ చేతులు ఎత్తేయడంతో పనులు అర్ధాంతరంగా నిలిపివేసినట్లు సమాచారం.

# ఆర్థిక వివాదంతోనే వ్యాపారి హత్య

**పేట్ బషీరాబాద్: అక్టోబరు 11, ప్రభాతవార్త:** బంగారం, వెండి వ్యాపారంలో పెట్టుబడులకు సంబంధించిన ఆర్థిక వివాదం ఓ వ్యాపారి హత్యకు దారితీసింది. కుటుంబ సమస్యలు పరిష్కరిస్తామని, పూజలు నిర్వహిస్తామని నమ్మించి రూ. 25 లక్షలు తీసుకున్న ఇద్దరు వ్యక్తులు వ్యాపారిని హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో నిందితులు సయ్యద్ ఉజ్జమాన్ ఖాస్మీ, హమద్‌లను పెట్‌బషీరాబాద్ పోలీసులు అక్టోబరు 10న అరెస్టు చేశారు. గుండ్లపోచంపల్లికి చెందిన నేమారాం చౌదరి (61) వ్యాపారం చేసేవారు. ఆయనకు ప్రధాన నిందితుడు ఉజ్జమాన్ ఖాస్మీతో చాలాకాలంగా పరిచయం ఉంది. బంగారం, వెండి వ్యాపారంలో పెట్టిన రూ. 30 లక్షల పెట్టుబడికి సంబంధించి ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. కుమార్తె వివాహానికి డబ్బు అవసరం కావడంతో ఉజ్జమాన్ చౌదరిపై కక్ష పెంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. మరో నిందితుడు హమద్‌తో కలిసి హత్యకు పథకం రచించి, సహకరించినందుకు రూ.5 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కుటుంబ సమస్యలకు పరిష్కారం చూపుతానని నమ్మించి అక్టోబరు 2న చౌదరిని రప్పించిన ఉజ్జమాన్ ఆయన నుంచి రూ.25 లక్షలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం హమద్‌కు చెందిన ఆటోలో యాడారం గ్రామ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ గుడ్డతో గొంతు నులిమి హతనయచేసి, మృతదేహాన్ని పొదల్లో పడేశారు. మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి షామీర్‌పేట చెరువులో పడేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. చౌదరి కనిపించడం లేదని అక్టోబరు 3న ఆయన కుమారుడు పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, మరుసటి రోజు మేడ్చల్ యాదారం శివారులో మృతదేహం లభించింది. సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాలతో ఆటో కదలికలను గుర్తించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 1.80 లక్షల నగదు, రెండు స్మార్ట్ ఫోన్లు, నేరానికి ఉపయోగించినట్లు భావిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన రూ.17 లక్షలు ఇంట్లో ఉంచినట్లు ప్రధాన నిందితుడు తెలిపినప్పటికీ, పోలీసులు అక్కడికి వెళ్లేసరికి కుటుంబ సభ్యులు అందుబాటులో లేరు. నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టారు. కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి పర్యవేక్షణలో ఎనిమిది ప్రత్యేక బృందాలు కేసును ఛేదించాయి.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

# హత్యకు గురైన ఐదేళ్ల చిన్నారి

### రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్
### సెక్యూరిటీ గార్డ్‌పై అనుమానిస్తున్న పోలీసులు

**కంటోన్మెంట్,అక్టోబరు 11 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో 5 యేండ్ల చిన్నారిని హత్య చేసి కాళ్లు,చేతులు కట్టేసి నీటి సంపులో పడేసిన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్‌లో జరిగింది. కౌకూర్‌లోని విల్లా ఆర్కిడ్స్ విల్లా నెం 84లో నివాసం ఉంటున్న మిల్టన్ ఫెర్నాండేజ్ అనే వ్యక్తి కూతురు అరేలియా మోజెస్ 5 సంవత్సరాలు అనే చిన్నారి ఈ నెల 10న సాయంత్రం హత్యకు గురైంది. విల్లాలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న విక్రమ్ అనే వ్యక్తి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. కిడ్నాప్ కోణంలో సర్చ్ ఆపరేషన్ చేపట్టిన పోలీసులు సెక్యూరిటీ గార్డ్ ఫోన్ లోకేషన్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎండ్ కావడంతో పోలీసులు టీమ్‌లుగా ఏర్పడి డ్రోన్ సహాయంతో సర్చ్ ఆపరేషన్ చేస్తున్నారు. పాప నివాసం ఉంటున్న విల్లా ఒకే ఎంట్రెన్స్ ఉండడంతో అనుమానం వచ్చి సీసీకెమరాలు తనిఖీ చేయ గా సెక్యూరిటీ గార్డ్ విక్రమ్ అక్కడి నుంచి బయ టకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. బిహార్‌కు చెందిన విక్రమ్ గత కొన్ని నెలల నుంచి సెక్యూ రిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. అతని ప్రవర్తన సరిగ్గా లేక పోవడంతో వారం రోజుల క్రితం అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు విధుల నుంచి తొలగించారు. దీంతో మనస్తాపం చెందిన సెక్యూరిటీ గార్డ్ విక్రమ్ ఈ నెల 10న సాయంత్రం విల్లా అపార్ట్‌మెంట్ వచ్చి ఆడుకుంటున్న పాపను కాళ్లు,చేతులు కట్టేసి నోట్లో బట్టలు కుక్కి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. తల్లిదండ్రులకు ఫోన్ చేసి రూ.20 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. సంపులో పడి ఉన్న పాప మృతదేహాన్ని బొల్లారం పోలీసులు స్వాధీనం చేసుకొని గాంధీమార్చురీకి తరలించారు. నిందితున్ని పట్టుకునేందుకు మల్కాజిగిరి జోన్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేస్తున్నారు.



అరేలియా (ఫైల్)

# ఎస్ఐఆర్‌ను తక్షణమే రద్దు చేయాలి

### జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్ట్ చేయాలి
### వివిధ విద్యార్థి సంఘాల నేతల డిమాండ్

**హైదరాబాద్(ధర్నాచౌక్), అక్టోబర్ 11, ప్రభాతవార్త:** ఎస్ఐఆర్‌ను తక్షణమే రద్దు చేయాలని వివిధ విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో భగత్‌సింగ్ జన్ అధికార్ యాత్ర (ఫేజ్-3) ఆధ్వర్యంలో దిశా స్టూడెంట్స్ ఆర్గనైజేషన్, నౌజవాన్ భారత్ సభ, మజదూర్ బిగుల్ సంఘాల నేతలు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేసించి, డాక్టర్ సుహాస్, మహిపాల్, గణేష్, భార్గవి, శ్రీజ తదితరులు మాట్లాడుతూ ఎన్నికల అవినీతికి పాల్పడిన జ్ఞానేష్‌కుమార్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవినీతికి పాల్పడటం వల్లనే బీజేపీ మూడు పర్యాయాలు అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. సర్ తీసుకువచ్చిన తరువాత ఎన్నికలు జరిగిన బెంగాల్, ఢిల్లీ, ఒరస్సా, బీహార్ తదితర రాష్ట్రాలలో ఎన్నికలన్నీ రద్దు చేసి, మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌చేశారు. బీజేపీ ఆర్ఎస్ఎస్‌లను దేశం నుంచి తరమికొట్టాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వారు పిలుపునిచ్చారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నేతలు



### మోసగించాడని

# డిఐపై మహిళ ఫిర్యాదు

### కేసు నమోదు చేసుకుని డిఐ బాలస్వామిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

**హైదరాబాద్ (సైదాబాద్), అక్టోబరు 11 ప్రభాతవార్త :** ప్రేమ, పెళ్లి పేరుతో డిఐ తనను మోసం చేశాడంటూ ఓ మహిళ సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. 2016 తన ఉద్యోగ నిర్వాహణలో భాగంగా చంద్రాయణ గుట్ట పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా అప్పట్లో అడ్మిన్ ఎస్ఐగా ఉన్న బాలస్వామితో మహిళకు పరిచయం ఏర్పడింది. ప్రేమ, పెళ్లి పేరుతో తనతో శారీరక సంభంధం కొనసాగించి, గత కాలంగా తనను దూరం పెడుతున్నాడని, పెళ్లి చేసుకోమని అడుగగా దాట వేస్తూ తనను మోసగించాడని మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. మహిళ ఇచ్చిన వివరాలు, సాక్ష్యాల ఆధారంగా సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపి ప్రస్తుతం ఖైరతాబాద్ డిఐగా విధులు నిర్వర్తిస్తున్న బాలస్వామిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# 14 నుంచి అగ్రికల్చర్ బిఎస్సీ సీట్లకు కౌన్సెలింగ్

### రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్

**అత్తాపూర్ అక్టోబరు 11,ప్రభాతవార్త :** 2026-27 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని రెగ్యులర్ కోటా బీ ఎస్సీ( ఆనర్స్) అగ్రికల్చర్, బీ టెక్( ఫుడ్ టెక్నాలజీ) కోర్సులలో మిగిలిన సీట్లకి మూడవ దశ కౌన్సిలింగ్‌ని ఈ నెల 14వ తేదీ(బుధవారం), 15 వ తేదీ( గురువారం) నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.

అదేవిధంగా ప్రత్యేక కోటా బీ ఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్, బీ టెక్(ఫుడ్ టెక్నాలజీ) కోర్సులలో మిగిలిన సీట్లకి ఈ నెల 16 వ తేదీ( శుక్రవారం) కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ వివరించారు.

ఈ రెండు కౌన్సిలింగ్‌లు రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరగనున్నాయని ఆయన తెలిపారు. సీట్లు, ఫీజులు, కౌన్సెలింగ్‌కి తీసుకొని రావాల్సిన ధృవపత్రాలు, తదితర వివరాలని విశ్వవిద్యాలయం వెబ్ సైట్‌లో చూడవలసిందిగా తల్లిదండ్రులు, విద్యార్థులకు రిజిస్ట్రార్ సూచించారు.

# ఛాంపియన్‌గా శుభంకర్

**గ్రేటర్ నోయిడా:** గ్రేటర్ నోయిడాలోని జేపీ గ్రీన్స్ గోల్ఫ్ స్పా రిసార్ట్‌లో జరిగిన రూ.2 కోట్ల కపిల్ దేవ్ ఇన్విటేషనల్ టూర్ ఛాంపియన్‌షిప్‌లో శుభంకర్ శర్మ ఆరు స్ట్రోక్‌ల తేడాతో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచాడు. 30 ఏళ్ల ఈ గోల్ఫ్ క్రీడాకారుడు చివరి రౌండ్‌లో మూడు అండర్ 69 స్కోరు నమోదు చేసి మొత్తం 14 అండర్ పార్‌తో ముగించాడు. అతని నాలుగు రౌండ్ల స్కోర్లు 68, 65, 72, 69గా నమోదైంది. రెండు షాట్ల ఆధిక్యంతో రోజును ప్రారంభించిన శర్మ , పార్ ఫైవ్ 12వ హోల్‌లో ఒక ఈగిల్ , మూడు బర్డీలు మరియు రెండు బోగీలతో టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఇటలీకి చెందిన మిషెల్ ఓర్టోలాని (727065 73), బెంగళూరుకు చెందిన మనోజ్ ఎస్ (70716673) ఎనిమిది అండర్ 280 స్కోరుతో సంయుక్తంగా రెండవ స్థానాన్ని పంచుకున్నారు. శర్మ ఫైనల్ రౌండ్‌ను ప్రారంభంలో మూడు బర్డీలతో మొదలు పెట్టినప్పటికీ రౌండ్ మధ్యలో రెండు బోగీలు చేయడంతో ఓర్టోలానీ ఆధిక్యాన్ని తగ్గించుకోగలిగాడు. 10 వ హోల్‌లో అతను చేసిన బోగీ పోటీని మరింత ఉత్కంఠభరితంగా మార్చింది. పార్ ఫైవ్ 12వ హోల్ వద్ద టర్నింగ్ పాయింట్ వచ్చింది. శుభ్ సుమారు 60 నుండి 70 అడుగుల దూరం నుండి పుట్ చేసి ఈగిల్ సాధించాడు. తర్వాత చివరి హోల్స్‌లో తన ఆధిక్యాన్ని కాపాడుకోవడానికి తన షార్ట్ గేమ్ మరియు పుట్టింగ్‌పై ఆధారపడ్డాడు. 16 వ హోల్‌లో గాలికి అతని టీ షాట్ ఒక చెట్టు వెనుకకు నెట్టబడటంతో అతను ఖాళీ ప్రదేశం నుండి కష్టమైన రికవరీ మరియు చిప్ ఆడవలసి వచ్చింది. చివరికి ఆరు షాట్ల తేడాతో గెలిచి టైటిల్ సాధించాడు.



# ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్.. ఎయిర్ పిస్టల్‌లో సిద్ధూకు స్వర్ణం



**ఈజిప్టు:** ఈజిప్టులోని కైరోలో ఆదివారం జరిగిన 2026 ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో భారతానికి చెందిన ఉదయవీర్ సిద్ధూ పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 24 ఏళ్ల అతను ఫైనల్‌లో మొత్తం 240.6 స్కోరు సాధించి, వరుసగా రజత, కాంస్య పతకాలు గెలుచుకున్న జర్మనీకి చెందిన క్రిస్టియన్ రీట్జ్ (240.1), ఇటలీకి చెందిన పాలో మోన్నా (219.8)లను అధిగమించి నిలిచాడు. ఉదయవీర్ అంతకుముందు 585 19 స్కోరుతో నాలుగో స్థానంలో ఫైనల్‌కు అర్హత సాధించాడు. బరిలో ఉన్న మరో భారతీయుడు, జోనాథన్ గావిన్ ఆంటోనీ, క్వాలిఫికేషన్‌లో రెండవ స్థానంలో నిలిచాడు. కానీ అతను కేవలం ర్యాంకింగ్ పాయింట్ల కోసం మాత్రమే పోటీ పడ్డాడు. అజేంద్ర సింగ్ చౌహాన్, సరబ్‌జోత్ సింగ్ క్వాలిఫికేషన్‌లో వరుసగా 14వ, 31వ స్థానాల్లో నిలిచి ఎనిమిది మంది షూటర్ల ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు.




# వన్డేల్లో ఫాస్టెస్ట్ బ్యాటర్లు

## వేగంగా 9 వేలు చేసిన రన్నర్స్

**న్యూఢిల్లీ:** వన్డే క్రికెట్ చరిత్రలో 9 వేల పరుగుల మైలురాయిని చేరుకోవడం ఏ బ్యాటర్‌కైనా ఎంతో ప్రతిష్టాత్మకం. తక్కువ ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించడం వారి స్థిరమైన ప్రదర్శనకు నిదర్శనం. ఈ జాబితాలో భారత క్రీడాకారులు తమ ఆధిపత్యాన్ని స్పష్టంగా చాటుకున్నారు. ప్రపంచంలోని టాప్5 ఫాస్టెస్ట్ బ్యాటర్లలో ఏకంగా నలుగురు టీమిండియా దిగ్గజాలే ఉండటం భారత క్రికెట్ రికార్డుల ప్రాముఖ్యతను స్పష్టం చేస్తోంది. ఈ జాబితాలో భారత రన్ మెషిన్ విరాట్ కోహ్లి వన్డేల్లో అత్యంత వేగంగా 9 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ మైలురాయిని చేరుకోవడానికి కోహ్లికి కేవలం 202 మ్యాచ్‌లు, 194 ఇన్నింగ్స్‌లు మాత్రమే పట్టాయి. నిలకడైన బ్యాటింగ్ తీరు, గొప్ప ఛేజింగ్ స్కిల్స్‌తో విరాట్ ఈ ఆల్‌టైమ్ రికార్డులో మొదటి స్థానంలో నిలిచి తన అగ్రస్థానాన్ని కాపాడుకుంటున్నాడు. అలాగే సౌతాఫ్రికా విధ్వంసకర బ్యాటర్ ఏబీ డివిలియర్స్ ఈ జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు. మైదానం నలుమూలలా వినూత్న షాట్లతో విరుచుకుపడే డివిలియర్స్ 214 మ్యాచ్‌లలో 205 ఇన్నింగ్స్‌లు ఆడి 9 వేల పరుగుల మార్కును దాటాడు. తన వేగవంతమైన బ్యాటింగ్ శైలితో ఎన్నో మ్యాచ్‌ల్లో సౌతాఫ్రికాకు ఒంటిచేత్తో విజయాలు అందించిన ఘనత ఇతనికి ఉంది. టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ (హిట్‌మ్యాన్) ఈ రికార్డు జాబితాలో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. రోహిత్ 224 మ్యాచ్‌లలో 217 ఇన్నింగ్స్‌లు తీసుకుని ఈ మైలురాయిని అధిగమించాడు. వన్డేల్లో మూడు ద్విశతకాలు సాధించిన ఏకైక క్రీడాకారుడిగా రోహిత్ శర్మ క్రీడా ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇక మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ 236 మ్యాచ్‌లలో 228 ఇన్నింగ్స్‌లు ఆడి నాలుగో స్థానంలో నిలిచారు. గంగూలీ 2004లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించారు. ఇక క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ 242 మ్యాచ్‌లలో 235 ఇన్నింగ్స్‌లు ఆడి ఐదో స్థానంలో నిలిచారు. అప్పట్లో వన్డే క్రికెట్‌లో అతివేగంగా ఈ ఘనత సాధించిన ఆటగాడిగా సచిన్ రికార్డు సృష్టించారు.

# నేషనల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్.. జాతీయ ఛాంపియన్లుగా వైదేహి, కేశర్వాణి




**న్యూఢిల్లీ:** ఫెనెస్టా ఓపెన్ నేషనల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో టాప్ సీడ్ వైదేహిచౌధరి, ఆరో సీడ్ మాన్ కేశర్వాణి వరుసగా మహిళల, పురుషుల సింగిల్స్ టైటిళ్లను కైవసం చేసుకున్నారు. రెండు గంటల 15 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో 20 ఏళ్ల శృతి అహ్లావత్‌ను 6-4, 7-5 తేడాతో ఓడించిన వైదేహి తన మూడవ ఫెనెస్టా ఓపెన్ కిరీటాన్ని కైవసం చేసుకుంది. మొదటి సెట్‌లో 5-3 ఆధిక్యంలో ఉన్నప్పటికీ ఆమె పోరాడుతూనే ఉంది. రెండో సెట్‌లో కూడా 5-3 ఆధిక్యంలో ఉన్నా, ఆమె చివరి వరకు పోరాడుతూనే ఉంది. అలాగే పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో, కేశర్వాణి ఒక గంట 37 నిమిషాల పోరులో మూడో సీడ్ నితిన్ సిన్హాను 6-0, 6-4తేడాతో ఓడించి తన తొలిఫెనెస్టా ఓపెన్ టైటిల్‌ను కైవసంచేసుకున్నాడు. కేశర్వాణి ఆధిపత్యంతో ఆటను ప్రారంభించి మొదటి ఆరుగేమ్‌లను గెలుచుకొని, ఒక్కగేమ్ కూడా కోల్పోకుండా తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండవ సెట్ మరింత పోటీగా సాగినా ఆరో సీడ్ ఆటగాడు 3-2 వద్ద ఒక కీలకమైన బ్రేక్ సాధించి, ఆ తర్వాత తన సర్వ్‌ను నిలబెట్టుకొని మ్యాచ్‌ను ముగించాడు. మరోవైపు, 10వ సీడ్ అయిన 16 ఏళ్ల రిభవ్ సరోహా, నాలుగో సీడ్ ఓంరమేష్ పటేల్‌ను 6-4,6-3 తేడాతో ఓడించి బాలురఅండర్18 సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకున్నాడు.

# వరల్డ్ ఛాంపియన్‌గా చైనా

**కైరో:** ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో మలేషియాను ఓడించి, బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్ 2026 టైటిల్‌ను చైనా మరోసారి కైవసం చేసుకుంది. మూడు గేమ్‌ల ఫైనల్‌లో, మలేషియా గట్టి పోటీనిచ్చినప్పటికీ తట్టుకుని, నిర్ణయాత్మక గేమ్‌లో తిరిగి పట్టు సాధించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న చైనా జట్టు 55-46, 55-53, 55-45 స్కోరుతో విజయం సాధించింది. తొలి గేమ్‌లో చైనా ఆధిపత్యం చెలాయించడంతో, ఈ పోటీ ఆ దేశానికే సునాయాస విజయం దక్కేలా కనిపించింది. అయితే మలేషియా పుంజుకుని, ఫైనల్‌ను హోరాహోరీ పోరుగా మార్చింది. పురుషుల సింగిల్స్‌లో 18-22 స్కోరు వద్ద టియూ వెయ్ జీ బాటన్‌ను అప్పగించడంతో, మలేషియా డబుల్స్ బృందం తమ టైటిల్




ఆశలను సజీవంగా ఉంచుకునే యత్నం చేసింది. మహిళల డబుల్స్‌లో జెనెవీ లిమ్, లో జి యు, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇర్ఫాన్ షాజ్మీర్, జెనెవీ లిమ్, అలాగే పురుషుల డబుల్స్‌లో షాజ్మీర్, అహ్మద్ రెడ్జువాన్ రాణించి, మలేషియా రెండవ గేమ్‌ను 55-53 తేడాతో గెలుచుకుని, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీయడంలో సహాయపడ్డారు. చైనా త్వరగానే తమ ఆధిపత్యాన్ని తిరిగి నెలకొల్పి, మలేషియా మొదటి ఇద్దరు సింగిల్స్ ఆటగాళ్లను కలిపి 9పాయింట్లకే పరిమితం చేసి,ఆధిక్యాన్ని సంపాదించింది.

# ఇంటర్ మయామి ఘన విజయం

## డిసి యునైటెడ్ 4-0 తేడాతో ఓటమి



**మయామి:** కెప్టెన్ లియోనెల్ మెస్సీ, స్ట్రైకర్ లూయిస్ సువారెజ్ చెరో రెండు గోల్స్ చేయడంతో ఇంటర్ మయామి సిఎఫ్, డిసి యునైటెడ్‌పై 4-0 తేడాతో ఘన విజయం సాధించింది. ఆట ఆరంభంలోనే ఇంటర్ మయామి ఖాతా తెరిచింది, 3వ నిమిషంలో సువారెజ్ ఈ రెగ్యులర్ సీజన్‌లో తన 14వ గోల్‌ను సాధించాడు. సువారెజ్, తొలి ప్రయత్నంలోనే బంతిని గోల్‌లోకి పంపాడు. మరోవైపు, 16వ నిమిషంలో దీది ఆటగాడు తాయ్ బరిబో చేసిన ప్రయత్నాన్ని సెయింట్ క్లెయిర్ అద్భుతంగా అడ్డుకుని, ఆధిక్యాన్ని నిలబెట్టాడు. ఆ తర్వాత 39వ నిమిషంలో, బెర్టెరామే తలతో అందించిన అసిస్ట్‌ను సద్వినియోగం చేసుకుంటూ, పెనాల్టీ ఏరియా లోపలి నుండి గోల్ చేసి సువారెజ్ ఇంటర్ మయామి ఆధిక్యాన్ని రెట్టింపు చేసి తన బ్రేస్‌ను పూర్తి చేశాడు. రెండవ అర్ధభాగంలో కూడా మయామి తన అద్భుతమైన దాడి ప్రదర్శనను కొనసాగించింది. 60వ నిమిషంలో మెస్సీ ఒక అద్భుతమైన సోలో ప్రదర్శనతో తన రెండవ గోల్‌ను పూర్తి చేసి, ఇంటర్ మయామికి విజయాన్ని ఖాయం చేశాడు. తుది విజిల్ మోగేంత వరకు 40 స్కోరు అలాగే కొనసాగింది, దీంతో ఇంటర్ మయామి తిరిగి విజయాల బాట పట్టి విలువైన మూడు పాయింట్లను కైవసం చేసుకుంది. ఈ విజయంతో, ఇంటర్ మయామి దీది యునైటెడ్‌పై తన అజేయ పరంపరను ఏడుకు (5 విజయాలు, 2 డ్రాలు) పొడిగించింది.

# శరవేగంగా వృద్ధి చెందనున్న భారత్

## ఈ యేడాది 7.3 శాతం వృద్ధి అంచనా




**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** ప్రపంచ ఆర్థిక వృద్ధి, అంతర్జాతీయ వాణిజ్యం మందగించే పరిస్థితులు నెలకొన్నప్పటికీ, 2026లో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగనుందని ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి సంస్థ యుఎన్‌టాడ్ అంచనా వేసింది. ఈ యేడాది భారత ఆర్థిక వృద్ధి రేటు 7.3 శాతంగా ఉండవచ్చని తన ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ రిపోర్ట్‌లో పేర్కొంది. ప్రపంచ ఆర్థిక వృద్ధికి ఆసియా కీలక చోదకశక్తిగా నిలవనుందని వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 2.6 శాతంగా ఉండవచ్చని, అభివృద్ధి చెందుతున్న దేశాల వృద్ధి రేటు సైతం గత ఏడాది 4.7 శాతం నుంచి ఈ యేడాది 4 శాతానికి తగ్గవచ్చని అంచనా వేసింది. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో ఆసియా వాటా 59 శాతంగా ఉండవచ్చని నివేదిక పేర్కొంది. భారత్‌తో పాటు ఇండోనేషియా, చైనా దేశాలు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషించనున్నాయి. భారత్ 7.3 శాతం ఇండోనేషియా 5.2 శాతం చైనా 4.5 శాతం భారత్‌లో బలమైన దేశీయ డిమాండ్, తయారీ రంగం విస్తరణ, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వ పెట్టుబడులు ఆర్థిక వృద్ధికి మద్దతునిస్తున్నాయి. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఈ అంశాలు భారత ఆర్థిక వ్యవస్థకు బలాన్నివ్వనున్నాయని అంచనా. యుద్ధాలు, వాణిజ్య ఆంక్షలు కొనసాగినప్పటికీ, 2025లో ప్రపంచ వాణిజ్యం రికార్డు స్థాయిలో 35 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఎఐ రంగం ద్వారా లభిస్తున్న ఆర్థిక ప్రయోజనాలు ప్రస్తుతం పరిమిత సంఖ్యలోని దేశాలు, సరఫరాదారులకే ఎక్కువగా దక్కుతున్నాయని యుఎన్‌టాడ్ విశ్లేషించింది. ఇంధన ధరల పెరుగుదల, ఎఐ ఆధారిత వృద్ధిపై అనిశ్చితి, అభివృద్ధి నిధుల తగ్గుదల ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక అసమానతలు మరింతపెంచే ప్రమాదం లేకపోలేదని అప్రమత్తంచేసింది.

# భారత్‌లో విద్యుత్ కార్ల తయారీకి ఆడి ఇండియా యోచన



**ముంబయి, అక్టోబరు 11:** ఆడికంపెనీ విద్యుత్ వాహనాలను స్థానికంగా తయారు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు లగ్జరీ కార్ల తయారీ సంస్థ వెల్లడించింది. దీనిపై వచ్చే రెండు నెలల్లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని కంపెనీ ఉన్నతాధికారి తెలిపారు. వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో దేశంలోని లగ్జరీ కార్ల మార్కెట్లో తమ వాటాను ప్రస్తుతమున్న సుమారు 8శాతం నుంచి 15-16 శాతానికి పెంచుకోవాలని సంస్థలక్ష్యంగాపెట్టుకుంది. ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ కంపెనీ భవిష్యత్ వ్యూహాలను వివరించారు. కస్టమర్లకు మెరుగైన సేవలు అందించడం, కొత్త మోడళ్లను మార్కెట్లోకి తీసుకురావడం, డీలర్‌షిప్ నెట్వర్క్‌ను విస్తరించడం ఆధారంగా వృద్ధిని సాధించాలని భావిస్తున్నట్లు తెలిపారు. భారత్‌లో బ్యాటరీ ఎలక్ట్రిక్‌కారును స్థానికంగా తయారు చేసే అంశంపై చర్చిస్తున్నామని ధిల్లాన్ వెల్లడించారు. దీనిపై వచ్చే రెండు నెలల్లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. స్థానిక తయారీ ద్వారా భారత మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో తమ ఉనికిని మరింత బలోపేతం చేసుకోవాలని కంపెనీ భావిస్తోంది. ప్రతిపాదిత భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా భారత్‌లోకి మరిన్ని కార్ల మోడళ్లను తీసుకురావడానికి అవకాశాలు ఏర్పడతాయని ఆడి భావిస్తోంది. దిగుమతి సుంకాలు పోటీకి అనుకూలంగా మారితే, కొత్త మోడళ్లను భారత మార్కెట్లో ప్రవేశపెట్టి వాటికి ఉన్న డిమాండ్‌ను పరీక్షించవచ్చని కంపెనీ అంచనా వేస్తోంది. మార్కెట్లో విక్రయ అవకాశాలు, డిమాండ్ అంచనావేయడానికి ఎఫ్టీఏ మాకు మరిన్ని మోడళ్లను భారత్‌కుతీసుకురావడంలో సహాయపడుతుందని ధిల్లాన్ తెలిపారు. తమ ప్రధాన మోడళ్లకు స్థానిక తయారీపై ఆధారపడటం కొనసాగిస్తామని, అదే సమయంలో దిగుమతులద్వారా భారత వినియోగదారులకు అందుబాటులో ఉండే కార్ల శ్రేణిని విస్తరించనున్నట్లు వివరించారు. ప్రతిపాదిత భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందం భారత ఆటోమొబైల్ పరిశ్రమకు కూడా ఎగుమతి అవకాశాలను అందించగలదని ధిల్లాన్ అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందం ఇరువైపులా మార్కెట్లను మరింతగా తెరిచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# ఈ వారం స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు



**ముంబయి, అక్టోబరు 11:** ద్రవ్యోల్బణ గణాంకాలు, కంపెనీల క్యూ2 ఫలితాలపై ఇన్వెస్టర్ల దృష్టి ముడి చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, అంతర్జాతీయ పరిణామాలతో భారతస్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణుల అంచనా. ప్రధాన కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, దేశీయ ద్రవ్యోల్బణ గణాంకాలు, అంతర్జాతీయ ఆర్థిక సూచీలు, ముడి చమురు ధరల కదలికలు మార్కెట్ దిశను నిర్దేశించనున్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కార్యకలాపాలు, రూపాయి మారకం విలువ, అమెరికా ట్రెజరీ బాండ్ల రాబడులు, భౌగోళిక రాజకీయ పరిణామాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపనున్నాయి.

సెప్టెంబర్ నెలకు సంబంధించిన వినియోగ దారుల ధరల సూచీ, టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ వారం దేశీయ మార్కెట్లకు కీలకం కానున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా కొనసాగడం భారత ఈక్విటీ మార్కెట్లకు ప్రధాన రిస్కుగా మారింది. చమురు ధరలు నిరంతరం పెరిగితే ద్రవ్యోల్బణం, రవాణా వ్యయాలు పెరగడంతో పాటు కంపెనీల లాభాల మార్జిన్లపై ఒత్తిడి పడే అవకాశం ఉందని రాధా కృష్ణన్ వివరించారు. టోకు ద్రవ్యోల్బణ గణాంకాలు కూడా ఇంధనం, రవాణా వ్యయాల పెరుగుదల ఉత్పత్తిదారులపై చూపుతున్న ప్రభావాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడను న్నాయి. అమెరికా ద్రవ్యోల్బణం, ఉపాధి గణాం కాలు, రిటైల్ అమ్మకాల వివరాలు డాలర్ విలువ, ట్రెజరీ బాండ్ రాబడులపై ప్రభావం చూపవచ్చు. యూరప్ ద్రవ్యోల్బణ గణాంకాలు, బ్రిటన్ ఆర్థిక వృద్ధి వివరాలపైనా మార్కెట్‌వర్గాలు దృష్టి సారించ నున్నాయి. త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ ఈ వారం షేర్ల వారీగా కదలికలకు ప్రధాన కారణం కానుంది. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రా వంటి ప్రముఖ ఐటీ కంపెనీలు తమ ఫలితాలను ప్రకటించనున్నాయి. ఎన్రిచ్ మనీ సిఇఒ పొన్ముడి ఆర్ మాట్లాడుతూ, క్యూ2ఫలితాలు ఐటీ షేర్లలో పుంజుకోవడానికి దోహదపడి, ప్రధాన సూచీలకు మద్దతునిచ్చాయని తెలిపారు. ముడి చమురు ధరలే ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థకు, మార్కెట్లకు అతిపెద్ద స్థూల ఆర్థికపరమైన రిస్కు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తంగా ఈ వారం భారత స్టాక్ మార్కెట్ల కదలికలను ప్రధానంగా నాలుగు అంశాలు ప్రభావితం చేయనున్నాయి కంపెనీల క్యూ2 ఫలితాలు ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్, ఇతర ప్రధాన రంగాల పనితీరు ద్రవ్యోల్బణ గణాంకాలు వాటి ఆధారంగా వడ్డీ రేట్లపై మారే అంచనాలు. విదేశీ పెట్టుబడులు కొనుగోళ్లు, అమ్మకాలు, రూపాయి మారకం విలువలు ప్రభావితంచేస్తాయని తెలుస్తోంది.

# పండుగ సీజన్ షాపింగుల్లో ఇ-కామర్స్ సంస్థల జోరు

## తొలి రెండు రోజుల్లో రూ.24వేల కోట్ల విక్రయాలు




**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** దేశంలోని ప్రముఖ ఇ-కామర్స్ మార్కెట్ సంస్థలు పండుగల షాపింగ్ సీజన్ ఘనంగా ప్రారంభించాయి. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, ఫ్యాషన్ ఉత్పత్తుల కొనుగోళ్లు పెరగడంతో తొలి రెండు రోజుల్లోనే సుమారు రూ.24వేల కోట్ల విక్రయాలు నమోదయ్యాయని ఓ నివేదిక వెల్లడించింది. రెడ్సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్ నివేదిక ప్రకారం. అమెజాన్, ఫ్లిప్కార్ట్, మీషో, అజియో వంటి ఆన్లైన్ ప్లాట్ఫామ్‌లు పండుగ సేల్స్ ప్రారంభమైన తొలి రెండు రోజుల్లో 2.5 బిలియన్ డాలర్లకు పైగా, అంటే సుమారు రూ.24,200 కోట్ల స్థూల సరుకుల విక్రయ విలువను నమోదు చేశాయి. దేశవ్యాప్తంగా 89 కోట్ల ఆర్డర్లు నమోదయ్యాయని, సుమారు 66.5 కోట్ల మంది వినియోగదారులు ఈ షాపింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారని కన్సల్టెన్సీ అంచనా వేసింది. సాధారణ రోజుల్లో నమోదయ్యే సగటు రోజువారీ వ్యాపారంతో పోలిస్తే ఈ విక్రయాల విలువ దాదాపు ఆరు రెట్లు అధికంగా ఉంది. పండుగ సీజన్లో వినియోగదారులు ఎంత భారీగా ఖర్చు చేస్తున్నారో ఇది స్పష్టం చేస్తోంది. మొత్తం విక్రయాల్లో స్మార్ట్‌ఫోన్లు అతిపెద్ద వాటాతో ఉన్నాయి. మొత్తం జిఎంవిలో 38-40 శాతం వాటాతో ఈ విభాగం అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం విక్రయాల్లో ఈ విభాగం 25-27 శాతం వాటాను కలిగి ఉంది. ఫ్యాషన్ ఉత్పత్తులు మొత్తం విక్రయాల్లో 15-18 శాతం వాటాను సాధించాయి. తొలి రెండు రోజుల్లో ఈ విభాగంలో సుమారు రూ.363కోట్ల కోట్ల వ్యాపారం జరిగినట్లు నివేదిక పేర్కొంది. పెద్ద గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులకు వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. టెలివిజన్ల విభాగంలో 55 అంగుళాల మోడళ్లకు అధిక డిమాండ్ కనిపించింది. టిసిఎల్, ఎల్జీ, శామ్సంగ్, షావోమీ వంటి బ్రాండ్లకు చెందిన మోడళ్లు టాప్ సెల్లింగ్ ఉత్పత్తుల్లో మూడొంతులకుపైగా వాటాను దక్కించుకున్నాయి. 2026 తొలి ఆరు నెలల్లోనే ఎలక్ట్రానిక్స్ విక్రయాలు 20 శాతానికి పైగా వృద్ధి సాధించాయని రెడ్సీర్ తెలిపింది. పండుగ సేల్స్ తొలి రెండు రోజుల్లో ఎలక్ట్రానిక్స్ ఆర్డర్లు సాధారణ రోజువారీ స్థాయితో పోలిస్తే దాదాపు 14 రెట్లు పెరిగాయి. ల్యాప్‌టాప్‌లు, ఇంటర్నెట్‌కు అనుసంధానమయ్యే స్మార్ట్ పరికరాలకు పెరిగిన డిమాండ్ ఈ వృద్ధికి ప్రధాన కారణమైంది. ఫ్యాషన్ ఉత్పత్తులు కూడా ఆన్లైన్ విక్రయాల వృద్ధికి కీలకంగా మారాయి. ఈ విభాగంలో స్థూల సరుకుల విక్రయ విలువ గత యేడాదితో పోలిస్తే 22-25 శాతం పెరిగింది.

# క్యూ2లో లాభాల వృద్ధి 10%కే పరిమితం

## జెఫరీస్ అంచనాలు




**ముంబయి, అక్టోబరు 11:** భారతకార్పొరేట్ రంగంలో మరో త్రైమాసికఆదాయాల జోరు షురూ అయింది రెండోత్రైమాసిక ఆర్థిక ఫలితాలను వెల్లడించేందుకు ప్రముఖ కంపెనీలు సిద్ధమవుతున్న వేళ, అంతర్జాతీయ పెట్టుబడి బ్రోకరేజ్ దిగ్గజం జెఫరీస్ సంచలన అంచనాలను విడుదల చేసింది. తమ కవరేజీ పరిధిలోని వైవిధ్యభరితమైన కంపెనీలు క్యూ2లో గతేడాదితో పోలిస్తే సగటున 16 శాతం బలమైన అమ్మకాల వృద్ధిని నమోదు చేసే అవకాశముంది. ప్రపంచవ్యాప్తంగా పెరిగిన ముడిసరుకుల ధరలు, అంతరాయం కలిగిన సరఫరా గొలుసులు ఆపరేటింగ్ మార్జిన్లపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయని, దీనికారణంగా నిర్వహణ లాభాల వృద్ధి కేవలం 10 శాతానికే పరిమితం కావచ్చునని హెచ్చరించింది. ఈ ఒత్తిళ్ల నడుమ కూడా అత్యుత్తమ వ్యాపార ప్రదర్శనతో పాలీక్యాబ్ ఇండియా, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా, విగార్డ్ ఇండస్ట్రీస్ షేర్లు మార్కెట్‌లో ప్రత్యేకంగా నిలుస్తాయని బ్రోకరేజ్ సంస్థ స్పష్టం చేసింది. పండుగ డిమాండ్, ప్రీమియమైజేషన్ ట్రెండ్ వల్ల కంపెనీల ఆదాయాలు పెరిగినప్పటికీ, నిర్వహణ లాభాల మార్జిన్లు యేటా 50 బేసిస్ పాయింట్లు తగ్గుతాయని జెఫరీస్ విశ్లేషించింది. కేబుల్స్, వైర్ల విభాగంలో అగ్రగామిగాఉన్న పాలీక్యాబ్ ఇండియా, గ్లోబల్ మార్కెట్లో రాగి ధరలు పెరిగినప్పటికీ ఆ భారాన్ని వినియోగదారులకు బదిలీ చేయడంలో సఫలమైంది. ఈ క్రమంలో పాలీక్యాబ్ రెండవ త్రైమాసికంలో 18 నుండి 20 శాతం అమ్మకాల వృద్ధిని సాధించవచ్చని, 13.5 శాతం ఆపరేటింగ్ మార్జిన్‌తో మెరుగైనస్థానంలోఉంటూ కీలక ఎంపికగా నిలిచిందని నివేదిక పేర్కొంది. ఇదే విభాగంలో ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ సరఫరా పెరగడం వల్ల ఫినోలెక్స్ కేబుల్స్‌కూడా సానుకూలవృద్ధిని కనబరుస్తుందని తెలిపింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగంలో గత యేడాది నాటి తక్కువ బేస్ ఆధారంగా ఎయిర్‌కండిషనర్లడిమాండ్ భారీగా పుంజుకోవడంతో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా బలమైన పనితీరును కనబరిచేందుకు సిద్ధమైంది. సగటున 12శాతం అమ్మకాలవృద్ధితోపాటు పన్నుకు ముందు లాభాల్లో 18 శాతం పురోగతిని సాధించవచ్చని భావిస్తున్నారు. విగార్డ్ ఇండస్ట్రీస్ తన వైవిధ్యభరితమైన ఉత్పత్తుల మిశ్రమంతో మెరుగైన రిస్కురివార్డ్ ప్రొఫైల్‌ను అందిస్తోంది. విగార్డ్ యొక్క వన్‌ఇయర్ ఫార్వర్డ్ పిఇ నిష్పత్తి 28 రెట్లుగా ఉండగా, పాలీక్యాబ్ 34 రెట్లు మరియు ఎల్జీ ఎలక్ట్రానిక్స్ 47 రెట్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. అదే సమయంలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసెస్ రంగంపై జెఫరీస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అధిక మెమరీ ఖర్చులు, బలహీనమైన వ్యయ పద్ధతులు, మునుపటి త్రైమాసికాల గరిష్ట స్థాయిల వల్ల ఈ రంగం లాభదాయకత దెబ్బతినవచ్చని పేర్కొంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.